ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 02.07.2025 | సంపుటి : 11 సంచిక : 344 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370






భూ సమస్యలపై ప్రతీ దరఖాస్తును

## పరిశీలించి పరిష్కరిస్తాం

అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణలో భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తుపై సమగ్ర పరిశీలన ఉంటుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. అన్నింటినీ పరిశీలించి పరిష్కరిస్తామని అన్నారు. మంగళవారం రెవెన్యూ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. భూ సమస్యలను

మిగతా 2లో..



నీటి వాటా తెలంగాణ

# జన్మహక్కు

రాజీపడే ప్రసక్తేలేదు | కిషన్‌రెడ్డి పరోక్షంగా ఆంధ్రాకు సహకరిస్తున్నారు

బనకచర్లను కేంద్రం పూర్తిగా తిరస్కరించలేదు



- తెలంగాణకు మరణశాసనం రాసిన కేసీఆర్, హరీశ్‌రావు
- గోదావరి మిగులు జలాలపై ఏపీకి అనుకూలంగా నిర్ణయం
- జగన్ దిగిపోగానే సెంటిమెంట్‌తో కేసీఆర్ రెచ్చగొడుతున్నారు
- రాష్ట్ర నీటి హక్కులు కాపాడడంలో పూర్తిగా విఫలం
- కాళేశ్వరంతో లక్షకోట్లు వృధా చేశారు
- దానికి మరమ్మతులు చేయాలంటే మరో రూ.50వేల కోట్లు కావాలి
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ జలాల విషయంలో రాజీపడేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి కుండబద్దలు కొట్టారు. రాష్ట్రానికి చెందిన నీటిహక్కులు కాపాడటంలో రాజకీయంగా, సాంకేతికంగా, న్యాయపరంగా పోరాడుతూనే ఉంటామని చెప్పారు. ప్రజాభవన్‌లో 'గోదావరి-బనకచర్ల'పై ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. ప్రజాభవన్ లో బనకచర్ల ప్రాజెక్టుపైనా తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు,ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'నీటిపారుదల శాఖను పదేళ్లపాటు కేసీఆర్, హరీశ్‌రావు చూశారు. రాష్ట్ర నీటి హక్కులను వాళ్లు కాపాడతారని అందరూ భావించారు. కానీ వాళ్లే నష్టం చేశారు. 811 టీఎంసీల్లో తెలంగాణకు 299 టీఎంసీలు చాలని.. 68 శాతం జలాలు ఏపీకి కేటాయిస్తే అభ్యంతరం లేదని 2015లో సంతకం చేశారు. 2015లో కేసీఆర్, హరీశ్‌రావు చేసిన సంతకాలే తెలంగాణకు మరణశాసనంగా మారాయి. కృష్ణా పరివాహక ప్రాంతం పరంగా చూస్తే తెలంగాణకే ఎక్కువ దక్కాలి. ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో కేటాయించిన

మిగతా 2లో..

## కేసీఆర్ హయాంలోనే బనకచర్లకు అంకురార్పణ

గోదావరి జలాలను సీమకు తరలించే యత్నం

పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ఉత్తమ్

హైదరాబాద్(జనంసాక్షి):ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్ట్‌పై ప్రతిపక్షాలు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నాయని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. పోలవరం-బనకచర్లపై కేంద్రానికి మన అభ్యంతరాలను తెలిపామని తెలంగాణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. బనకచర్ల ప్రాజెక్టు గోదావరి వాటర్ ట్రైబ్యునల్ తీర్పునకు వ్యతిరేకమని వాదించామన్నారు. ఏపీ ప్రభుత్వం చేసిన బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదనను కేంద్రం

మిగతా 2లో..

చరిత్రలో తొలిసారి..

## ప్రమాదస్థలానికి ముఖ్యమంత్రి రేవంత్



మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం

తక్షణ సాయం కింద రూ.లక్ష అందజేత

పాశమైలారం ఘటనపై ముఖ్యమంత్రి సీరియస్

ప్రమాదానికి సంబంధించిన వివరాలు తెలుసుకోండి

ఇకముందు ఇలా జరక్కుండా చర్యలు తీసుకోండి

బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

సంగారెడ్డి(జనంసాక్షి): పాశమైలారం ప్రమాదంపై సిఎం రేవంత్ రెడ్డి ఆరా తీసారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించాలని, గతంలో ఇలాగా ఎప్పుడైనా జరిగిందా అన్నది తెలుసుకోవా లన్నారు. ప్రమాద స్థలిని సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారంఉదయం అధికారులు, మంత్రులతో కలసి పరిశీలించారు. అనంతరం పరిశ్రమలశాఖ అధికారులు, మంత్రులతో సమీక్షించారు. ప్రమాదం జరిగిన పరిశ్రమలో పరిశ్రమలశాఖ అధికారులు, బాయిలర్స్ డైరెక్టర్స్ తనిఖీలు చేశారా? బాయిలర్లను తనిఖీ చేసి ఏమైనా సమస్యలు గుర్తించారా? బాయిలర్ల పనితీరుపై యాజమాన్యానికి ఏమైనా సూచనలు చేశారా? అని ప్రశ్నించారు. పరిశ్రమల్లో

మిగతా 2లో..

## 36కు చేరిన మృతుల సంఖ్య

డీఎన్ఏ పరీక్షల అనంతరం శవాల అప్పగింత

2లో

కొనసాగుతున్న సహాయక చర్యలు

సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్

## కాంగ్రెస్‌ను మేమే మేల్కొలిపాం

ముఖ్యమంత్రి ఆరోపణలపై హరీశ్ కౌంటర్



హైదరాబాద్(జనంసాక్షి):ఏపీ నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టు బనకచర్ల విషయంలో కాంగ్రెస్ సర్కారును మొద్దునిద్ర నుంచి లేపింది.. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు తిరస్కరించే వరకు అలుపెరుగని పోరాటం చేసింది బీఆర్ఎస్ పార్టీయేనని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి ఘాటుగా

మిగతా 2లో..



ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు

## బీవీ పట్టాభిరామ్ ఇకలేరు

ముఖ్యమంత్రి రేవంత్ తదితరుల సంతాపం

హైదరాబాద్(జనంసాక్షి): ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీవీ పట్టాభిరామ్ (75) కన్నుమూశారు. హైదరాబాద్‌లో సోమవారం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు.ప్రముఖ ఇంద్రజాలికుడు, మానసిక వైద్యుడిగానూ పట్టాభిరామ్ ప్రసిద్ధి. ఆయనకు భార్య జయ, కుమారుడు ప్రశాంత్

మిగతా 2లో..

సంక్షేమ,గురుకులాల్లో వసతులకు

# లోటురావొద్దు



- హాస్టళ్లలో అధికారులు తరచుగా పర్యటించాలి
- దానికనుగుణంగా హాస్టల్స్ విజిట్ క్యాలెండర్ తయారుచేయండి
- అద్దె భవనాల్లో వసతులపై సమీక్షించండి
- సంక్షేమ విద్యార్థుల హెల్త్ రికార్డ్ రూపొందించండి : డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్(జనంసాక్షి):సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో అధికారుల పర్యటన, సమీక్షపై పకడ్బందీ క్యాలెండర్ రూపొందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రజాభవన్లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏ అధికారి, ఏ రోజు పర్యటించారు.. వారు పరిశీలించిన అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలు రూపొందించాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఈ పర్యటన కార్యక్రమం నిరంతరం సాగాలని, మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలను సైతం పర్యటనకు ఆహ్వానించాలని అధికారులకు సూచించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పెంచిన 40 శాతం డైట్, 200% కాస్మోటిక్ ఛార్జీలను పెంచి, డాక్టర్ల సూచన మేరకు పకడ్బందీ మెనూ ఖరారు చేసాం. ఈమెనూ అన్ని సంక్షేమ హాస్టల్లో, గురుకులాల్లో ప్రముఖంగా కనిపించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. వసతి గృహాల అదే భవనాల్లో వసతులు ఎలా ఉన్నాయి, భవనాలు, యజమానుల వివరాల తో ఒక నివేదిక రూపొందించాలని డిప్యూటీ సీఎం సూచించారు.అన్ని వసతి గృహాల్లో దోమతెరలు ఏర్పాటు చేయాలి, రన్నింగ్ వాటర్ సప్లై లో ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని

మిగతా 2లో..

తప్పుడు పత్రాలతో వాయుసేన

## రన్‌వేనే అమ్మేశారు!



తల్లి ఉషా అన్సాల్, కొడుకు నవీన్ చంద్, స్థానిక అధికారుల కుమ్మక్కు

ఫిరోజ్‌పూర్(జనంసాక్షి): స్వాతంత్ర్యం అనంతరం జరిగిన మూడు యుద్ధాల్లో భారత వాయుసేనకు సేవలు అందించిన ఓ కీలక రన్‌వేను నకిలీ పత్రాలతో అక్రమార్కులు విక్రయించారు. ఈ ఘటన పాక్‌తో సరిహద్దు పంచుకొనే పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్‌లో చోటుచేసుకొంది. 1997లో చోటుచేసుకొన్న ఈ అక్రమాలు తాజాగా వెలుగు చూశాయి. పాకిస్థాన్‌కు అత్యంత సమీపంలోని ఫట్టూవాలా అనే గ్రామంలో భారత వాయుసేనకు ఓ రన్‌వే ఉంది. ఇది 1962లో భారత్-చైనా యుద్ధం, 1965, 1971లో పాక్‌తో జరిగిన యుద్ధాల్లో చాలా కీలక పాత్ర పోషించింది. దుమిని వాలా గ్రామానికి చెందిన ఉషా అన్సాల్, ఆమె కుమారుడు నవీన్ చంద్‌లు స్థానిక అధికారులతో కుమ్మక్కై ఈ రన్‌వే ఉన్న భూమి పేరిట తప్పుడు పత్రాలు సృష్టించారు. 1997లో వేరే వ్యక్తులకు దీనిని విక్రయించారు. నిషాన్ సింగ్ అనే విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి ఈ వ్యహారంపై అధికారులను అప్రమత్తం చేశారు. అయినా.. ఏళ్ల పాటు చర్యలు తీసుకోకుండా జాప్యం చేశారు. కానీ, 2021లో హల్వార ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ కమాండెంట్, ఫిరోజ్‌పూర్ కమిషనర్‌కు దీనిపై లేఖ రాశారు.

మిగతా 9లో..

## రైల్‌వన్

అన్ని సేవలు ఒకే యాప్‌లో..

ప్రారంభించిన కేంద్రమంత్రి

న్యూఢిల్లీ(జనంసాక్షి):రైలుటికెట్ల బుకింగ్‌కో యాప్.. ప్లాట్‌ఫామ్ టికెట్లకు మరో యాప్.. జర్నీలో ఫుడ్ బుకింగ్‌కి ఇంకో యాప్.. ట్రైన్ లైవ్ ట్రాకింగ్‌కి, ప్రయాణంలో సాయానికి.. గత కొంతకాలంగా ఇలా ఒక్కో అవసరానికి ఒక్కో యాప్ వాడుతూ వచ్చుంటారు. అన్నీ ఒక్క చోట ఉంటే బాగుండు కదా అనే ఆలోచన కూడా వచ్చే ఉంటుంది. మీ ఆలోచనకు తగ్గట్టుగా ఇండియన్ రైల్వేస్ ఓ కొత్త యాప్ తీసుకొచ్చింది. అదే 'రైల్‌వన్' సూపర్ యాప్. దీని ఫీచర్లు, వినియోగం తదితర పూర్తి వివరాలు మీ కోసం.. ప్లే స్టోర్/ యాప్ స్టోర్ నుంచి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. మొదటి స్క్రీన్‌లో అడిగిన

మిగతా 2లో..



అట్లైతే.. **కొత్త పార్టీ పెడతా**

'బిగ్ బ్యూటిఫుల్'పై మరోసారి విరుచుకుపడ్డ మస్క్



## దుకాణం బంద్ చేసి దక్షిణాఫ్రికా వెళ్లిపో..

మస్క్‌కు ట్రంప్ తీవ్ర హెచ్చరికలు

వాషింగ్టన్(జనంసాక్షి):బిల్లు గనుక ఆమోదం పొందితే ఆ మర్నాడే తాను రాజకీయ పార్టీని ప్రకటిస్తానని మస్క్ తాజాగా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. బిగ్ బ్యూటీఫుల్ బిల్లుపై

మిగతా 2లో..



వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన బిగ్ బ్యూటిఫుల్ బిల్లును ఎలాన్ మస్క్ వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి ఆ బిల్లుపై ఆయన విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా బిల్లుకు ఆమోదం లభిస్తే మరుసటి రోజే కొత్త పార్టీ ఏర్పాటు చేస్తానంటూ హెచ్చరికలు కూడా చేశారు. బిగ్ బ్యూటిఫుల్ బిల్లుపై మస్క్ మొదటి నుంచి వ్యతిరేకంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ వ్యతిరేకత నేపథ్యంలో అధ్యక్షుడికి, టెస్లా అధినేతకు మధ్య విభేదాలు కూడా తలెత్తాయి. ఇటీవల ఈ బిల్లుకు సెనెట్‌లో ఆమోదం లభించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ బిల్లుపై విరుచుకుపడుతూ మస్క్ ఎక్స్ వేదికగా వరుస పోస్టులు పెట్టారు. సామాజిక సంక్షేమ కార్యక్రమాలని తగ్గించి.. అమెరికన్ల రుణాన్ని పెంచే ఈ ప్రజాదరణ లేని బిల్లుకు మద్దతిచ్చే చట్టసభ సభ్యులను పదవీచ్యుతు ల్ని చేస్తానని బెదిరింపులకు దిగారు.ఈ బిల్లు పిచ్చిదని స్పష్టంగా కన్పిస్తుందన్నారు. ఇది రుణపరిమితిని భారీగా 5 ట్రిలియన్ డాలర్లకు పెంచుతుందని పునరుద్ఘాటించారు. ఇప్పుడు ప్రజల గురించి శ్రద్ధ వహించే కొత్త రాజకీయ పార్టీకి సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన చట్టసభ సభ్యులపై కూడా పలు విమర్శలు చేశారు. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గిస్తామని వారు తొలుత ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు రుణభారాన్ని పెంచే బిల్లుపై ఓటు వేస్తే సిగ్గుతో తలదించుకోవాల్సి వస్తోందని విమర్శించారు. ఈ ఖర్చును పెంచే బిల్లు ఆమోదం పొందితే.. మరుసటిరోజే 'ది అమెరికా పార్టీ' ఏర్పడుతుందని హెచ్చరించారు. అమెరికాకు డెమోక్రటిక్-రిపబ్లికన్ యూని పార్టీకి ప్రత్యామ్నాయం కావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

## గాజాపై ఇజ్రాయిల్ మరోసారి బాంబుల వర్షం

తాజాగా దాడుల్లో 95మంది పాలస్తీనియన్ల మృతి

మృతుల్లో ఎక్కువమంది మహిళలు, పిల్లలే..

గాజా(జనంసాక్షి): గాజాపై ఇజ్రాయెల్ దళాలు మరోమారు బాంబుల వర్షం కురిపించాయి. మంగళవారం గాజాలోని కేఫ్, పాఠశాల, శరణార్థి శిబిరాలపై వైమానిక దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 95మంది పాలస్తీనియన్లు చనిపోయారు.ఈ దాడుల్లో

మిగతా 2లో..





జాతీయ క్రీడా విధానానికి

## కేబినెట్ పచ్చజెండా

- పరిశోధనాభివృద్ధి, ఆవిష్కరణల్లో ప్రైవేటుకు ప్రోత్సాహం
- ఆర్‌డీఐలో ప్రైవేటు రంగ పెట్టుబడులకు వడ్డీరహిత ఫైనాన్సింగ్
- ఈ స్కీమ్‌కు రూ.లక్ష కోట్లు కేటాయింపునకు ఆమోదం
- కీలక నిర్ణయాలు వెల్లడించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ(జనంసాక్షి):పరిశోధనాభివృద్ధి,ఆవిష్కరణల రంగంలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించ డమే లక్ష్యంగా పరిశోధన- అభివృద్ధి- ఆవిష్కరణ పథకానికి కేంద్ర కేబినేట్ ఆమోదం తెలిపింది. ఈ స్కీమ్‌కు రూ.లక్ష కోట్లు కేటాయింపునకు పచ్చజెండా ఊపింది. ఆర్‌డీఐలో ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు తక్కువ వడ్డీ రేటు లేదా వడ్డీరహిత దీర్ఘకాలిక ఫైనాన్సింగ్ లేదా రీఫైనాన్సింగ్ అందించడమే ఈ పథకం లక్ష్యమని కేంద్రం పేర్కొంది. ప్రైవేట్ రంగం నిధుల విషయంలో ఎదుర్కొనే అడ్డంకులు, సవాళ్లను అధిగమించేందుకు దీన్ని డిజైన్ చేసినట్లు తెలిపింది. ప్రధానమంత్రి అధ్యక్షతన ఉన్న అనుసంధన్ జాతీయ పరిశోధనా ఫౌండేషన్ పాలక మండలి.. ఆర్‌డీఐ పథకానికి దిశానిర్దేశం చేస్తుందని పేర్కొంది. కేంద్ర క్యాబినెట్ నిర్ణయాలను కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. కేంద్ర క్యాబినెట్ మంగళవారంనాడు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ.3 లక్షల కోట్లకు పైగా విలువచేసే పలు కీలక పథకాలకు ఆమోదం తెలిపింది. వీటిలో ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ ), పరిశోదన-అభివృద్ధి-ఆవిష్కరణ , జాతీయ క్రీడావిధానం 2025, తమిళనాడులో కీలక మౌలిక వసతుల కల్పన ప్రాజెక్టు ఉన్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ కీలక

## బిఆర్ఎస్ దుష్ప్రచారం తిప్పికొట్టాలి



**టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్...**

**హైదరాబాద్(జనంసాక్షి):** నదీజలాల వినియోగం విషయంలో కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం తెలంగాణ హక్కులను కాపాడుతుందని ఈ విషయంలో బిఆర్ ఎస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారం తిప్పికొట్టాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ప్రజా భవన్ లో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో బనకచర్ల పోలవరం ప్రాజెక్ట్ పైన పిపిటి ఇచ్చారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వం కృష్ణ, గోదావరి జలాలపై మన హక్కులను కాపాడేందుకు కృషి చేస్తుందని అన్నారు.బిఆర్ ఎస్ ప్రాజెక్టుల పేరుతో అడ్డగోలుగా దోచుకుందని రాజకీయ పెత్తనం కోసం తెలంగాణ హక్కులను తాకట్టుపెట్టిందని అన్నారు

## భూ సమస్యలపై ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరిస్తాం

పరిష్కరించే లక్ష్యంతో ఏప్రిల్ 17 నుంచి జూన్ 20 వరకు దశల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహించినట్లు వివరించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తులు, వాటిని భూభారతి పోర్టల్‌లో నమోదు ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హమైన వాటిని పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై సరైన విచారణ జరపాలని, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేయాలని మంత్రి సూచించారు. అవసరమైన డాక్యుమెంట్లు, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలన్నింటినీ ఒకే డాక్యుమెంట్‌గా భూభారతి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులను ఎందుకు తిరస్కరించాల్సి వచ్చిందో వివరాలను రాతపూర్వకంగా దరఖాస్తుదారులకు పంపాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 594 మండలాల్లో 10,226 రెవెన్యూ సదస్సులు నిర్వహించి తద్వారా వచ్చిన 8,27,230 దరఖాస్తుల్లో ఇప్పటి వరకు 7,98,528 దరఖాస్తుల డేటాను భూభారతి పోర్టల్‌లో నమోదు చేసినట్లు మంత్రి వివరించారు. మిగిలిన వాటిని కూడా ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. సర్వే నంబర్లలో లోపాలు పీపీబీ, ఆర్వోఆర్, నాలా, ఆర్ఎస్ఆర్ సవరణ, అప్పీల్స్, కోర్టు కేసులు, పోడు భూములు తదితర 30 రకాల భూ సమస్యలకు చెందిన 8.27 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

## 36కు చేరిన మృతులు

**పటాన్‌చెరు(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా పాశమైలారంలోని సిగాచి ఫార్మాస్యూటికల్ కంపెనీలో జరిగిన భారీ పేలుడు ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతున్నది. రియాక్టర్ పేలుడుతో ఇప్పటివరకు 36 మంది మరణించారు. వివిధ దవాఖానల్లో మరో 31 మంది చికిత్స పొందుతున్నారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే మరణించినవారిలో ఎక్కువ మంది తమిళనాడు, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందినవారే ఉన్నారు. ఇప్పటివరకు ఏడు మృతదేహాలను గుర్తించగా, మరో 20 గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నాయి. సోమవారం జగన్మోహన్, రామ్‌సింగ్ రాజ్‌బర్, శశిభూషణ్ కుమార్ మృతిచెందినట్లు గుర్తించగా, తాజాగా మరో ఆరుగురి పేర్లను అధికారులు ప్రకటించారు. లగ్నజిత్ దౌరి, బీ.హేమ సుందర్, రుక్సానా కతూన్, జీ.నికిల్ రెడ్డి, నాగేశ్వర్ రావు, పొలిశెట్టి ప్రసన్నగా గుర్తించారు. డీఎన్ఏ పరీక్షల అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించే అవకాశం ఉన్నది. అయితే మృతుల సంఖ్య 55కు పెరిగే అవకాశం ఉంది. బాయిలర్ పేలడంతో మూడంతస్తుల అడ్మినిస్ట్రేన్ భవనం కుప్పకూలిన విషయం తెలిసిందే.

**సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మానవహక్కుల కమిషన్**

**సంగారెడ్డి(జనంసాక్షి):** పాశమైలారం అగ్నిప్రమాద ఘటనను రాష్ట్ర మానవహక్కుల కమిషన్(హెచ్ఆర్సీ) సుమోటోగా స్వీకరించింది. జులై 30లోగా ప్రమాద ఘటనపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్, లేబర్ కమిషనర్, ఫైర్ డీజీ, సంగారెడ్డి ఎస్పీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ ఘటనపై జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, న్యాయవాది దుండ్ర కుమారస్వామి హెచ్ఆర్సీకి ఫిర్యాదు చేశారు. పాతబడిన మిషనరీ వాడటం, అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, సిగాచి కెమికల్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలో పునరావృతం కాకుండా ఇండిపెండెంట్ కమిటీ వేసి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కెమికల్ ఫ్యాక్టరీలలో నాణ్యతా ప్రమాణాలపై నివేదిక ఇచ్చేలా అధికారులను ఆదేశించాలని హెచ్ఆర్సీని కోరారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెరగాలి

### మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** ఆర్ అండ్ బి శాఖ పరిధిలోని అన్ని రకాల పనుల్లో వేగం పెంచాలనీ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు ఎర్రమంజిల్ లోని ఆర్ అండ్ బి శాఖ ప్రధాన కార్యాలయంలో అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... పనుల్లో పురోగతి పెంచేందుకు ఖచ్చితంగా చీఫ్ ఇంజనీర్ స్థాయి అధికారి ఫీల్డ్ విజిట్ చేయాల్సిందేనని మంత్రి స్పష్టం చేశారు. శాఖ పై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూనే ఉంటానని, ప్రతి రివ్యూకు పనుల పురోగతి చూపించాలని చెప్పారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తో నిత్యం సంప్రదింపులు జరుపుతూ మన రాష్ట్ర వాటా 300 కోట్ల ఫండ్ వచ్చేలా కృషి చేశానని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. బిల్స్ క్లియర్ అవుతుంటే అదే స్థాయిలో పనులు కూడా వేగంగా జరగాలనీ,పనులు పూర్తి చేయించాల్సిన బాధ్యత అధికారులదే కాబట్టి క్షేత్ర స్థాయిలో మానిటరింగ్ చేస్తూ అన్ని రకాల పనుల్లో ప్రోగ్రెస్ చూపించాలన్నారు. శాఖలో ఎన్నడు లేని విధంగా సీఎంతో మాట్లాడి ప్రమోషన్లు,పోస్టింగ్స్ ఇచ్చుకున్నామని, హుషారుగా పనిచేసి ఆర్ అండ్ బి కి మరింత పేరు తీసుకురావాలని సూచించారు. హ్యామ్ రోడ్లు పది ప్యాకేజీలు మొదలు చేసేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని ఇఎన్సి జయ భారతిని ఆదేశించారు. రోడ్ యాక్సిడెంట్స్ నిర్మూలించేందుకు బ్లాక్ స్పాట్స్,వర్టికల్ కర్వ్ ముందే ఐడెంటిఫై చేయాలనీ సూచించారు.తెల్లాపూర్,అమీన్ పూర్,సంగారెడ్డి,మంచాల, చౌటుప్పల్ రోడ్లు, చిట్యాల,భువనగిరి, హాలియ మల్లేపల్లి రోడ్ల పై మంత్రి చర్చించారు. ప్రతి మండల కేంద్రం నుండి జిల్లా కేంద్రానికి ఆర్ అండ్ బి రోడ్ల కనెక్టివిటీ పెంచేందుకు భూ సేకరణ సమస్య కూడా లేకుండా ఇప్పటికే ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు.హ్యామ్ రోడ్ల డిపీఆర్, టెండర్ ప్రాసెస్ పై రెండు రోజుల్లో పూర్తి స్థాయి సమీక్ష నిర్వహిస్తాననీ మంత్రి స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆర్ అండ్ బి శాఖ నిధుల విడుదల పై సానుకూలంగా ఉన్నారనీ పినిషింగ్ స్టేజ్ పెండింగ్ లో ఉన్న ఆర్వోబిలు,మెడికల్ కాలేజీలు, టిమ్స్ హాస్పిటల్స్, కలెక్టరేట్లు వెంటనే పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వహించే సమీక్షలో అన్ని రకాల వివరాలతో సన్నద్ధంగా ఉండాలని,సి.ఈ ల పరిధిలోని ఎస్.ఈ లు,ఈ.ఈ లు మీటింగ్ లో పాల్గొనాలని చెప్పారు.ఇటీవల ప్రమోషన్స్, పోస్టింగ్స్ పొందిన వారు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.



# నీటి వాటా తెలంగాణ జన్మహక్కు



299 టీఎంసీలు కూడా వాడుకోలేని పరిస్థితి వచ్చింది. ఉమ్మడి ఏపీలో ప్రారంభించిన ప్రాజెక్టులను పదేళ్లపాటు పట్టించుకోలేదు. ఏపీ మాత్రం పూర్తి చేసుకున్న ప్రాజెక్టులకు నీటిని తరలించుకుపోతోందని రేవంత్‌రెడ్డి అన్నారు. నీళ్ళకు తెలంగాణ ప్రజలకు అనుబంధం ఉంది.. నీళ్లలో జరిగిన అన్యాయం పైనే తెలంగాణ ఉద్యమం కొనసాగింది.. నీళ్ల విషయంలో అందరిదీ ఏకాభిప్రాయమే.. తెలంగాణ హక్కులు కాపాడాలనేది మా ఆలోచన అన్నారు. అయితే, కేసీఆర్, హరీష్ రావుల దగ్గరే తొమ్మిదిన్నరేళ్ల పాటు నీటి పారుదల శాఖ ఉంది.. వాళ్ళ మీద పెట్టిన నమ్మకం వమ్ము చేశారు.. వాళ్ళు తీసుకున్న నిర్ణయాలు తెలంగాణకి గుది బండలాగా మారింది.. నికర జలాల మీద కేటాయింపుల్లో స్పష్టత ఉందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇక, కృష్ణా నదిలో 811 టీఎంసీలలో 299 టీఎంసీలు తెలంగాణకు చాలు అని కేసీఆర్ సంతకం చేసి వచ్చిండు అని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు. అప్పుడు కూడా మేం అభ్యంతరం వ్యక్తం చేశాం.. పరివాహక ప్రాంతాన్ని బట్టి నీటి కేటాయింపులు చేయాలని మేం వాదించాం.. 2020లో కూడా 299 టీఎంసీలు చాలు అని చెప్పారు.. కేసీఆర్, హరీష్ రావులు నీటి కేటాయింపులు సాధించలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులు పూర్తి చేయలేదు.. కేంద్రానికి కూడా శాశ్వత పరిష్కారం ఇవ్వాలని ముందుకు రాలేదు.. కేసీఆర్ తన దాహం తీర్చుకోవడానికి.. కాళేశ్వరం పేరుతో అంచనాలు మార్చాడని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి షేప్ రావాలంటే.. ఇంకో 50 వేల కోట్లు కావాలి.. లక్ష కోట్లు ఖర్చు చేసి 50 వేల ఎకరాలకు నీరు ఇచ్చారు .. 7 వేల కోట్ల కరెంట్ బిల్లులు అయ్యాయి.. మరో 118 టీఎంసీల నీటిని సముద్రంలో కలిపారని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే, గోదావరిని పూర్తిగా వాడుదామంటే నీళ్ల కేటాయింపు సమస్య, నిధుల సమస్య వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ చెప్తున్న అబద్దాలు.. మీరు జనంలోకి తీసుకెళ్లాలి అని సూచించారు. నదులు పునరుజ్జీవం కోసం కాదు.. బీఆర్ఎస్ పునరుజ్జీవం కోసం ప్రయత్నం చేస్తున్నారు అని మండిపడ్డారు. అందుకు ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు కుట్రలు చేస్తున్నారు.. ఫామ్ హౌస్ లో ఉండి క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆరోపించారు. ఉమాభారతి దగ్గరకి వెళ్లి 3 వేల టీఎంసీల నీళ్ళు ఉన్నాయని కేసీఆర్ అన్నాడో అప్పుడే సమస్య మొదలైంది. చంద్రబాబు మేల్కొని.. తెలంగాణనీ ఇరకటంలోకి నెట్టిండు.. చంద్రబాబు వచ్చినా.. జగన్ వచ్చినా.. గోదావరి నీళ్ల తీసుకుపోతామన్నారు.. రోజా ఇంటికి వెళ్ళి.. గోదావరి నీళ్ల ఇస్తామని కేసీఆర్ అన్నారు.. కేసీఆర్ వైఖరి.. మా ఇంటికి వస్తే ఏం తెస్తావు.. మీ ఇంటికి వస్తె ఏం ఇస్తావు అన్నట్టు ఉందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఏపీ ప్రతిపాదిత బనకచర్ల ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతులు తిరస్కరించడం తెలంగాణ ప్రభుత్వ విజయమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్‌తో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్న తెలంగాణ ప్రభుత్వ వాదనలను కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు

## కేసీఆర్ హయాంలోనే బనకచర్లకు అంకురార్పణ

వెనక్కి పంపిన నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ ప్రజాభవన్‌లో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 'పోలవరం, ధవళేశ్వరానికి కలిపి ఏపీ 484 టీఎంసీలకు మించి వాడుకోరాదు. పోలవరం నుంచి నీటి ఎత్తిపోతల కోసం 2 టన్నెల్ నిర్మాణాలు ప్రతిపాదించారు. రోజుకు 20వేల క్యూసెక్కులు తరలించేలా 2 టన్నెల్స్ ప్రతిపాదన పెట్టారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే బనకచర్ల ప్రాజెక్టుకు అంకురార్పణ జరిగింది. కృష్ణా గోదావరి జలాల్లో గత పదేళ్లలో రాష్ట్రానికి అన్యాయం జరిగింది. గోదావరి జలాలను సీమకు తరలిస్తుంటే కేసీఆర్ నోరెత్తలేదని మంత్రి ఉత్తమ్ అన్నారు. మంగళవారం ప్రజా భవన్‌లో బనకచర్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లతోపాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా నదిలో ఏపీకి ఎక్కువ నీళ్లు ఇచ్చేందుకు గత ప్రభుత్వం ఒప్పుకొని తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్ తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. గోదావరి జలాలను రాయలసీమకు తరలించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు మొదలయ్యాయిని ఆయన గుర్తు చేశారు. అంతేకాకుండా తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. అయితే బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు తాము చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. తమ వాదనతో కేంద్రం ఏకీభవించిందని స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వం పంపిన బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ ప్రతిపాదనను కేంద్రం వెనక్కి పంపిందన్నారు.

## ప్రమాదస్థలానికి సీఎం రేవంత్ రెడ్డి



ఇలాంటి ప్రమాదాలు జరగకుండా నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఈ పరిశ్రమలో గతంలో ఏమైనా ప్రమాదాలు జరిగాయా అని ప్రశ్నించారు. ఊహాజనిత సమాధానాలు చెప్పవద్దని స్పష్టం చేశారు. ప్రమాద ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ప్రమాద ఘటనపై నివేదిక కోసం నిపుణులను నియమించాలని సూచించారు. నిపుణులతో చర్చించిన తర్వాతే సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. కార్మికులకు బీమా సదుపాయం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమకు అనుమతులు, భద్రతా ప్రమాణాలపై ఆరా తీశారు. సిగాచీ పరిశ్రమకు సంబంధించిన మొత్తం సమాచారం సేకరించాలని ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టాని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రమాద సమయంలో మానవత్వంతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. పరిహారం విషయంలో తీసుకున్న నిర్ణయం చెప్పాలని కంపెనీ ప్రతినిధిని అడిగారు. ప్రమాదంపై కంపెనీ యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. పరిశ్రమలో పనిచేసే వారి నైపుణ్యాల గురించి సీఎం ఆరా తీశారు. ప్రమాదం జరిగి 24 గంటలు దాటినా యాజమాన్యం ఘటనా స్థలికి రాకపోవడం బాధాకరమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ప్రమాద ఘటనను కార్మిక, వైద్యశాఖ మంత్రులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సీఎం వెంట మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, వివేక్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు. నిన్న ఉదయం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమలో పేలుడు సంభవించిన ఘటనలో ఇప్పటి వరకు 36 మంది మృతి చెందారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

**సిగాచీ యాజమాన్యంపై సిఎం రేవంత్ మండిపాటు**

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు పాశమైలారం ఘటన మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇప్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. అదే విధంగా తీవ్రంగా గాయపడి ఎలాంటి పని చేసుకోలేని స్థితిలో ఉన్న బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు, స్వల్పంగా గాయపడి, తిరిగి పనిచేసుకోగలిగే వారికి రూ.5 లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపారు. చనిపోయిన వారి పిల్లల చదువుల బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, గురుకులాలో సీట్ల గురించి మాట్లాడాలని అధికారులకు సూచించామని చెప్పారు. బాధితులకు ప్రభుత్వం తరఫున వైద్యం అందించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. సిగాచి ఫ్యాక్టరీ ప్రమాదాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన కంపెనీ యాజమాన్యం, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంగళవారం మంత్రులు, అధికారులతో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీఎం రేవంత్.. ఉమ్మడి రాష్ట్రంలో, తెలంగాణలో ఇన్ని ప్రాణాలను బలిగొన్న ప్రమాదం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఫైర్, హైడ్రా, డిజాస్టర్, రెవెన్యూ శాఖల సమన్వయంతో సహాయక చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో ఎలాంటి సహాయక చర్యలు తీసుకోవాలో ఆదేశించడం జరిగిందని చెప్పారు. ఈ ఘటనలో అధికారిక సమాచారం ప్రకారం 36 మంది చనిపోయారని సీఎం రేవంత్ తెలిపారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 143 మంది ఉన్నారని, 58 మంది వివరాలు అధికారుల దృష్టిలోకి వచ్చాయని, మిగతా వారు శిథిలాల కింద ఉన్నారా లేక భయంతో టచ్ లోకి రాలేదా అనేది స్పష్టంగా తెలియదని అన్నారు.

## రైల్‌వన్

వివరాలు ఇచ్చి యూజర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలి. రిజర్వేషన్, అన్‌రిజర్వ్‌డ్, ప్లాట్‌ఫామ్ టికెట్లను ఈ యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. రిజర్వేషన్ ఆప్షన్‌లో ఐఆర్‌సీటీసీ యాప్ తరహాలోనే అన్ని క్లాస్‌ల టికెట్లను బుక్ చేసుకోవచ్చు. అన్‌రిజర్వ్‌డ్ ఆప్షన్‌లోకి వెళ్లి సాధారణ టికెట్లు, సీజనల్ పాస్‌లు కొనుగోలు చేయొచ్చు.యూటీఎస్ యాప్‌లో ప్లాట్‌ఫామ్ టికెట్ బుక్ చేయడానికి స్టేషన్‌కు మనం నిర్ణీత దూరంలో ఉన్నప్పుడే అయ్యేది. ఈ యాప్‌లో ఆ దూరం లిమిట్ లేదు.ఐఆర్‌సీటీసీ యాప్‌లో రైళ్ల సమాచారం, బుకింగ్ ఒకే విండోలో ఉండేవి. ఈ యాప్‌లో మీ కావాల్సిన రూట్‌లో రైళ్లను వెతుక్కునే సదుపాయం కల్పించారు. థర్డ్ పార్టీ యాప్‌ల అవసరం లేకుండా రైళ్ల లైవ్ ట్రాకింగ్ చూసుకోవచ్చు. ఎంత శాతం జర్నీ పూర్తయింది, తర్వాత ఆగే స్టేషన్ ఏది, వచ్చే స్టేషన్ ఏది లాంటి వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు. సీటు ఇక్కడ బుకింగ్, ఫుడ్ అక్కడ బుకింగ్ అనే పరిస్థితి ఇక లేనట్లే. ఈ యాప్‌లోని 'ఆర్డర్ ఫుడ్' ఆప్షన్ ద్వారా ఆహారం ఆర్డర్ పెట్టొచ్చు. రైలులో ప్రయాణికుల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన 'రైల్ మదద్' ఫీచర్‌ను ఈ యాప్‌లోనే పొందుపరిచారు. ప్రయాణం ఎలా సాగింది? రైల్వే స్టేషన్ ఎలా ఉంది? అనే ఫీడ్ బ్యాక్ రైల్వేకు ఈ యాప్ ద్వారా తెలియజేయొచ్చు. ఫీడ్ బ్యాక్ ఆప్షన్ ద్వారా ఈ పని చేయొచ్చు. రేటింగ్ కూడా ఇవ్వొచ్చు. ఆర్- వాలెట్‌లో డబ్బులు వేసి తర్వాత టికెట్ బుకింగ్ సమయంలో వినియోగించుకోవచ్చు. ఎక్కువగా ప్రయాణించే వారి వివరాలను గతంలో మాస్టర్ లిస్ట్ అనేవారు. దానిని ఈ యాప్‌లో సేవ్డ్ పాసింజర్ లిస్ట్‌గా మార్చారు. ఇవి కాకుండా పీఎన్ఆర్ స్టేటస్, రైళ్ల కోచ్‌ల వరుస, రిఫండ్ ప్రాసెస్ లాంటి సదుపాయాలు ఈ యాప్‌లో ఉన్నాయి.

## కాంగ్రెస్‌ను మేమే మేల్కొలిపాం

స్పందించారు. గోదావరిలో వెయ్యి టీఎంసీలు, కృష్ణాలో 500 టీఎంసీలు చాలు అని చెప్పిన రేవంత్‌కు మిగులు జలాల్లోనూ తెలంగాణకు వాటా ఉంటుందని జ్ఞానోదయం చేసింది కూడా బీఆర్ఎస్ పార్టీయేనన్నారు. మళ్లీ అవే పాత అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడని.. అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ఇప్పటికీ ఎందుకు డిమాండ్ చేవని ప్రశ్నించారు. చంద్రబాబుపై నువ్వు చూపుతున్న గురు భక్తికి ఇది నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. గోదావరి వాటర్ డిస్ప్యూట్ బోర్డ్ అవార్డు ప్రకారం.. సీడబ్ల్యూ అనుమతి పొందకుండా ఈఏపీ అనుమతి ఇవ్వదన్నారు. ఏపీ అనుమతుల కోసం సీడబ్ల్యూసీకి వెళ్లే కంటే ముందే అపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లాలనే సోయి కూడా సీఎంకు లేదని విమర్శించారు. కనీస అవగాహన లేని వ్యక్తులు నీటి పారుదల శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉండడం రాష్ట్రానికి పట్టిన దౌర్భాగ్యమన్నారు. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రస్తావనే రాని బనకచర్ల ప్రాజెక్టు.. ఇప్పుడు ఎవరి అండ చూసుకొని ముందుకు వచ్చిందో తెలంగాణ ప్రజలకు తెలియదా? అని ప్రశ్నించారు. మౌనంగా ఉంటూ అందిస్తున్న సహకారం వల్లనే కదా బనకచర్ల వ్యవహారం ఇక్కడి దాకా వచ్చింది రేవంత్ రెడ్డి అంటూ చురకలంటించారు. నీటి విషయంలో అన్యాయం చేస్తూనే.. లెక్కకు మించి అబద్ధాలు ప్రచారం చేస్తూ.. బీఆర్ఎస్‌పై చేస్తున్న క్షుద్ర రాజకీయాన్ని తెలంగాణ సమాజం గమనిస్తుందని.. తెలంగాణ వ్యతిరేక విధానాలను అసహ్యించుకుంటున్నారన్నారు.


## జాతీయ క్రీడా విధానానికి కేబినెట్ పచ్చజెండా

నిర్ణయాలు తీసుకున్నట్టు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పరిశోధానాభివృద్ధి, ఆవిష్కరణ రంగంలో ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా రీసెర్చ్ డవలప్‌మెంట్ అండ్ ఇన్నొవేషన్ పథకానికి కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనికి రూ.1 లక్ష కోట్లు కేటాయించింది. ఇజ్రాయెల్, యూఎస్, సింగపూర్, జర్మనీ వంటి దేశాల్లో విజయవంతమైన గ్లోబల్ మోడల్స్‌ను అధ్యయనం చేసి అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ రూపొందించిన అంతర్జాతీయ రోడ్‌మ్యాప్ ఆధారంగా ఈ స్కీమ్ ఉంటుంది. ప్రైవేటు రంగం నిధుల విషయంలో ఎదుర్కొనే సవాళ్లను అధిగమించేందుకు దీన్ని డిజైన్ చేసినట్టు తెలిపింది. ఈ పథకం కింద ఆర్డీఐలో ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు తక్కువ వడ్డీ, వడ్డీరహిత దీర్ఘకాలిక్గ ÷నాన్సింగ్ అందించనున్నారు.మాన్యుఫాక్చరింగ్ రంగంలో ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రూ.1.07 లక్షల కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఇది మ్యాన్యుఫ్యాక్చరింగ్-డ్రివెన్ ఎకానమికి కీలక గ్రోత్ ఇంజన్ అని గత బడ్జెట్‌లో వైష్ణవ్ ప్రకటించారు. దేశంలో క్రీడా మౌలిక సదుపాయాలు పెంచడం, క్రీడాకారుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా జాతీయ క్రీడా విధానం -2025కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో పాటు ఉపాధి ఆధారిత ప్రోత్సాహకాల పథకానికి పచ్చజెండా ఊపింది. తద్వారా తయారీ రంగంలో ఉపాధి కల్పించే పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వనుంది. రెండేళ్ల కాలపరిమితిపై రూ.99,446 కోట్లతో ఉపాధి ఆధారిత ప్రోత్సాహక (ఇఎఎ) పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే, తమిళనాడులోని పరమకుడి-రామనాథపురం హైవే నాలుగు లేన్‌ల విస్తరణకు ఆమోదం తెలిపిన క్యాబినెట్.. ఈ ప్రాజెక్టు కింద 46.7 కి.మీల పొడవైన రహదారి నిర్మాణానికి రూ.1853 కోట్ల వ్యయం చేయనుంది. గత దశబ్దా కాలంలో భారతదేశం క్రీడారంగంలో సాధిస్తున్న వృద్ధిని దృష్టిలో ఉంచుకుని జాతీయ క్రీడా విధానం-2025కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతిభావంతులైన క్రీడాకారులను అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లడం, కోచింగ్ అవకాశాలు పెరుగుపరచడం, దేశంలోని క్రీడా సదుపాయాలను పటిష్టం చేయడం వంటికి ఈ పథకం ప్రధాన ఉద్దేశాలు. దక్షిణ భారతదేశంలో మౌలిక వసతులను మరింత మెరుగుపరచడంలో భాగంగా తమిళనాడులోని పరమకుడి-రామనాథపురం సెక్షన్ల మధ్య నాలుగు లేన్ల నేషనల్ హైవే విస్తరణకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 46.7 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి

## సంక్షేమ,గురుకులాల్లో వసతులకు లోటురావొద్దు

తెలిపారు.సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో ఉన్న విద్యార్థులందరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి హెల్త్ కార్డు లు రూపొందించాలని డిప్యూటీ సీఎం సూచించారు. జిల్లా కలెక్టర్లు, జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారులను సమన్వయం చేసుకొని హెల్త్ కార్డు లు రూపొందించే కార్యక్రమం వేయంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. విద్యార్థులకు ఏదైనా అనారోగ్యం ఏర్పడితే ఆన్లైన్ ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు కార్పొరేట్ ఆసుపత్రులు సంసిద్ధంగా ఉన్నాయని వారి సేవలను వినియోగించుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలల భవనాలన్నిటి పైన సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ అవసరాలు తీర్చుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ అమలు తీరు, సొసైటీల వారిగా సెంటర్ ఆఫ్ %వఞశ్రీవఅవ% ప్రగతిపై సమావేశంలో సమీక్షించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా , ఎస్సీ గురుకుల సెక్రటరీ అలుగు వర్షిని, సాంఘిక సంక్షేమ శాఖ డిడి క్షితిజ, మైనార్టీ వెల్ఫేర్ కమిషనర్ షఫీ, బీసీ గురుకుల సెక్రటరీ సైదులు, ఎస్టి గురుకుల సెక్రటరీ సీతాలక్ష్మి, ట్రైబల్ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దుకాణం బంద్ చేసి దక్షిణాఫ్రికా వెళ్లిపో..



తీవ్ర విమర్శలు చేస్తున్న ఎలాన్ మస్క్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. అతడు (మస్క్) అమెరికాలో వ్యాపారం చేయలేకపోతే దుకాణం మూసేసి దక్షిణాఫ్రికాకు తిరిగి వెళ్లాల్సి వస్తుంది అని హెచ్చరించారు. ఒకసారి ఆయన అమెరికా ప్రభుత్వం నుంచి పొందిన సబ్సిడీలను తాను చూసుకోవాలి. అమెరికా చరిత్రలోనే ఎవరూ పొందలేనంత సబ్సిడీలను మస్క్ పొందారు. అలాంటి వ్యక్తి నా ప్రభుత్వంలో పనిచేశారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు నాకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తున్నారు. ఒకవేళ ఆ సబ్సిడీలే వద్దనుకుంటే ఆయన తన వ్యాపారాలను బంద్ చేసుకోవచ్చు. అమెరికా వదిలి దక్షిణాఫ్రికాకు తిరిగి వెళ్లిపోవొచ్చు అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. అదే జరిగితే.. ఇంకా రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాలు, ఎలక్ట్రిక్ కార్ల ఉత్పత్తి అవసరం ఆయనకు ఉండదు. పైగా మన దేశానికి భారీగా డబ్బు ఆదా అవుతుంది. దీనిపై గట్టిగా పరిశీలన చేయాలి. ఇది పెద్ద మొత్తంలో డబ్బు ఆదా చేసే అవకాశం! అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన భారీ ఖర్చుల బిల్లుపై ఎలాన్ మస్క్ మొదటి నుంచి తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంతోనే ఆయన డోజ్ పదవికి రాజీనామా చేసి బయటకు వచ్చారు. అయితే మస్క్ ఎంతగా విమర్శించినప్పటికీ.. ట్రంప్ మాత్రం మస్క్ మంచి స్నేహితుడనే చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలో.. బిల్లు గనుక ఆమోదం పొందితే ఆ మర్నాడే తాను రాజకీయ పార్టీని ప్రకటిస్తానని మస్క్ తాజాగా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో.. ట్రంప్ కూడా ఇప్పుడు ఘాటుగా స్పందించడం మొదలుపెట్టారు.ట్రంప్ రెండో దఫా అధ్యక్ష విజయంలో ఎలాన్ మస్క్ కీలక పాత్రే పోషించారు. ఆ ఎన్నికల సమయంలో దాదాపు %వి%300 మిలియన్ల విరాళాలు ఇచ్చారు. కానీ బిల్లు కారణంగా ఇప్పుడు ఇద్దరి మధ్య విభేదాలు తారా స్థాయికి చేరాయి. ట్రంప్ తాజా వ్యాఖ్యలు చూస్తుంటే మస్క్‌ను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది.

## గాజాపై ఇజ్రాయిల్ మరోసారి బాంబుల వర్షం

పౌర మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పాఠశాలలు, కేఫ్‌లు, ఆహార పంపిణీ కేంద్రాలు లక్ష్యంగా దాడులు జరిగాయి. 95 మంది పాలస్తీ నియన్లు చనిపోగా, వీరిలో చాలా మంది సాధారణ పౌరులు ఉన్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఉన్నారు. ఉత్తర గాజాలోని అల్-బఖా కెఫెటేరి యాపై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 39 మంది మృతిచెందారు. డజన్ల కొద్దీ మంది గాయపడ్డారు.మృతుల్లో ఓ జర్నలిస్ట్ ఇస్మాయిల్, మహిళలు, పిల్లలు ఉన్నారు.ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఈ దాడి చేశాయి. ఈ బాంబు దాడిలో కేఫ్ నేల మట్టమైంది.భూమిలో పెద్ద గొయ్యి ఏర్పడింది. సోమవారం కూడా ఇజ్రాయెల్ దళాలు గాజా నగరంలోని జీటౌన్ పరిసరాల్లో దాడులు చేశారు. శరణార్థి శిబిరంపై ఇజ్రాయెల్? వైమానిక దాడి చేయగా 13 మందిని చనిపోయారు. ఇజ్రాయెల్ సైన్యం గాజా నగరంలోని యాఫా పాఠశాలపై కూడా బాంబు దాడి చేసింది. ఇది వందలాది మంది పాలస్తీనియన్లకు ఆశ్రయం కల్పిస్తోంది. ధ్య గాజాలోని ఓ ఆస్పత్రిపై కూడా ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడ్డాయి. వేలాది కుటుంబాలు ఆశ్రయం పొందిన దేయిర్ ఎల్‌బలాలోని అల్ అక్సా ఆస్పత్రి ప్రాంగణంపై ఇజ్రాయెల్ దళాలు దాడి చేశాయి. హమాస్ మిలిటెంట్లను లక్ష్యంగా దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. పౌరులు ఉన్న ప్రాంతాల నుండి హమాస్ పనిచేస్తోందని అందువల్ల ప్రజల మరణాలకు హమాస్ కారణమని ఇజ్రాయెల్ ఆరోపిస్తుంది. దాడులు చేసే ముందు పౌరులను హెచ్చరిస్తున్నామని ఇజ్రాయెల్? తెలిపింది. ఈ దాడులపై ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. పాఠశాలలు, ఆసుపత్రులు, ఇతర పౌర ఆశ్రయాలపై దాడులు అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన అని మానవ హక్కుల సంస్థలు ,ఐక్యరాజ్యసమితి చెబుతున్నాయి. ఈ సంఘటనలు గాజాలో నెలకొన్న తీవ్ర మానవతా సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేశాయంటున్నారు.

# దేశ భవిష్యత్‌పై పాలకులకు పట్టింపులేదు

**జస్టిస్ చంద్రకుమార్**

**శాంతి చర్చల ప్రతినిధి కామ్రేడ్ రియాజ్ (బదనకల్ అమరుల) 20వ వర్ధంతి సభ**





హైదరాబాద్ (జనంసాక్షి) : దేశభవిష్యత్‌పై పాలకులకు పట్టింపు లేదని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. బదనకల్ అమరుల 20వ, వర్ధంతిని పురస్కరించుకొని అమరుల స్మారక కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంస్మరణ సభ నిర్వహించారు. సభ ప్రారంభానికి ముందు అమరవీరులకు జోహార్లు చెబుతూ రెండు నిమిషాలు మౌనం పాటించడం, తదనంతరము సంస్మరణ సభకు హాజరైన వక్తులందరూ అభివాదం తెలియజేశారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య గానం చేసిన లిలిశాంతమ్మ సమరగాథ (శాంతి సమరయోధుల)పాటనులిలి బదనకల్ అమరుడు పెద్ది యాదగిరి(రాజు)తల్లి పెద్ది పిచ్చమ్మ చేతుల మీదుగా సిడీ ని ఆవిష్కరణ చేశారు. అరుణోదయ కళాకారులు పాడిన లాల్ సలాం.. లాల్ సలాం అమరులకు లాల్ సలాం పాటతో సభను ప్రారంభించారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ ఒక అద్భుత సమాజం కోసం తమ అమూల్యమైనటువంటి ప్రాణాలను తృణప్రాయంగా పెట్టి అమరులైనారని కామ్రేడ్ రియాజ్ తదితదర అమరవీరులను కొనియాడారు. నేడు ఇవాళ విద్యా, వైద్యం అన్ని వ్యాపారమైపోయినాయని, పెట్టుబడిదారి సమాజంలో లాభాల కోసం ఏమైనా చేస్తారని, దేశ భవిష్యత్తు ఏమైపోతుంది అనేది పాలకులకు ఇవాళ పట్టింపు లేదన్నారు. హైస్కూల్ స్థాయిలో డ్రగ్స్ వస్తుందంటే నేడు పరిస్థితులు దేశంలో ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చున్నారు. నక్సలైట్లు నూతన సమాజంను కోరుకుంటున్నారు. శ్రమకు తగ్గ ఫలితం కావాలంటున్నారు. శ్రామికులను, శ్రమను గౌరవించాలంటున్నారు. శాంతి చర్చల కమిటీ పిలుపుమేరకు మావోయిస్టులు చర్చలకు సిద్ధమని చెప్పి, కాల్పుల విరమణ పాటించి నప్పటికీ పాలకులు కూడా చర్చలకు ముందుకు రావాలి. కానీ ఇప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన లేదు. పైగా 30 వేల పోలీస్ మిలటరీని కర్రెగుట్టలను, మధ్య భారతంలో చుట్టుముట్టి ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసులను, మావోయిస్టులను మానవ హననానికి పాల్పడుతున్నారని, ఆపరేషన్ కాగార్ ను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. మనిషి జీవించే హక్కును కాలరాయడం సరైనది కాదన్నారు.అమరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి ఆశయాలను ప్రజల్లో ప్రచారం చేయాలని, అందరం ఐక్యమై ముందుకు సాగాలని అప్పుడే అమరుల ఆశయాలకై ముందుకు సాగిన వాళ్లమవుతామని అన్నారు.

విమలక్క మాట్లాడుతూ దేశ వనరులు ఈ దేశ ప్రజలకే చెందాలన్నారు. పాలకులు నేడు వనరులను విధ్వంసం చేస్తున్నారు అని అన్నారు. కార్పొరేట్ శక్తులకు ఈ దేశ వనరులను కట్టబెట్టడానికి పాలకులు నేడు ఆదివాసులను, మావోయిస్టులైన ఈ దేశ పౌరులను హత్యలు చేస్తున్నారని ఇది దుర్మార్గమైన చర్య అన్నారు. ఆపరేషన్ కగారు పేరు మీద చేస్తున్న మానవహననాన్ని ప్రశ్నిస్తున్నారని గుర్తు చేశారు. ఐనా పాలకులు తమ విధానాలను మార్చుకోకపోవడం సరైనది కాదన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నించవద్దు అని అంటే ఎట్లా.. ప్రజల అభిష్టానికి వ్యతిరేకంగా పాలకులు తమ విధానాలను కొనసాగిస్తామంటే సరైనది కాదన్నారు. దోపిడీ,పీడన, అసమానతలు ఉన్న దగ్గర, అణిచివేత ఉన్న దగ్గర ప్రతిఘటన ఉంటదని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వము కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

జీవన్ కుమార్ మాట్లాడుతూ ఆదివాసి చట్టాలు గాని ఎస్సీ, ఎస్టీ చట్టాలు గాని అనేక చట్టాలు ఇవ్వాలా ఉద్యమాల మూలంగానే ముందుకు వచ్చినాయని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా కొనసాగిన కాలంలో వందల మందిని ఎన్ కౌంటర్ ల పేరిట హత్య చేసినాడని గుర్తు చేశారు.ఒక పాలసీగానే ప్రభుత్వం ఈ హత్యలు చేస్తుందని వీటికి వ్యతిరేకంగా ఐక్యమై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

కట్టా భగవంత రెడ్డి మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ సభను జరుపుకోవడం అంటే అమరుల ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని అన్నారు. ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతం చేయడమే అమరులకు మనమిచ్చే నిజమైన నివ్వాలని అన్నారు. నేడు రాజ్యం చేస్తున్న అంతక చర్యలు అన్నింటిని ముక్తకంఠంతో నిలబడి ప్రశ్నించాలని అట్లా ప్రశ్నించినప్పుడే పాలకుల మెడలు వంచిన వాళ్లమవుతామని అన్నారు. నక్సల్ బరి ఒక వసంత మేఘగర్జ అని 2026 నాటికి నక్సలైట్ ఉద్యమాన్ని అణిచి వేస్తామని పాలకులు ఇవ్వాళ అంటున్నారు. కానీ ఇది సాధ్యం కాదని అన్నారు. ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో ఇప్పటికైనా శాంతి చర్చలు జరపాలని, కాల్పుల విరమణ పాటించాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ నూతన మానవీయ సమాజంకై చాలా చిన్న వయసులో విప్లవోద్యమంలో కొనసాగుతూ ప్రాణాలు ఇస్తున్నారని వారి త్యాగాలను ఎత్తిపడుతూ ముందుకు సాగవలసిన అవసరం ఉందన్నారు. పాలకులు ఇవాళ పలానా తేదీలోపు మావోయిస్టులను చంపుతామనడం సరైనది కాదన్నారు. ఇప్పుడు మనిషులను చంపి శవాల చుట్టూ ఎగరడం దుర్మార్గమైన చర్య అని అన్నారు.ఆయుధం పట్టిన వాళ్లే శాంతి చర్చలకు మేం సిద్ధమని అన్నప్పుడు ప్రభుత్వం కూడా చర్చలకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.. ఈ సంస్మరణ సభకు అమరుల స్మారక కమిటీ రాష్ట్ర కన్వీనర్: దేగల రమ అధ్యక్షత వహించిన్నారు. ఈ కార్యక్రమంలో..అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రెండు తెలుగు రాష్ట్రాల గౌరవ అధ్యక్షురాలు :విమలక్క, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు మల్సూర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి: పోతుల రమేష్, రైతు- కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు: నాగిరెడ్డి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు: కొమురయ్య, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు: మల్లేశం, రాష్ట్ర నాయకులు: రాయమల్లు, యాకన్న, పీవోడబ్ల్యు (స్త్రీ విముక్తి )రాష్ట్ర కన్వీనర్: అరుణ, టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు: ప్రకాష్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలి

**విద్యుత్ సేవలపై వినియోగదారులకు అవగాహన కల్పించండి**

**ఐఎస్‌వో 9000 సర్టిఫికెట్ పొందడం అభినందనీయం**

**ఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు, డైరెక్టర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**



హైదరాబాద్ (జనంసాక్షి) : ఆధునిక యుగంలో వినియోగదారుల అవసరాలకు తగిన విధంగా సేవలు అందించేందుకు ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం ప్రజా భవన్లో ఎస్‌పీడీసీఎల్ ఉన్నతాధికారులు, డైరెక్టర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. విద్యుత్ సరఫరా క్రమంలో ఎక్కడైనా ట్రిప్ అయితే వెంటనే కంట్రోల్ రూమ్ కు సమాచారం వచ్చే ఫీడర్ ఔటేజ్ మేనేజ్మెంట్ సిస్టం అమలను నూటికి నూరు శాతం త్వరితగతిన చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. దక్షిణ విద్యుత్ మండలి పరిధిలో 6,500 ఫీడర్లు ఉండగా 5,500 ఫీడర్ల పరిధిలో ఎఫ్ఓఎంఎస్ అమల్లోకి తీసుకువచ్చినట్టు అధికారులు వివరించగా, మిగిలిన ఫీడర్ల పరిధిలోను త్వరితగతిన ఎఫ్ఓఎంఎస్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం సూచించారు. ఆపరేషన్ అండ్ మేనేజ్మెంట్, వినియోగదారులకు మెరుగైన సేవలు, కార్యాలయంలో ఫైళ్ల పరిష్కారం వేగవంతంగా జరగడం వంటి పలు అంశాల ప్రాతిపదికగా ఎస్‌పీడీసీఎల్ ఐఎస్‌వో 9000 సర్టిఫికెట్ పొందడం అభినందనీయమన్నారు. విద్యుత్ సిబ్బందికి కోసం రూపొందించిన ప్రత్యేక డ్రెస్ కోడ్ ను డిప్యూటీ సీఎం పరిశీలించి పలు సూచనలు చేశారు. సుదీర్ఘ అనుభవం, చేయగల సామర్థ్యం ఉన్న వ్యక్తులను డైరెక్టర్లుగా ఎంపిక చేసాం, ఈ నేపథ్యంలో మీ మీ విభాగాల్లో గత కాలంలో చేయలేకపోయిన పనులను ఒక ప్రణాళిక ప్రకారం ఎవరి పరిధిలో వారు పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం డైరెక్టర్లకు సూచించారు. విద్యుత్ శాఖ ద్వారా అనేక రకాల సేవలను వినియోగదారులకు అందిస్తున్నారు. 108 అంబులెన్స్ తరహాలో విద్యుత్ శాఖలో 1912 నంబర్ కు ఫోన్ చేస్తే వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిస్తున్నారు, ఈఆర్‌టీ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ప్రత్యేక వాహనంతో సమస్యలు ఉన్నచోట క్షణాల్లో ప్రత్యక్షమై సమస్యలు పరిష్కరిస్తుంది, 70 శాతం లోడ్ చేరుకోగానే కొత్త ట్రాన్స్ఫార్మర్లు, సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తూ విద్యుత్ సరఫరా లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా ప్రణాళికా ప్రకారం పనిచేస్తున్నారు. ఈ అంశాల పైన వినియోగదారులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని డిప్యూటీ సీఎం సూచించారు. సోలార్ పవర్ కు సంబంధించిన సమగ్ర ప్రణాళికను త్వరలో అందుబాటులోకి తీసుకువస్తాం దానిని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశంలో విద్యుత్ శాఖ సీఎండి నవీన్ మిట్టల్, ఎస్‌పీడీసీఎల్ సీఎండి ముషారఫ్ ఫారుకి తోపాటు డైరెక్టర్లు, సీఈలు పాల్గొన్నారు.

# బాధలు తీర్చే దైవం బల్కంపేట ఎల్లమ్మ

**అమ్మవారికి కళ్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించడం నా అదృష్టం**

**రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడి**



హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ ప్రజల బాధలు తీర్చే దైవం బల్కంపేట ఎల్లమ్మ అని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఆషాఢ మాసంలో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో బోనాల సందడి ఉంటుందని గుర్తు చేశారు. బోనం అంటే భోజనమని... గతంలో ఇక్కడ ఒక మహమ్మారి విఘృంజిస్తున్న సమయంలో బోనాల సంస్కృతి వచ్చిందని... అది ఇక్కడి ప్రజల నమ్మకం అని మంత్రి చెప్పారు. హైదరాబాద్ మహా నగరంలో విపత్తు వచ్చి వందల మంది చనిపోతున్నప్పుడు బల్కంపేట ఎల్లమ్మ తల్లి రక్షణగా ఎందరో ప్రాణాలు కాపాడిందని గుర్తు చేశారు. బోనాల పండగ ఇక్కడి ప్రజలకు ఒక గొప్ప వేడుకగా మారిందన్నారు. ఈసారి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రజా ప్రభుత్వం రూ. 20 కోట్లు కేటాయించి, ఎక్కడా ఎటువంటి ఇబ్బంది రాకుండా చూసిందన్నారు. ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తున్నారని... అందుకోసం సకల ఏర్పాట్లు చేసినట్టు గుర్తు చేశారు. ఈరోజు బల్కంపేట శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం భక్తుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగిందని... రాష్ట్ర ప్రభుత్వం పక్షాన అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం తనకి రావడం చాలా అదృష్టంగా ఉందన్నారు. అమ్మవారి కళ్యాణం సందర్భంగా రాష్ట్రమంతా మంచి వర్షాలు పాడి పంటకు ఆరోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన తదితరులు పాల్గొన్నారు.



# న్యూజెర్సీలో ఎస్‌పీబీ మ్యూజిక్ అకాడమీ ఆవిర్భావ వేడుకలు

హైదరాబాద్ (జనంసాక్షి) : ఎస్‌పీబీ మ్యూజిక్ అకాడమీ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ప్రఖ్యాత గాయకులు, పద్మవిభూషణ్ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం 79వ జన్మదినాన్ని పురస్కరించుకొని, వేడుకలు జూన్ 29, 2025న న్యూజర్సీలోని రాయల్ ఆల్బర్ట్ ప్యాలెస్ వేదికగా ఘనంగా నిర్వహించబడ్డాయి. సన్నాయి కళాకారుల మంగళవాద్యాలు మోగుతుండగా ఎస్‌పీ బాలసుబ్రమణ్యం గారి చిత్ర పటాన్ని, సగౌరవంగా, భక్తి ప్రపత్తులతో ఊరేగింపుగా హాలులోకి తీసుకువచ్చి, జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు అర్పించారు. సాయిదత్త పీఠాధిపతి రఘు శంకరమంచి పవిత్ర మంత్రోచ్చారణతో ఆశీర్వచనములు అందించారు. ఈ సందర్భంగా సమర్పించిన నృత్య ప్రదర్శనలు అందరి మనసులు చూరగొన్నాయి. వేదికపై 35 మంది గాయకులు ఎస్పీబీ చిరస్మరణీయ పాటలు ఆలపించి శ్రోతలను మైమరిపించారు. అంతేగాక, 8 మంది టీనేజ్ గాయకులు అపూర్వ ప్రతిభను చూపించి ప్రశంసలు అందుకున్నారు. సుమారు 200 మందికి పైగా ప్రేక్షకులు హాజరై ఈ సంగీత కచ్చేరిని ఆస్వాదించారు. సంగీత కార్యక్రమం ఎంతగానో ఆకట్టుకున్నదని, అందించబడిన విందు భోజనం ఎంతో రుచిగా ఉందని అతిథులు హర్షం వ్యక్తం చేశారు. వైస్ ప్రెసిడెంట్ శ్రీమతి రాజేశ్వరి బుర్ర తొలి పలుకు అందించి సారధ్యం వహించగా, వ్యాఖ్యాత చైతన్య మద్దూరి కార్యక్రమాన్ని అద్భుతంగా పరుగులు పెట్టించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యూజర్సీ యుటిలిటీస్ కమిషనర్ చివుకుల ఉపేంద్ర, గౌరవ అతిథిగా టీవీ5, మన టీవీ అధినేత శ్రీధర్ చిల్లర హాజరై వేడుకలకు ఆకర్షణగా నిలిచారు. అకాడమీ ఛైర్మన్ డాక్టర్ హరి ఎప్పునాపల్లి, సంస్థ సలహాదారులు దాము గేదెల , డాక్టర్ రవి అయ్యగారి పాల్గొన్నారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సభ్యురాలు సుజాత వెంపరాల, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కుమార్ రాణి, ప్రమోద్ మసిపట్ల, రమా ప్రభల, కుమార్ బుధరాజు సహకారం అందించారు. మాటా సంస్థ నుండి వ్యవస్థాపకులు శ్రీనివాస్ గనగోని, ప్రెసిడెంట్ కిరణ్, జనరల్ సెక్రటరీ విజయభాస్కర్ కలాల్ పాల్గొన్నారు. టీఎఫ్ఏఎస్ అధ్యక్షులు మధు, జనరల్ సెక్రటరీ వెంకట తాతా తదితరులు హాజరయ్యారు. శ్రీ వాసవి సంస్థ నుండి కూడా కార్యవర్గసభ్యులు హాజరు అయ్యారు. అకాడమీ అధ్యక్షులు శ్రీనివాస్ గూడూరు మాట్లాడుతూ ఎస్‌పీబీ గాన మాధుర్యాన్ని విశ్వవ్యాప్తంగా ప్రాచుర్యం చేయడం, తద్వారా యువతకు సంగీతం, సినీ పాటలు పాడటం పట్ల ఆసక్తిని పెంపొందించడం మా లక్ష్యం," అని తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ రాజేశ్వరి బుర్ర కూడా సంస్థ లక్ష్యాలను వివరించారు. అకాడమీ ద్వారా ప్రసిద్ధి చెందిన గాయకులు, సంగీత ఉపాధ్యాయులతో వర్క్‌షాపులు, శిక్షణా కార్యక్రమాలు, ప్రతీ ఏడూ ఔత్సాహిక గాయకుల కోసం పాటల పోటీలు నిర్వహించి ఎస్‌పీబీ అవార్డ్స్ అందించడం వంటి కార్యక్రమాలు చేపడతామని నిర్వాహకులు తెలియజేశారు. సంస్థ వేడుకలకు తమ శుభాకాంక్షలు అందించిన న్యూయార్క్ లోని ఫార్మస్యూటికల్ సంస్థ అధినేత, పైళ్ళ మల్లారెడ్డికి శ్రీనివాస్ గూడూరు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తెలంగాణ అమెరికన్ తెలుగు సంస్థ ప్రెసిడెంట్ నవీన్ మల్లిపెద్ది, అడ్వైసరీ కౌన్సిల్ ఛైర్మన్ విజయపా రెడ్డి తదితరులు అభినందనలు తెలియజేశారు. న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం అధ్యక్షులు వాణి అనుగు, ఛైర్మన్ రాజేందర్ జిన్నా, వైస్ ఛైర్మన్ లక్ష్మణ్ అనుగు, సంస్థ దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. తెలుగు సారస్వత సాంస్కృతిక సంఘం ఛైర్మన్ శ్రీమతి రాజీ కుంచెం, ప్రెసిడెంట్ సుమంత్ రామిశెట్టి, పూర్వాధ్యక్షులు శ్రీ పూర్ణా అట్లూరి, సంస్థ యువతకు సంగీత పరంగా ఇస్తున్న ప్రోత్సాహాన్ని అభినందించారు.

# వాల్మీకి కార్పోరేషన్‌లో కర్నాటకకు చుక్కెదురు

**సిబిఐ విచారణకు ఆదేశించిన హైకోర్టు**

బెంగళూరు, జులై 1(జనంసాక్షి) : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సారథ్యంలోని కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి వాల్మీకి ఎస్టీ డవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో ఎదురుదెబ్బ తగిలింది. ఈ కుంభకోణంపై సీబీఐ దర్యాప్తునకు కర్ణాటక హైకోర్టు మంగళవారంనాడు ఆదేశించింది. దీంతో ఇంతవరకూ ఈ కుంభకోణానికి సంబంధించిన నిర్దిష్ట అవకతవకలపై దర్యాప్తునకే పరిమితమైన సీబీఐ ఇకనుంచి మొత్తం కేసులో పూర్తి స్థాయి విచారణ చేపడుతుంది. ఈ కేసులో ఇంతవరకూ జరిగిన విచారణ నివేదకలను సీబీఐకి అప్పగించాలని కూడా హైకోర్టు ఈ సందర్భంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను అదేశించింది. బీజేపీ నేతలు బసనగౌడ పాటిల్ యత్నాల్, అరవింద్ లింబావలి తదితరులు వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎం.నాగప్రసన్న సారథ్యంలోని ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. వాల్మీకి స్కామ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గత జూన్‌లో బళ్లారికి చెందిన కాంగ్రెస్ ఎంపీ ఇ.తుకారాం, ముగ్గురు కర్ణాటక ఎమ్మెల్యేల నివాసాలపై దాడులు జరిపింది. గిరిజన సంక్షేమానికి ఉద్దేశించిన కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయని, అక్రమంగా కార్పొరేషన్ అకౌంట్లలోని నిధులను తప్పుడు బ్యాంకు అకౌంట్లలోకి బదిలీ చేశారని ఈ కేసులో ప్రధాన ఆరోపణగా ఉంది. షెల్ కంపెనీలకు తరలించిన నిధులను 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో బళ్లారి నియోజకవర్గంలో వినియోగించినట్టు ఈడీ చెబుతోంది. రాష్ట్రంలోని ఎస్టీల సామాజిక, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా నిర్దిష్ట సంక్షేమ పథకాల అమలుకు 2006లో కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్స్ డవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటయింది. 2024 మే 21న వాల్మీకి కార్పొరేషన్ అకౌంట్స్ సూపరింటెండెంట్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంతో నిధుల దుర్వినియోగం విషయం వెలుగుచూసింది. కార్పొరేషన్ నుంచి అక్రమంగా వివిధ బ్యాంక్ అకౌంట్లకు నిధులు బదిలీ అయినట్టు ఆ అధికారి రాసిన సూసైడ్ నోట్‌ను అధికారులు ఆ తర్వాత కనుగొన్నారు.



మోకాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న మెదక్ బిజెపి ఎంపీ రఘునందన్ రావును పరామర్శించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్ రాంచందర్ రావు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

హైదరాబాద్ (జనంసాక్షి)

# పాశమైలారం ప్రమాద స్థలిని సందర్శించిన కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి

హైదరాబాద్ (జనంసాక్షి) : కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు, ఎమ్మెల్సీ చిన్న మైల్ అంజిరెడ్డి, బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డితో కలిసి పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదస్థలిని సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరు, మృతుల వివరాలు, బాధిత కుటుంబాలకు అందుతున్న సహాయ సహకారాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పటాన్? చెరులోని ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులకు అందుతున్న చికిత్స గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిజానికి హైదరాబాద్ నగరంలో ఇంత పెద్ద పేలుడు ఘటన మునుపు ఎన్నడూ జరగలేదు. ఫార్మా కంపెనీలకు సంబంధించిన రా మెటీరియల్ ప్రొడ్యూస్ చేస్తున్న కంపెనీ సిగాచి. బాయిలర్ బ్లాస్ట్ జరిగి ఇంత పెను ప్రమాదం సంభవించింది. ఇంత ముందు రాంచందర్ రావు చెప్పినట్టు ఇప్పటి వరకు 46 మంది మృతదేహాలు ఇప్పటికే లభించాయని, మరో 13 మంది ఆచూకి ఇప్పటికే దొరకలేదని, మిగిలినవారు చికిత్స పొందుతున్నారని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేస్తున్నామని అధికారులు చెప్పారు. గత నెలలో చార్మినార్? దగ్గర ఏసీ కంప్రెషర్ లో షార్ట్ సర్క్యూట్ జరిగి 17 మంది చనిపోయారు. ఇలాంటి వరుస ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇది రాజకీయాలు చేయాల్సిన సమయం కాదు.. కాబట్టి నేను అధికారులను, ప్రభుత్వాన్ని కోరేది ఒక్కటే.. ఇలా ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న అన్ని కంపెనీలను ఉన్నతాధికారుల బృందాలు ఏర్పాటు చేసి పూర్తిగా తనిఖీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారు.. ఎలాంటి తనిఖీలు జరుగుతున్నాయి.. తనిఖీలు లంచాల కోసం జరుగుతున్నాయా? ఇన్‌స్పెక్షన్స్ తూతూ మంత్రంగా జరుగుతున్నాయా? లేదా ప్రమాదాలు జరగకుండా, ప్రమాదాలను అరికట్టేవిధంగా జరుగుతున్నాయా? అనే అంశాలను ప్రభుత్వం చూడాలి. ఇలాంటి బ్లాస్టింగ్ దుర్ఘటనలు మళ్లీ జరగకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. పొట్టకూటి కోసం సొంత గ్రామాలను, బంధువులను, అయినవారిని వదిలి ఇక్కడికి వచ్చి ఉద్యోగం చేస్తూ ఈ రకంగా 46 మంది చనిపోవడం ఏదైతే ఉన్నదో.. చాలా దురదృష్టకరం. ప్రాణం అందరికీ ఒక్కటే.. పేదవారు అయినంత మాత్రాన వారి ప్రాణానికి తక్కువ అంచనా వేయకుండా.. వారిని అన్ని రకాలుగా ఆదుకోవాలని సంబంధిత కంపెనీని కోరుతున్నాను. బాధిత కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ఆ కంపెనీ యాజమాన్యంపై ఉందన్నారు.

# లంచం తీసుకుంటూ పట్టబడ్డ జిహెచ్‌ఎంసి ఉద్యోగి

హైదరాబాద్, జులై 1 (జనంసాక్షి) : లంచం తీసుకుంటుండగా జిహెచ్‌ఎంసి మూసాపేట్, సీనియర్ అసిస్టెంట్‌ను ఎసిబి అధికారులు మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి అధికారుల కథనం ప్రకారం జిహెచ్‌ఎంసి, మూసాపేట్ సర్కిల్ 23లో, ఎం.సునీత సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. బాధితుడి తల్లి పేరుపై ఉన్న ఆస్తిని తన పేరుపై మార్చి మ్యూటేషన్ చేయాలని ప్రాపర్టీ ట్యాక్స్ విభాగంలో పనిచేస్తున్న సునీతను సంప్రదించాడు.ఈ పనిచేసేందుకు సునీత రూ.80,000 లంచం డిమాండ్ చేసింది. పలుమార్లు కలిసి బతిమిలాడగా, చివరకు రూ.30,000లకు చేస్తానని, అంతకంటే తక్కువకు చేయనని చెప్పింది. దీంతో విసిగిపోయిన బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు సునీతకు రూ.30,000 ఇస్తుండగా ఎసిబి అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అరెస్టు చేసి నాంపల్లిలోని ఎసిబి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించింది.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
2 జూలై 2025
తెలంగాణ

# పల్లె సీమలు ప్రగతి శిఖరాలు



పాడి పంటలతో తులతూగే పల్లె ప్రాంతాలు ప్రగతి శిఖరాలు." పల్లెటూరు మన భాగ్య సీమరా..." అంటూ కొసరాజు రాఘవయ్య గారి కలం నుండి వెలువడిన గీతానికి ఐదు పదుల వయసు దాటినా, ఆ పాట నిత్యసత్యంగానే నేటికీ అజరామరమై వెలుగొందు తున్నది. పల్లె సీమలు నిర్లక్ష్యానికి గురవుతున్నా, వాటి గొప్పదనం ఎవరూ కాదనలేని అక్షరసత్యం.పల్లె తల్లి వంటిదనే నానుడి ఏనాటిదో తెలియదు కాని ఇది నూటికి నూరుపాళ్ళు నిజం. పల్లెలు ఆప్యాయతలకు నెలవులు. పండుగలు,శుభ కార్యాల్లో పల్లెల్లో కనిపించే సందడి అద్భుతం. ఎవరైనా రోగాల బారిన పడితే ప్రతీ ఒక్కరూ పరామర్శకు వెళ్ళి ధైర్యం చెప్పడం,ఎవరైనా కాల ధర్మం చేస్తే అంతా ఒక్కటై, అంత్యక్రియల ప్రక్రియ వరకూ సహకరించడం వంటి చర్యలతో ప్రజలు సుహృద్భావాన్ని ప్రదర్శించేవారు. పల్లెలు ఆత్మీయతలకు ఆలవాలంగా విరాజిల్లేవి. అరమరికలు లేని కలుపుగోలుతనం గ్రామ సీమల స్వంతం. అయితే గ్రామ సీమల్లో గుభాళించిన ఒకప్పటి మాధుర్యం క్రమేపీ తగ్గుముఖం పట్టి, నాడు విరిసిన ఆత్మీయతలు ఆవిరై గత చరిత్రలా మిగిలిపోవడం బాధా కరం. ఇబ్బడి ముబ్బడిగా జనజీవితాల్లో వెల్లువెత్తుతున్న సాంకేతిక సాధనా లు, ముఖ్యంగా చరవాణి గ్రామవాసులను కట్టడి చేసి, కేవలం నాలుగు గోడల మధ్య బంధించింది. గ్రామాల్లో నివసించ డం నామోషీగా భావిస్తున్న పల్లె యువత నగరాల వైపు పయనమైపో తున్నారు. ఆర్థికంగాను,ఉద్యోగ పరంగాను విదేశాల్లో స్థిరపడ్డవారు స్వదేశానికి రావడం తగ్గించేసారు. తల్లి దండ్రులను పల్లెల్లో ఒంటరిగా వదిలేసి,విదేశాల్లో స్థిరపడడం వలన పెద్దల వృద్ధాప్యం దుంఖసాగరంలో మునిగి పోతున్నది. ఎంత సంపాదించినా, ఎన్ని ఆస్తులు కూడ బెట్టుకున్నా, చేసే దిక్కూ మొక్కూ లేక అవసాన దశలో అసహాయ పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పల్లెల్లో నిర్మించుకు న్న పెద్ద పెద్ద భవంతులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఒంటరిగా జీవిస్తూ, చనిపోయినా బాహ్య ప్రపంచానికి తెలియని దుర్దినాలు దాపురిస్తున్నాయి. నగరాలకు వలస పోయి, పల్లె సీమ లను నిర్లక్ష్యం చేయడం, పల్లెల్లో జీవించడం నామోషీగా భావించడం వర్తమానంలో జరుగుతున్న అపసవ్య పరివర్తనకు అద్దం పడుతున్నది.

నగరాల్లో జీవిస్తున్నా పల్లెల గొప్పదనాన్ని విస్మరించరాదు. పచ్చని పైర్లతో,ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తూ, అలరించే ప్రకృతి పల్లెల స్వంతం.పల్లెలే ప్రగతికి సోపానాలు.సాంకేతిక విప్లవం కారణంగా ప్రపంచం మొత్తం ఒక కుగ్రామంగా మారిన తరుణంలో పల్లెలన్నీ నగరీకరణ, ప్రపంచీకరణ పేరుతో కట్టలు తెంచుకుని పరుగులు పెడుతున్న నేపథ్యంలో మానవుల మధ్య సంబంధాలు కూడా అంతే వేగంతో దిగజారిపోతున్నాయి. ఉమ్మడి కుటుంబాలు అంతరించి, స్వేచ్ఛ పేరుతో, ప్రైవసీ పేరుతో న్యూక్లియర్ కుటుంబాలు ఆవిర్భవిస్తున్నాయి.పల్లెలన్నీ నాగరికత పేరుతో నగర వాతావరణాన్ని సంతరించుకుంటున్నాయి. ఒకప్పుడు ఆహ్లాదకరంగా ఉండే పల్లె వాతావరణం గతకాలపు వైభవంగా చరిత్రలో కలిసిపోయింది. పల్లె జనం తమ అస్థిత్వాన్ని విడనాడి,నగరాలవైపు వలస పోతున్నది. గ్రామాలంటే కంటగింపుగా మారాయి.కృత్రిమ వాతావరణంలో, కాంక్రీటు అరణ్యాలలో అధునాతన కట్టడాలలో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్న నేటి పోకడలను చూస్తుంటే భయమేస్తుంది.జనసంద్రంలా మారిన నగర వాతావరణం లో ఇమడలేని జనం కూడా ఒకప్పటి పల్లె వాతావరణాన్ని గుర్తుచేసుకునేలా శుభకార్యాలు,పర్వదినాల పేరుతోనో,మార్నింగ్ వాకింగ్ ల పేరుతోనో పార్కుల్లో నలుగురితో కలిసిపోయి ఆత్మీయంగా పలకరించుకుంటూ,చక్కని సంబంధాలను నెలకొల్పుకుంటున్నారు.విదేశాల్లో ఉండే భారతీయులు కూడా అలనాటి భారతీయ సంస్కృతిని,కలుపుగోలు తనాన్ని గుర్తు చేసుకుంటూ తమ జీవనశైలిలో మార్పులు చేసుకోవడం గమనార్హం. మరి పల్లెలేమో నాగరికత మోజుతో విలువలను విధ్వంసం చేసుకుంటున్నాయి. పల్లెలను వీడి,పల్లెల్లో పనిచేయడం మాని, నగరాల వైపు పరుగుతీయడం బాధాకరం.దేశంలో జనాభా పెరుగుతున్నది, పెరిగిన జనాభాతో పాటుగా,పోటాపోటీగా అవసరాలు కూడా పెరుగుతున్నాయి. అవసరాలకు తగ్గట్టుగా వనరుల కల్పన కూడా కష్టతరమౌతున్నది.విద్యావకాశాలు మెరుగుపడ్డాయి.కాని విద్యా ప్రమాణాలు దిగజారిపోయాయి. చదువుకున్న యువతకు చదువుకు తగ్గరీతిలో ఉపాధి అవకాశాలు కలగడం లేదు.నిరుద్యోగ యువత ఉద్యోగవేటలో పడి,నగరాల్లో తిరుగుతూ నరకయాతన అనుభవిస్తున్నది. మురికి వాడలు పెరిగిపోయాయి.నగర వాసులు చాలీ చాలని సంపాదనతో రేయింబవళ్లు శ్రమచేస్తూ,భారమైన బ్రతుకులతో బయటకు చెప్పుకోలేని బాధలను అనుభవిస్తున్నారు.హాయిగా, ఉండే పల్లెల్లో పనులు చేయడం నామోషీగా భావించడం వలనే ఇలాంటి అస్థవ్యస్థ పరిస్థితులు దాపురిస్తున్నాయి.ఇంటిపని,వంట పని చేయడం అవమానంగా భావించే యువత తయారైంది. చదువులంటే సంస్కారానికి కాకుండా విలాసాలకు, అలంకారాలకు నిలయంగా భ్రమించే యువత తయారైంది. పల్లెటూర్లలో హాయిగా పనిచేసుకునే వారిని, నాగరికత పేరుతో నగరాలకు వలస పంపిస్తూ తమ పిల్లలు సిటీలో ఉద్యోగాలు చేస్తున్నారని నలుగురిలో గొప్పలు చెప్పుకోవడం పరిపాటిగా మారింది. ఇలాంటి ధోరణుల వలనే పల్లె యువత నగరాలకు పయనమై దినదినగండం నూరేళ్ళ ఆయుష్షులా నెట్టుకొస్తున్నది. కొంతమంది విదేశాల్లో అడ్డమైన చాకిరీ చేస్తూ, అష్టకష్టాలు పడుతున్నారు. ఇక్కడ వంట చేయడం,అంట్లు తోమడం అప్రతిష్ఠగా భావిస్తున్న వారంతా విదేశాల్లో అలాంటి పనులే చేస్తూ, లేనిపోని డాంబికాలకు పోవడం విడ్డూరం.

గ్రామీణ ప్రాంతాల్లో బ్రతికే ప్రజలను చులకనగా చూసే పద్ధతి మారాలి. నగరాల్లో జీవించే వారంతా ఒకప్పుడు పల్లెటూళ్ళలోనే బ్రతికే వారని,వారి తల్లిదండ్రులుగాని, ఇతర పూర్వీకులుగాని పల్లె వాతావరణం నుంచి వచ్చినవారనే స్పృహ కలగాలి. మహామహులు గా భారత చరిత్రలో సుస్థిరం స్థానం సంపాదించిన వారిలో అత్యధికులు పల్లెల నుంచే తమ ప్రస్థానం కొనసాగించారన్న సంగతి మరువరాదు. యువత ధోరణిలో కూడా మార్పు రావాలి. పెరుగుతున్న దేశ జనాభాతో పాటుగా నగరాలు పెరగవు. అందరికీ సరిపడా ఉద్యోగాలు నగరాలు కల్పించలేవు. అరకొరజీతాలతో పెరిగిన ఖర్చులతో చిన్నాభిన్నమౌతున్న యువత పల్లెల్లో బ్రతికే తల్లిదండ్రులపై ఆధారపడడం,వారి అవసరాలకు తిండిగింజలను సైతం ఇక్కడనుంచి తామే పంపించడం మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. ఇలాంటి దారుణ పరిస్థితుల మధ్య ఇంకా నగరాలవైపు పరుగెత్తడం మానుకోవాలి. ప్రభుత్వాలు ఈ విషయంలో యువతకు తగిన హితబోధ చేయాలి. పల్లెల్లో జీవించడానికి నాణ్యమైన అన్ని సదుపాయాలు నెలకొల్పాలి. అన్ని వృత్తులను పునరుద్ధరించాలి. ఇతోధిక ప్రోత్సాహకాలు అందించాలి. చదువుకున్న వారంతా ఇంజనీర్లు,డాక్టర్లుగా మారిపోవాలన్న ధోరణి మారాలి. నాగరికత పేరుతో విలాసాల పేరుతో, తల్లిదండ్రుల ఆస్తులను అమ్మించి, భ్రమల్లో బ్రతికే విద్యావంతుల వైఖరి మారాలి. పచ్చని ప్రకృతితో శోభిల్లుతూ, అరమరికలు లేని ఆత్మీయ బంధాలతో తులతూగే అలనాటి పల్లెవాతావరణాన్ని పునరుజ్జీవింప చేయాలి.నగర వాతావరణానికి అలవాటు పడిన యువతను పల్లెలబాట మళ్లించాలి. ఆనాడే నిజమైన దేశ ప్రగతి జరుగుతుంది. గ్రామ సీమల సౌభాగ్యమే దేశ పురోగతికి మూలం.



-సుంకవల్లి సత్తిరాజు.
(సామాజిక విశ్లేషకులు, మోటివేషనల్ స్పీకర్)
మొబైల్ : 9704903463.



## కార్మికుల ప్రాణాలు గాల్లో దీపాలు

అధిక జనాభా గల భారతదేశంలో ఉపాధి కోసం ప్రజలు పలు ప్రాంతాలకు వలస వెళ్తుంటారు. ఈ క్రమంలో తెలంగాణ రాజధాని హైదరాబాదులో వివిధ రాష్ట్రాల నుంచి కార్మికులు ఉపాధి కోసం వలస వస్తుంటారు. అంతేకాకుండా ఇటీవల గ్రామీణ ప్రాంతాలకు సైతం వ్యవసాయ, భవన నిర్మాణ రంగంలో, ఇటుక బట్టీల్లో పనిచేయడానికి పలు రాష్ట్రాల నుంచి పలువురు కూలీలు వస్తుంటారు. వారు స్థానికంగా పని ప్రదేశం దగ్గర ఉండి తక్కువ కూలికి పని చేయడం వల్ల వారికి తీసుకురావడం జరుగుతుంది. యజమానులు వారితో పని చేయించుకోవడంతో పాటు వారి భద్రతను మరిచిపోతున్నారు. ఈ నిర్లక్ష్యం ధోరణి వల్ల పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. నిన్న పాశమైలారం లో రియాక్టర్ పేలుడు దుర్ఘటన చాలా కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. దాదాపు 40 మందికి పైగా కార్మికులు మరణించారని అధికారులు చెబుతున్నారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. మృత్యుల్లో బీహార్ ఒడిస్సా మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ ,తెలంగాణ ప్రాంతం నుంచి ఉన్నారని తెలిసి వస్తుంది. పొట్టకూటి కోసం సుదూర ప్రాంతాలకు వలస వచ్చి ప్రాణాలు కోల్పోవడం అందరిని కలిసి వేస్తుంది. పలు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వివిధ రాష్ట్రాల నుంచి హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న ఫార్మా కంపెనీలు మరియు ఇతర కంపెనీలకు కార్మికులు పనిచేయడానికి వస్తుంటారు.పరిశ్రమలు, కర్మాగారాల్లో పనిచేసే కార్మికుల ప్రాణాలు గాల్లో దీపాల్లా మారాయి. నిత్యం జరుగుతున్న ఘటనలతో కార్మికుల ప్రాణాలు పోతుండగా, చాలాచోట్ల కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలొస్తున్నాయి. ముఖ్యంగా కెమికల్, ఔషధ పరిశ్రమల్లో వినియోగించే రసాయనలతో వల్ల ఆరోగ్యానికి ప్రమాదం పొంచి ఉంది. అంతేకాకుండా తమ పిల్లలకు చదువులేక భారం కార్మికుల మార్చుతున్నారు. కార్మికుల భద్రత, పరిశ్రమల్లో తనిఖీలపై ప్రభుత్వం దృష్టి సారించాలనే డిమాండ్స్ వినిపిస్తున్నాయి. కొన్ని కంపెనీలలో కార్మికులు చనిపోయిన ఎవరికి తెలియకుండా వారికి ఎంతో కొంత పరిహారం ఇచ్చి బయటకు రాకుండా చూస్తారు.

**కంపెనీలపై చర్యలు తీసుకోవాలి.**

మెజార్టీ కంపెనీలు ప్రభుత్వ కనుసన్ననలో నడుస్తుంటాయి. అంతేకాకుండా ఆధిపత్య వర్గాల చేతిలోనే ఇవీ ఉంటాయి. అధికారులను కూడా కమ్ముతారు. ఈ క్రమంలో కార్మికులకు ఎటువంటి ప్రమాదం జరిగిన వారిని పట్టించుకోని నాధుడు లేకుండా పోతుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఎన్నో కార్మిక చట్టాలు చేశారు. భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల్లోని ఎన్నో ప్రకరణలు కార్మికుల సంక్షేమం గురించి తెలుపుతున్నాయి. గత అయిదు ఏళ్ల క్రితం పాటి స్థలంలో భద్రత, ఆరోగ్యం మరియు పని పరిస్థితుల కోడ్ 2020, వేతనాల కోడ్, 2019, సామాజిక భద్రత కోడ్, 2020 లు ఆధునిక అవసరాలను కనుగుణంగా తీసుకురావడం జరిగింది. ఈ చట్టాలు కార్మికుల వేతనాలు, పని గంటలు, సెలవులతో పాటు వారి భద్రత, సామాజిక భద్రత వంటి అంశాలపై నియమాలను రూపొందించాయి. ఇవీ కార్మిక చట్టాలు కార్మికుల హక్కులను, భద్రతను, సంక్షేమాన్ని కాపాడటానికి రూపొందించబడ్డాయి. కావున ప్రభుత్వాలు భద్రతా ప్రమాణాలు పాటించని కంపెనీ యజమానులపై కఠినమైన చర్యలు తీసుకోవాలి. కంపెనీలను మూసివేయాలి. ప్రమాదంలో నష్టపోయిన కుటుంబానికి ఆర్థికంగా సామాజికంగా ఆదుకోవాలి. వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికుల డాటా ప్రభుత్వం దగ్గర ఉండాలి. దాన్ని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వారి యోగక్షేమాలను చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపైన ఉంది.

సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు, 7989479428

## అన్నదాతల ఆత్మహత్యలు ఆపాలి

సాయం లేకున్నా
సాగుచేస్తున్న రైతన్నకు
సమస్యలే ఆసులైనాయి
మార్కెట్లో మోసాలే
సంపద అయింది
అన్నదాతకు ఆకలి
మిగిలింది ఆత్మహత్యే
శరణ్యం అయ్యాయి

భూమిని నమ్మినాటు వేసి
కొత కోసి పంట పండించిన
ఆరుగాలం నీ శ్రమకు
ప్రతిఫలం లేక దిక్కులను
చూస్తూ దిగులు నీపాలిట
గుదిబండ అయ్యేనా

పరుల కొరకు పాటు పడే
రైతన్న నకిలీ విత్తనాలు
కల్తీ ఎరువుల కాఠిన్యతకు
పురుగుమందుల
విషకౌగిట్లో చిక్కుకొని
విలవిలలాడేజి
రైతన్న భలిపశువు
అయిపోయి
కుటుంబం కుదేలైంది

ప్రకృతి విపత్తుల దాటికి
పంట పోయి ప్రాణాలు
పోయి బావురు మంటూ
రైతు కుటుంబాలు వీధి
పాలై బతుకుకు భద్రతలేక
చావుకు భీమా రాక
సమస్యల సుడిగుండంలో
జీవితం గడుపుతున్నాడు
రైతన్నపంటకు
గిట్టుబాటు దర లేక
దిక్కులేని అనాధైనాడు

దుక్కి దున్ని, నాట్లు వేసి
కోతకోసి, కుప్పనూర్చి
మార్కెట్లో మరణ శయ్యపై
ప్రాణాలు వదులుతున్న
పట్టించుకునే వారు లేక
అధికారుల నిరాదరణ
పాలకుల రాజకీయ
క్రీడలో బలవంతపు
చావే (నీ) రైతుల రేవాయే

వ్యవసాయం వదిలి
బతుకుకై పట్టణ బాట
పట్టిన నీకు అడుగడుగున
మోసాలే పలకరించె
(దర్శన మిచ్చే )
ఆత్మహత్యలే నీఆస్తి ఆయే

కార్పోరేట్ మార్కెట్
కార్పొరేట్ వ్యవసాయం
మయాజాలానికి
కల్తి ఎరువులు విత్తనాలు
రాజ్యమేలి నీబతుకు చిద్రం
చేసి ఉరికొయ్యలు అప్పులే
నీ ఆస్తులయ్యే

అమ్మబోతే అడవి
కొనబోతే కొరివిలా
తయారైన పాలకుల
ప్రవర్తన నీకు నిరాశ
నిస్పృహ లనే
కానుకగా ఇచ్చే
స్థితి మారాలి

నీ పంటకు నీవే దర
నిర్ణయించుకోవాలి
ఆపద అమ్మకాలు
అంతం కావాలి
ధళారీ వ్యవస్థ
రద్దు కావాలి
రైతాంగ శ్రేయస్సే
కేంద్రంగావ్యవసాయ
విధానం ఉండాలి

వ్యవసాయ రంగం
యువతను ఆకర్షించే
విధంగా విధి విధానాలు
రూపొందించాలి

ఆధునిక వ్యవసాయం
అభివృద్ధికి ఊతం
ఇవ్వాలి నేల తీరును
బట్టి పంటలు
సేంద్రియ సాగుతో
మేలు రకం
పంటలతో ప్రగతిశీల
సాగుయే లక్ష్యంగా
ముందుకు సాగాలి

శాస్త్రీయ సాగుతో
సస్యశ్యామలమైజి
సాగు స్వయం
స్వమృద్ధితో సాగాలి
అప్పుల ఊబిలో
చిక్కినరైతన్నను
సబ్సిడీ రుణాలతో
ఆదుకోవాలి

పాలకులు రైతే
సంక్షేమమే కేంద్రంగా
సాగువిధానంతో చేయూత
నిచ్చి అన్నధాతలను
ఆదుకోవాలి

జై జవాన్ జై కిసాన్
అనే నినాదాన్ని కర్షక
సంక్షేమవిధానంగా
అమలు చేయాలి
రైతునే నిజమైన
రాజును చేయాలి
అన్నదాతల ఆత్మ హత్యాలు
ఆపాలి భారత్ ను
అన్నపూర్ణగా నిలుపాలి




నేదునూరి కనకయ్య
రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్
ఫోరం 9440245771
కరీంనగర్

### వచన సోయగాలు

శిల్పంలో వచనం అక్షర నర్తన తాండవం
భావోద్వేగాల లయ బద్ధ శబ్ద విన్యాసం
జీవిత సత్య నిత్యాల నృత్యాల చిత్రం
పదాలు కడిగిన ఆణి ముత్యాల రూపం
ప్రాస శ్వాసలతో ఉట్టిపడే జీవం
ఉపమానాలు ప్రకృతికి పట్టిన అద్దాలు
ఆలోచనలు రేకెత్తించే శైలి
పాఠకులను ఆకర్షించే విశాలి

పూసాల సత్యనారాయణ, హైదరాబాద్

## భవిష్యత్తుకు ప్రగతిపథం బాటలు వేసే
# విద్యా విధానం కావాలి




విద్యార్థులకు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన విద్యారంగం, నేడు అనేక సవాళ్లతో సతమతమవుతోంది. వ్యాపార కేంద్రాలుగా మారిన విద్యాసంస్థలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, కేవలం మార్కులు, ర్యాంకులకు ప్రాధాన్యతనిస్తూ జ్ఞాన వికాసాన్ని నిర్లక్ష్యం చేయడం వంటివి ప్రస్తుత విద్యావిధానంలోని లోపాలు. ఈ నేపథ్యంలో, సమూలమైన మార్పులు ఆవశ్యకం.

**వ్యాపారీకరణకు అడ్డుకట్ట, నాణ్యతకు పెద్దపీట**

ప్రస్తుతం, విద్య అనేది ఒక వ్యాపారంగా మారిపోయింది. ప్రైవేటు విద్యా సంస్థలు భారీగా ఫీజులు వసూలు చేస్తూ, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయి. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయాలి. విద్యను మళ్లీ ఒక సేవా దృక్పథంతో చూడాలి. నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం ప్రభుత్వాల బాధ్యత. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయా లను మెరుగుపరచడం, ఆధునిక బోధనా పద్ధతులను ప్రవేశపెట్టడం ద్వారా వాటిని బలోపేతం చేయాలి. తద్వారా, ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించి, ఒకే విధానంలో విద్యా బోధన జరిగేలా చూడాలి.

**జ్ఞాన వికాసానికి, వృత్తి నైపుణ్యాలకు ప్రాధాన్యత**

నేటి విద్యావిధానం కేవలం మార్కులు, ర్యాంకుల చుట్టూ తిరుగుతోంది. ఇది విద్యార్థులపై అనవసరమైన ఒత్తిడిని పెంచుతోంది తప్ప, వారికి నిజమైన జ్ఞానాన్ని, నైపుణ్యాలను అందించడం లేదు. నూతన విద్యా విధానంలో జ్ఞాన వికాసానికి, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలి. సిద్ధాంత పరిజ్ఞానంతో పాటు, ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించే వృత్తి విద్యా వర్క్‌షాప్‌లు కలిగిన విద్యాలయాలను ఏర్పాటు చేయాలి. ఇది విద్యార్థులను భవిష్యత్తులో ఉద్యోగాలకు సిద్ధం చేయడమే కాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది.

**ఆవిష్కరణాత్మక బోధనా పద్ధతులు, ఉపాధ్యాయుల శిక్షణ**

బోధనా పద్ధతులలో గణనీయమైన మార్పులు అవసరం. కేవలం బట్టీపట్టే విధానానికి స్వస్తి పలికి, ఆవిష్కరణాత్మక, సృజనాత్మక పద్ధతులను ప్రోత్సహిం చాలి. విద్యార్థులకు ఆసక్తి పెంపొందించే విధంగా, ఆడుతూ పాడుతూ విజ్ఞాన వికాసానికి దోహదం చేసేలా విద్యా సంస్థలు ఉండాలి. దీనికి అనుగుణంగా, ప్రతి ఉపాధ్యాయునికి అవసరమైన ఆధునిక శిక్షణను అందించాలి. సాంకేతిక పరిజ్ఞానాన్ని బోధనలో సమర్థవంతంగా వినియోగిం చుకునేలా ఉపాధ్యాయులను తీర్చిదిద్దాలి. బోధన అనేది కేవలం సమాచారా న్ని అందించడం కాకుండా, విద్యార్థులలో ఆలోచనా శక్తిని, విశ్లేషణాత్మక నైపుణ్యాలను పెంపొందించేదిగా ఉండాలి.

**తల్లిదండ్రుల భాగస్వామ్యం, బంగారు భవిష్యత్తు**

నూతన విద్యా విధానం విజయవంతం కావాలంటే, తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకం. కేవలం పాఠశాలపైనే భారం వేయకుండా, తల్లిదండ్రులు తమ వంతు బాధ్యతగా తమ పిల్లలకు సరైన విద్యావకాశాలు కల్పించాలి. పిల్లల అభిరుచులను గుర్తించి, వారిని ప్రోత్సహించాలి. విద్యార్థులు పాఠశాలలోని అన్ని కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనేలా చూడాలి. ఇంటి వద్ద కూడా నేర్చుకునే వాతావరణాన్ని కల్పించడం ద్వారా వారి బంగారు భవిష్యత్తు కోసం కృషి చేయాలి.

నూతన విద్యా విధానం అనేది కేవలం పుస్తకాల బరువును తగ్గించడం కాదు, విద్యార్థులపై ఆర్థిక భారాన్ని తగ్గించడం మాత్రమే కాదు. అది వారిని జ్ఞానవంతులుగా, నైపుణ్యవంతులుగా, బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దే సమగ్ర ప్రణాళిక. ఈ మార్పులు సాకారమైతేనే, భవిష్యత్ తరాలకు నిజమైన ప్రగతిని అందించినట్లవుతుంది.

దండంరాజు రాంచందర్ రావు
పాత బోయినపల్లి, 9849592958

## సాహిత్య విమర్శలో దిక్సూచి - చేకూరి రామారావు

"కవిత్వంలో సూక్ష్మతను కోరుకుంటూ, భావుకతను మెచ్చుకుంటాను" అని ప్రకటించిన చేకూరి రామారావు, తెలుగు సాహిత్యంలో గాఢమైన భావనా బలం, సూక్ష్మమైన వ్యక్తీకరణ శైలితో ప్రసిద్ధులు. 1934 అక్టోబర్ 1న ఖమ్మం జిల్లా, మధిర తాలూకాలోని ఇల్లెందులపాడు గ్రామంలో జన్మించిన ఆయన, తెలుగు భాషా, సాహిత్య పరిశోధనలో అమర స్థానం సంపాదించారు.

చేరా రచనలు భాషాశాస్త్రం, విమర్శ, వ్యాసాలు, సాహిత్య విశ్లేషణలలో విస్తృతమైనవి.

భాషాశాస్త్ర గ్రంథాలు: తెలుగులో వెలుగులు, తెలుగు వాక్యం, భాషాతరంగం, భాషాపరివేశం, భాషానువర్తనం.

విమర్శ వ్యాసాలు: సాహిత్య విమర్శ-పరామర్శ, చేరాతలు, కవిత్వానుభవం, సాహిత్య కీర్మణం, వచన కవితా తత్త్వాన్వేషణ (2000), రింఛోళి.

ఇతర రచనలు: ముత్యాల సరాలముచ్చట్లు, చేరా పీఠికలు, సాహిత్య మహిళావరణం (2001).

చేకూరి రామారావు నోమ్ ఛామ్స్కీ యొక్క ప్రకృతి వ్యాకరణ సిద్ధాంతాన్ని (Transformational Generative Grammar) తెలుగు భాషకు అన్వయించి, భాషా నిర్మాణంలో స్వతంత్రత, సంక్లిష్టత, భావపుష్టతను విశ్లేషించారు. ఈ పరిశోధన తెలుగు భాషాశాస్త్రంలో మైలురాయిగా నిలిచింది (Chomsky, Aspects of the Theory of Syntax, 1965). ఈ పనిని ఆధారంగా చేసుకొని, ప్రొఫెసర్ భైరవ భూతం "తెలుగు వ్యాకరణ విప్లవం: ఛామ్స్కీ ప్రభావం" అనే వ్యాసం రచించారు.

**వచన కవిత్వంపై దృష్టి**

1970-1980లలో వచన కవిత్వం విస్తృతమైన సమయంలో, చేరా గారి విమర్శలు కవులకు మార్గదర్శకంగా నిలిచాయి. వచన కవిత్వాన్ని "నిర్మాణాత్మక భావవస్తువు"గా పరిగణించి, భాషా పరిమళంతో భావాన్ని అనుభవపూరితంగా వ్యక్తీకరించాలని సూచించారు (రామారావు, వచనవీధిలో వచన కవిత్వం, 1984). ఆయన వ్యాసమాలిక "చేరాతలు" 1986 అక్టోబర్ నుంచి 1994 మార్చి వరకు ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో ప్రచురితమై, 200కు పైగా వ్యాసాలతో సాహిత్య చర్చకు ఊపిరిపోసింది.

**"చేరాతలు" - కవిత్వ విమర్శకు గవాక్షం**

"చేరాతలు" వ్యాసమాలిక కేవలం వ్యాఖ్యానాలు కాక, కవిత్వాన్ని జీవించేలా చేసే భావ విశ్లేషణగా నిలిచింది. శబ్ద నిర్మాణం, ధ్వని సంబంధాలు, అర్థ సంబంధాలను విశ్లేషించే చేరా శైలి, కవులు తమ రచనలను పునర్వీక్షించేలా ప్రేరేపించింది.

**ఇతర విమర్శకుల స్పందనలు**

**దశరథి రామలింగయ్య:** "చేరా విశ్లేషణ నా కవితలను నాకే పరిచయం చేసింది" (ఆంధ్రభూమి, 1992).

**సి. నారాయణ రెడ్డి:** "చేరా కవిత్వాన్ని లోపలికి చదివించే దర్పణం" (సాహిత్య వేదిక, 1994).

**అక్కిరాజు ఉమాకాంతం:** "చేరా వ్యాసం నా కథల ఆకారాన్ని చూపించింది" (వచనవచనం, 1991).

**స్త్రీ కథలపై చేరా విమర్శ**

స్త్రీ కథలపై చేరా విమర్శలు సామాజిక చైతన్యాన్ని, స్త్రీ అనుభవాలను లోతుగా విశ్లేషించాయి. పి. సత్యవతి రచన "ఇల్లు అలకగానే"లో "ఇల్లు"ను ఆత్మ అస్థిత్వానికి బంధనంగా విశ్లేషించారు. ఓల్గా రచనల్లో రాజకీయ భిన్నత్వాన్ని "భావనాపర అసమ్మతి"గా నిర్వచించారు. కుప్పిలిపద్మ "మనసుకో దాహం"లోని "దాహం"ను మానవ సంబంధాల అసంపూర్ణతగా చిత్రించారు. అబ్బూరి ఛాయాదేవి "అయిదు నక్షత్రాలు"లో స్త్రీ జీవితాలను నిగూఢ భావలక్షణాలుగా విశ్లేషించారు.

కే. రామలక్ష్మి "నీదే నా హృదయం"లో స్త్రీ అనుభవాలను "నిర్వచనం"గా చూపారు. రంగనాయకమ్మ రచనలను "అంతఃపుర కదలికలు - బహిరంగ పునర్నిర్మాణం"గా వర్ణించారు (చేరాతల, 1986).

**కథా విమర్శలు**

నరసింహారెడ్డి "రెండు బాటలు"లో అంతర్గత మౌనాన్ని "లోపలి కన్నీటి గొప్పదనం"గా చిత్రించారు. జి.వి. కృష్ణారావు "శిథిల పర్వతం"ను "మనిషి శిథిలమైన భావ చిత్రణ"గా నిర్వచించారు. రాచపాళెం చంద్రశేఖరరెడ్డి "నోట్లు"లో వచన ప్రయోగాలను విశ్లేషించారు. కుర్రుమంచి సీతారామ్మూర్తి "ఒంటరి పండు"లో సాంఘిక అన్యాయ స్పందనను వివరించారు. గద్దర్ బాల విజ్ఞాన కథలను "వణికించే శబ్ద యంత్రం"గా అభివర్ణించారు. కొలకలూరి ఇనాక్ "దహనం"లో అసహనాన్ని "మండే భావం"గా చిత్రించారు.

**"రింఛోళి"**

2001లో వెలువడిన "రింఛోళి" వ్యాస సంకలనం, విమర్శానుబంధ పాత్య సంపదగా నిలిచింది. కోవెల సంపత్ కుమారాచార్య రచించిన "చేరా అనుశీలనం"తో ప్రారంభమైన ఈ సంకలనం, శ్రీశ్రీ, ఆరుద్ర రచనలపై చేరా యొక్క లోతైన విశ్లేషణలను అందించింది.

**భాషాశాస్త్రంలో చేరా పాత్ర**

చేరా ఛామ్స్కీ సిద్ధాంతాన్ని తెలుగు భాషకు అన్వయించి, వాక్య నిర్మాణం భావ వాహకతకు కీలకమని నిరూపించారు. ఆంధ్రప్రదేశ్ ఓపెన్ యూనివర్శిటీ, ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్శిటీలలో తెలుగు కోర్సుల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారు (పద్మనాభం, "తెలుగు లింగ్విస్టిక్స్ పరిణామం", 2002).

**తెలుగు బహువచన రూప నిర్మాణం**

1970, 1982లలో చేరా చేసిన బహువచన రూప నిర్మాణ పరిశోధన, పదాంశ విధేయ సూత్రాలు, వర్ణ విధేయ సూత్రాలను ప్రతిపాదించింది. ఉదాహరణకు, "వచ్చినాను వచ్చాను" వంటి ధ్వని మార్పులను శబ్దసంయోగ దృక్పథంతో విశ్లేషించారు.

తెలుగు పరివర్తన సిద్ధాంతంపై పిహెచ్‌డీ కోర్నెల్ విశ్వవిద్యాలయంలో "Transformational Theory in Telugu" అనే అంశంపై చేరా పిహెచ్‌డీ చేశారు. భద్రిరాజు కృష్ణమూర్తి ప్రోత్సాహంతో ఈ పరిశోధన జరిగింది.

1976లో "స్వరసమీకరణం" రచన ద్వారా తెలుగు వర్ణశాస్త్రాన్ని ఆధునిక భాషాశాస్త్ర సూత్రాలతో విశ్లేషించారు.

1984లో "బంధిపోట్లు" కవితపై చేరా విమర్శ, తెలుగు సాహిత్యంలో స్త్రీవాద విమర్శకు పునాది వేసింది. "పుట్టుమచ్చ" సంకలనంపై సమీక్ష, అణగారిన గొంతులకు స్పందనగా నిలిచింది. 2002లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన "స్మృతికిణాంకం" వ్యాస సంపుటి, ఆత్మీయం, ఉల్లాసం, ఉద్వేగం అనే మూడు భాగాలుగా విభజించబడింది.

చేకూరి రామారావు తెలుగు భాషా, సాహిత్య విమర్శలో శాస్త్రీయతను, అనుభవ సారాన్ని సమన్వయం చేసిన మేధావి. ఆయన రచనలు భాషాశాస్త్రవేత్తగా, విమర్శకునిగా, సామాజిక చైతన్య రచయితగా నిలిపాయి.

చేరా...
తెలుగు భాషకు అందించిన దిశ,
సాహిత్యానికి అద్దిన మెరుగు,
ఛామ్స్కీ సూత్రాలతో వేసిన బాటలు,
నేటి తరాలకు తరగని సంపద.



డా. ఐ. చిదానందం
తెలుగు అధ్యాపకులు
వెల్దండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ
నాగర్ కర్నూల్ జిల్లా
చరవాణి: 8801444335

# మియాపూర్ డివిజన్ పరిధి చెరువుల సుందరీకరణకు కట్టుబడి ఉన్నాం

● పిఏసి చైర్మన్ అరకెపూడి



**శేరిలింగంపల్లి, జూలై 1 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ డివిజన్ పరిధి పటేల్ చెరువు పెద్ద కుడి చెరువు రామసముద్రం కుంట చెరువు, నాయనమ్మ కుంట చెరువులను సుందరీకరించడానికి తాను నిజాయితీగా కట్టుబడి ఉన్నానని ప్రజా పద్దుల కమిటీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మియాపూర్ డివిజన్ పరిధి లక్ష్మీ నగర్ కాలనీలో నెలకొని ఉన్న నాయనమ్మ కుంట చెరువు సుందరీకరణలో భాగంగా నెక్సస్ సెలెక్ట్ మాల్స్, ఐజియుఎస్, హెచ్డిఎఫ్సి బ్యాంకుల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబుల్ ఫండ్ ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా చేపడుతున్న చెరువుల పునర్జీవన కార్యక్రమంలో భాగంగా సుందరీకరణ మరియు పునరుద్ధరణ పనులను మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువుల సుందరికరణ పనులకు శంకుస్థాపన చేసుకోవడం శుభపరిణామమని వివరించారు. సామాజిక దృక్పధాన్ని కలిగిఉండి మన భవిష్యత్తు తరాలకు ఆస్తులుకాదు మంచి ఆరోగ్యం, ప్రశాంత జీవితం ఇవ్వాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మియాపూర్ డివిజన్ పరిధిలో అన్ని చెరువులకు సుందరీ కరణ భాగ్యము దక్కిందని, త్వరలోనే మియాపూర్ రూపురేఖలు మారుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చెరువు సుందరికరణలో భాగంగా నెక్సస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ వారి సామాజిక సేవా నిధుల ద్వారా మల్లిగవాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా సుందరీ కారణ పనులు కొనసాగుతుండడం ఆహ్వానించదగ్గ పరిణామం అన్నారు. శుభపరిణామం అన్నారు. పటేల్ చెరువు పెద్ద కుడి చెరువు రామసముద్రం కుంట చెరువు నాయనమ్మ కుంట చెరువు పునరుద్ధరణ ప్రభుత్వం, పరిశ్రమలు మరియు సమాజం మధ్య భాగస్వామ్య ప్రయత్నాలు అర్థవంతమైన పర్యావరణ పురోగతిని ఎలా నడిపించగలదో చెప్పడానికి ఒక శక్తివంతమైన ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఈ ప్రాజెక్ట్ కీలకమైన సహజ వనరులను పునరుజ్జీవింపజేయడమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భవిష్యత్తులో సుస్థిరమైన అభివృద్ధికోసం ఒక ఉదాహరణగా నిలుస్తుందన్నారు. పటేల్ చెరువు, నాయనమ్మ కుంట తదితర చెరువులకు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలతో దశ, దిశ మారినట్టేనని, దశాబ్దాల సమస్యకు ఒక మంచి పరిష్కారం లభించినట్టేనని ఆశాభావం వ్యక్తంచేశారు. మురికి కూపంలాంటి చెరువును స్వచ్ఛమైనదిగా తీర్చిదిద్దడమే ధ్యేయంగాముందుకు సాగడం జరుగుతుందన్నారు. చెరువు పునర్జీవనం తరువాత కైదమకుంట సుజల జలంతో అపురూప దృశ్యకావ్యంగా ఆవిష్కృతమైతదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. చెరువు కట్టచుట్టూ చెట్లు పెంచి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని ఎమ్మెల్యే భరోసాను వ్యక్తం చేశారు. సమాజ హితం, సమాజసేవ చేయడంకోసం నెక్సస్ సెలక్ట్ మాల్ ముందుకు రావడం చాలా గర్వించదగ్గ విషయమని, ఈసందర్భంగా సాఫ్ట్ వెర్ సంస్థ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినదిస్తున్నానని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. చెరువు సుందరికరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టడం జరుగుతుందని, అంతే సత్వరంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికిప్రత్యేక కార్యాచరణను అమలు చేయడం జరుగుతుందన్నారు. చెరువు సుందరికరణలో భాగంగా చెరువుకట్ట పటిష్ట పరిచేలా పునరుద్ధరణ, మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి కాల్వ నిర్మాణం మరియు అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిని సారించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తదితరులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు డిఇ నళిని, ఏఇ పావని, ఐటీ సంస్థ ప్రతినిధులు రామ్ బొట్ట, నెక్సస్ సెలెక్ట్ మాల్స్ ప్రతినిధులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైస్ మిల్లర్లు గ్యారెంటీ పత్రాలను త్వరితగతిన అందజేయాలి

● అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్, జూలై 1 (జనం సాక్షి) :** గ్యారెంటీ, అంగీకార పత్రాలను త్వరితగతిన అందజేయాలని అదనపు కలెక్టర్ నగేష్ రైస్ మిల్లర్లను కోరారు. కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ఆయన రెవెన్యూ, పౌర సరఫరాలు, రైస్ మిల్లర్ల ప్రతినిధులతో రబీ కొనుగోలు ప్రక్రియ సంబంధించి బ్యాంక్ గ్యారంటీలు, సీఎంఆర్ డెలివరీ పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి. జిల్లాలో 36 రైస్ మిల్లులను గుర్తించామని, మిల్లులకు సంబంధించి బ్యాంకు గ్యారెంటీ రెండు రోజుల్లోగా అందించా లని అన్నారు. గడువులోగా సీఎంఆర్ డెలివరీ పూర్తి చేయాలని మిల్లర్లను ఆదేశించారు. మిల్లులవారీగా కేటాయించిన ధాన్యం ఇప్పటివరకు అప్పగించిన బియ్యం వివరాలను తెలుసుకున్నారు. డెలివరి ప్రక్రియను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్, డిఎం సివిల్ సప్లై జగదీష్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

● ఆత్మ కమిటీ చైర్మన్ వై. ప్రభు



**కొండాపూర్, జూలై 1 (జనం సాక్షి) :** మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామంలో ప్రజా పాలనలో ఆర్జీ పెట్టుకున్నా అర్జీ దారులను అర్హులైనటువంటి వారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి అర్హులైన లబ్ధిదారుల ఇంటి నిర్మాణంకు భూమి పూజ చేసి మంజూరు పత్రాలను ఆత్మ కమిటీ చైర్మన్ వై ప్రభు అందజేశారు. సందర్భంగా ఆత్మ చైర్మన్ ప్రభు, మాట్లాడుతూ అర్హులైన పేద ప్రజలకు ప్రయోజనాలను అందించడానికి పారదర్శక పద్ధతిలో ఇండ్లను మంజూరు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ వై.ప్రభు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.సత్తయ్య, సొసైటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, సదాశివపేట్ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాకుల కుమార్, నరసింహారెడ్డి, రామారావు,మండల జనరల్ సెక్రెటరీ నర్సింలు, యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు సునీల్, జగదీశ్వర్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం పాఠశాలలోనే నాణ్యమైన విద్య



**మొయినాబాద్, జూలై 1 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చక్కగా చదువుకోని ఉన్నత విద్యకు వెళ్లాలని జేబీఆర్ ఆర్కిటక్చర్ కళాశాల చైర్మన్ గాయత్రి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఎన్కెపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, స్టేషనరీ సామాగ్రీ విద్యార్థులకు ఆమె కళాశాల తరవున అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తమవంతు సహాయంగా స్టేషనరీ సామాగ్రీ అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సహకారాన్ని పుర్తిగా వినియోగించుకోని చదవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన ఉపాధ్యాయులు ఉండడంతో పాటు మంచి విజ్ఞానాన్ని నెర్పిస్తారన్నారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం మధ్యాహ్న భోజనం, స్కూల్ యూనిఫామ్, నోటు పుస్తకాలు అన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాధవి ఠాగూర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి




**నంగునూరు, జూలై 1 (జనం సాక్షి) :** చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావద్దని రాజగోపాల పేట ఎస్సై ఆసిఫ్ అన్నారు. సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, మాటలు నమ్మవద్దని అన్నారు. సోషల్ మీడియాకు ఎంత దూరం ఉంటే భవిష్యత్ అంత మంచిగా ఉంటుందని తెలిపారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని అన్నారు. పిల్లలను చదివించటానికి తల్లిదండ్రులు చేస్తున్న కష్టాన్ని విద్యార్థులు మనసులో పెట్టుకొని చదువుపై శ్రద్ధ వహించాలని సూచించారు. మహిళల రక్షణ చట్టాలు, షీ టీమ్ విధులు, షీ టీమ్ ద్వారా రక్షణ పొందే విధానాన్ని వివరించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్, సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. సామాజిక రుగ్మతలు, వాటి దుష్ఫలితాలను ఈ కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్ రావు సిద్దిపేట షీటీమ్ బృందం ఏఎస్ఐ కిషన్, మహిళా కానిస్టేబుళ్లు మమత, రజని, కానిస్టేబుళు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రమాణాలు మెరుగుపరిచేందుకు తనిఖీలు

● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, జూలై 1 (జనం సాక్షి) :** ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ఉన్నత స్థాయి తనిఖీ నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లో : డా. విమల థామస్, ఉన్నత స్థాయి తనిఖీ నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ కాలేజ్ అధ్యక్షతన ఉన్నతాధికారుల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్, జూలై 1, 2025 ၁ రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రమాణాలను మెరుగుపర్చేందుకు చేపట్టిన చర్యలలో భాగంగా, ఈరోజు మెదక్ ప్రభుత్వ మెడికల్ కాలేజ్, జనరల్ గవర్నమెంట్ హాస్పిటల్ మాతా-శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసిహెచ్ బ్లాక్)లో ఉన్నత స్థాయి తనిఖీ అసెస్‌మెంట్ ఇన్‌ఛార్జ్ డా. విమల థామస్ బృందం సభ్యులు తనిఖీ నిర్వహించారని తెలిపారు. బోధన సిబ్బంది పోస్టులు మరియు ఖాళీల స్థితి,హాస్పిటల్‌లోని యంత్రాంగాలు, ఐసీయూ, ఓటీ, సి టి, ఎమ్మార్ఐ లు,విద్యార్థులకు వసతి, హాస్టల్, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, లైబ్రరీ, మెస్, యాంటీ ర్యాగింగ్ వ్యవస్థలు కాలేజ్ మరియు హాస్పిటల్ మధ్య సమన్వయం,విద్యా, వైద్య సేవల నాణ్యత, నిర్వహణ ఊహించబడిన ముఖ్యమైన మార్పులు: ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టుల భర్తీ, వైద్య పరికరాల మరియు భద్రతా సదుపాయాల అప్‌గ్రేడ్ , విద్యార్థులకు మెరుగైన వసతి, డిజిటల్ మానిటరింగ్ సిస్టమ్స్ తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ తనిఖీ నివేదికను ముఖ్య కార్యదర్శికి సమర్పించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన రాష్ట్రవ్యాప్తంగా నెలనెలా సమీక్షలో భాగంగా ముందుగల చర్యలు చేపడతారు. ఈ సందర్భంగా డాక్టర్ విమల థామస్ మాట్లాడుతూ హాస్పిటల్ మరియు కాలేజ్ పరిపాలనల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి, న్యాయమైన ఆరోగ్య సేవలు అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డా. ఏ. సునీతా దేవి, మెడికల్ సూపరింటెండెంట్, జి జి హెచ్ మెదక్, డా. వీ. రవి శంకర్, ప్రిన్సిపల్, జిఎంసి మెదక్ ,డా. జయ, వైస్ ప్రిన్సిపల్, జీఎంసీ తదితరులు పాల్గొన్నారు.

## సొంతింటి కల కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం



**మర్పల్లి, జూలై 1 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గూడెం రాములు యాదవ్ అన్నారు. మర్పల్లి గ్రామంలో మంజూరైన ఇళ్ల నిర్మాణాన్ని మంగళవారం పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాములు యాదవ్ మాట్లాడుతూ...పేదోడికి సొంత ఇల్లు ఉండాలని లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి 5 లక్షల రూపాయలను అందజేస్తున్నారన్నారు. మంజురైనా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, ప్రభుత్వ సూచనల ప్రకారం గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో కూడా ఒకే విధమైన ఇండ్ల నిర్మాణం ఉంటుందన్నారు. ఇండ్లు మంజూ రైన లబ్ధిదారులు ముందుగా ఇందిరమ్మ ఇల్లు సర్టిఫికెట్ తో పాటు బ్యాంకు, ఆధార్ కార్డులో ఒకే రకమైన అడ్రస్ పేర్లు ఉండాలన్నారు. అంతే కాకుండా గ్రామ పంచాయతీ కార్యదర్శి సలహా మేరకు పత్రాలను సరి చేసుకోవాలని, ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ ఇల్లు మంజూరు చేయించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు శివ, వడ్ల వెంకటేశం, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ జగదీశ్వర్, నర్సింహులు యాదవ్, రాచన్న, పంతులు భావి శ్రీను, శ్రీనివాస్ రెడ్డి, వినోద్ స్వామి, వీరేశం, తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో వైద్యుల పాత్ర కీలకం




**నాగర్‌కర్నూల్ ఆర్సీ,, జూలై 1 (జనంసాక్షి) :** సమాజంలో వైద్య రంగంలో పనిచేస్తున్న వైద్యుల పాత్ర ఎంతో కీలకమైనదని, కరోనా, ప్రసవలు, ఆక్సిడెంట్, ఇతర ఆరోగ్య క్లిష్ట పరిస్థితులలో రోగులకు అందించిన వైద్య సేవలు వారి సహకారం అవిశ్రాంత కృషి ఎవరు మరువలేరని ప్రభుత్వ సాధారణ ఆస్పత్రి మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ ఆర్. రఘు అన్నారు. మంగళవారం నాడు లైన్స్ క్లబ్ ఆఫ్ నాగర్ కర్నూల్ మరియు క్లాస్‌మెట్ క్లబ్ వారి ఆధ్వర్యంలో వైద్యులను శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ సాధన ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్స్, ఇతర వైద్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి సురేష్, క్లాస్ మెంట్ క్లబ్ అధ్యక్షులు పోల శ్రీనివాస్, ప్రసాద్, సత్య సాయి సేవ సంస్థ కన్వీనర్ హకీం విశ్వప్రసాద్, ప్రొఫెసర్లు డాక్టర్ సుప్రియ,డాక్టర్ సూర్యనారాయణ,డాక్టర్ రవిశంకర్ నాయక్, డాక్టర్ అజీమ్, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ రాజేష్ గౌడ్,డాక్టర్ కోటేశ్వర్,డాక్టర్ వీణ, డాక్టర్ మోన,డాక్టర్ రాజు,డాక్టర్ భరత్వాజ్,డాక్టర్ అంబుజా, డాక్టర్ సురేష్, డాక్టర్ శంకర్, డాక్టర్ జయశ్రీ, డాక్టర్ సత్యశ్రీ, డాక్టర్ శైలజ, డాక్టర్ రవి కిరణ్,లైన్స్ క్లబ్ సభ్యులు విశ్వప్రసాద్, ప్రేమ్ కుమార్, చిగుళ్లపల్లి రమణ, బాలకృష్ణ, ఆసుపత్రి సిబ్బంది యాదగిరి,ఇతరులు పాల్గొన్నారు.


## ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి




**మొయినాబాద్, జూలై 1 (జనం సాక్షి) :** ఎత్మార్‌పల్లి గ్రామంలో ఇళ్లు నిర్మించుకునేందుకు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి కార్యాలయంలో వినతిపత్రం ద్వారా గ్రామస్తులు కోరారు. ఎత్మార్ పల్లి గ్రామంలో ఎస్సీ కాలనీకి ఆనుకోని ఉన్న సర్వే నెంబర్ 14/2లో 3.37 ఎకరాల భూమిలో అప్పట్లో అందులో 25 మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగింది. ఇళ్ల పట్టాలు పొందిన వారు ఇళ్లు నిర్మించుకోని ఉంటున్నారు. ఈ ఇళ్లకు ఆనుకొని ఉన్న ఇదే సర్వే నెంబర్‌లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటారని గ్రామస్తులు పేర్కొంటూ జిల్లా కలెక్టర్ ను వినతిపత్రం ద్వారా కోరారు. కలెక్టర్ ను కలిసిన వారిలో ఎత్మార్ పల్లి గ్రామ నాయకులు చింతకింది ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు గ్రామస్తులతో కలిసి ప్రవీణ్ రెడ్డి ప్రభుత్వ భూమిలో పట్టాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

● చికిత్స పొందుతూ భర్త మృతి
● మృతుని కుటుంబాన్ని పరామర్శించిన ప్రతాపరెడ్డి పురం రవి బిఆర్ఎస్ నాయకులు
● అశ్రునయనాలతో అంత్యక్రియలు





**తూప్రాన్, జూలై 1 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదంలో భార్య భర్తలు మృతి చెందగా చికిత్స పొందుతూ భర్త మృతి చెందిన ఘటన కూచారం గ్రామంలోచోటు చేసుకుంది. ఒకేసారి భార్యాభర్తలు చనిపోవడంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. తూప్రాన్ మండలం నాగులపల్లి శివారులో 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన దాసరి స్వప్న (28), రమేశ్( 32)దంపతులు మాసాయిపేట స్టేషన్ సమీపంలో యూటర్న్ తీసుకుంటుండగా కారు ఢీ ఢీకొనగా స్వప్న అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన రమేష్ ను గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. 24 గంటల్లో భార్యాభర్తలు మృతి చెందడంతో స్వయాన సోదరుడు గ్రామంలో విషయము నెలకొన్నాయి కూచారం గ్రామ టిఆర్ఎస్ అధ్యక్షులు దాసరి నరేష్ కు. స్వయాన సోదరుడు. సంఘటన జరిగిన విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి అంత్యక్రియలకు హాజరై సంతపం తెలిపారు మృతుల కుటుంబాలకు ధైర్యం చెప్పి ఉదాహర్తాడు ఆయనతోపాటు మండల నాయకులు పురం రవి వెంకటేష్ గౌడ్, అర్జున్, ఉదరంజన్ గౌడ్ బిఆర్ఎస్ ఇతర పార్టీల నాయకులు గ్రామస్తులు సమక్షంలో అశ్రునయనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

# జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

● తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు)



**చారకొండ, జూలై 1 (జనంసాక్షి) :** చారకొండ ఆశ వర్కర్స్ యూనియన్ మండల కమిటీ ఆధ్వర్యంలో చారకొండ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ మంజు భార్గవి గారికి జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈసందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ చారకొండ మండల అధ్యక్ష కార్యదర్శి వలియా,సత్యవతి,రాములమ్మ మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ఆశ వర్కర్లుగా గ్రామాలలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న చాలిచాలని వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్నాము ఆశా వర్కర్లకు స్థిర కనీస వేతనం నెలకు రూ.18,000/-లుగా నిర్ణయించాలి. 45వ, 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసుల ప్రకారం ఆశా వర్కర్లకు పెన్షన్ ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలను కల్పించాలి.ఆశా వర్కర్లను 3వ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.ఆశా వర్కర్లను శాశ్వత ఆరోగ్య కార్యక్రమం (పథకం)గా నిర్ణయించాలి. దేశవ్యాప్తంగా ఒకేవిధమైన పని పరిస్థితులు అమలులోకి తేవాలి. వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, 20 రోజుల క్యాజువల్ సెలవులు వేతనంతో కూడిన మెడికల్ సెలవులను నిర్ణయించాలి.రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ప్రకటించే వరకు పదవీ విరమణ ఉండరాదు. హెల్త్ డిపార్ట్మెంట్లో పని చేస్తున్నా ! మాకు నేటికి కూడా హెల్త్ కార్డులు ప్రభుత్వం ఇవ్వడంలేదు ప్రమాదలు జరిగినా పట్టించుకునే పరిస్థితి లేదు. ఉద్యోగ భద్రత లేదు.ఈఎస్ఐ,పీఎఫ్ ఇన్స్యూరెన్స్ సౌకర్యం లేదు.సెకండ్ ఎ న్ ఎం లుగా ప్రమోషన్ కల్పి చాలని కోరుతూ ఈనెల 9 న జరిగే దేశవ్యాప్తంగా %జ×ఖ% ఇతర కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపు నిచ్చాయి అందులో భాగంగా సార్వత్రిక సమ్మెలో మండలంలోని ఆశాలందరు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో విద్యారాణి,సరిత,సువర్ణ, రజిత,,సనా,ధనమ్మ ,సుజాత,జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
02 జూలై 2025

# ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు అన్ని శాఖలు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి

• జిల్లా కలెక్టర్ సంతోష్


**గద్వాల నడిగడ్డ, జూలై 1 (జనం సాక్షి) :** జిల్లాలో ప్రకృతి విపత్తులు సంభవించినపుడు వాటిని సమర్ధంగా ఎదుర్కొనేందుకు, అన్ని శాఖలు సమన్వయంతో ముందుస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ సమావేశం హాల్ నందు విపత్తు నిర్వహణ యాక్షన్ ప్లాన్ పై సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,విపత్తులు సంభవించిన తరువాత స్పందించేది కాకుండా, ముందుగానే జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గద్వాల జిల్లా రెండు నదులైన కృష్ణా, తుంగభద్ర నదులకు మధ్యలో ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత పది సంవత్సరాలలో ఎలాంటి విపత్తులు సంభవించినప్పటికీని, 2009 లో వరదలు వచ్చినప్పుడు పంట నష్టం జరిగింది తప్ప ఇతర సమస్యలు తలెత్తలేదని గుర్తు చేశారు. ఈసారి జిల్లాలో ముందస్తుగా జూన్ మాసం నుండి వర్షాలు కురుస్తున్నందున అధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. విపత్తులు రాకముందే ముందస్తు చర్యలలో భాగంగా జిల్లా స్థాయి మాదిరిగా అన్ని మండలు,గ్రామ స్థాయిలో కమిటీలను తహసిల్దార్ అధ్యక్షతన ఏర్పాట్లు చేసుకొని సమావేశాలను నిర్వహించుకోవాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ ను విపత్తుల జిల్లా నోడల్ అధికారిగా నియమించినట్టు తెలిపారు. తహసీల్దార్లు మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి, సమర్థవంతమైన బృందాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నీటిపారుదల,విద్య, వైద్య,రోడ్లు భవనాలు, పశుసంవర్ధకం, మత్స్యశాఖల అధికారులు తమ పరిధిలో చేపట్టాల్సిన పనులపై అవగాహన కల్పించారు.వచ్చే మూడు నెలలు అప్రమత్తంగా ఉండి ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించే విధంగా సిద్ధంగా




ఉండాలన్నారు. నది పరివాహక ప్రాంతాలలో ఉన్న గ్రామాలకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న గృహాలను,పాఠశాలలను ముందస్తుగానే గుర్తించాలని సూచించారు. అవసరమైతే వారిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. చెరువులు, కుంటల వద్ద ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారులు వారి పరిధిలోని రోడ్లను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన మరమత్తు పనులను చేపట్టాలని సూచించారు. నది పరివాహక ప్రాంతాలలో గర్భిణీ స్త్రీల కోసం అత్యవసర సేవల కోసం వాహనాలను ఏర్పాటు చేసి తరలించే విధంగా చూడాలని, అదేవిధంగా గ్రామాలలో ఫీవర్ సర్వే నిర్వహిస్తూ అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు.డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా ఆశాలు,ఏఎన్ఎంలు చురుకుగా సేవలందించాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపడుతూ రోడ్లపై మురికి నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడటం,నీటిలో మునిగిన విద్యుత్ స్తంభాలు,వేలాడే తీగల వల్ల ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. వరదల వల్ల ఎలాంటి నష్టం సంభవించకుండా మత్స్యకారులతో సమావేశాలు నిర్వహించి పడవలను,గజ ఈతగాళ్లను సిద్ధం చేసుకోవాలని సూచించారు.ప్రకృతి వైపరీత్యాల చట్టం ప్రకారం అన్ని శాఖల అధికారులు బాధ్యతతో పని చేయాలని, ప్రతి శాఖ అధికారులు వచ్చే రెండు నెలలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. గత అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు చర్యలతో విపత్తుల ప్రభావాన్ని తగ్గించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు మాట్లాడుతూ విపత్తు నిర్వహణ చట్టం-2005 ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని పేర్కొన్నారు.జిల్లాలో భూగోళికంగా ఎక్కడ ఎలాంటి పరిశ్రమలు లేవని, మారుతున్న వాతావరణానికి అనుకూలంగా వర్షాల వల్ల విపత్తులు సంభవించే అవకాశం ఉందఅన్నారు. భారీ వర్షాల వల్ల శిథిలావస్థలో ఉన్న గృహాలు కూలిపోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఇలాంటి సమయంలో తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంటుందని, ఇందుకు గాను జిల్లా మండల స్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెవెన్యూ, పోలీస్,ఇరిగేషన్,ఫైర్, ఎలక్ట్రిసిటీ అధికారులు 24/7 అప్రమత్తంగా ఉండాలన్నారు. భారీ వర్షాల వల్ల నేటి ప్రవాహం పెరిగినప్పుడు ప్రమాదాల నివారణకు మత్స్యకారులు గజ ఈతగాళ్ళు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఉత్తమ నైపుణ్యాలు కలిగిన యువ పోలీసు అధికారుల బృందాన్ని నియమించి పోలీసు శాఖ అన్ని విభాగాలతో సమన్వయంగా పనిచేస్తుందని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, నర్సింగ రావు,ఆర్డీఓ అలివేలు, సంబంధిత శాఖల అధికారులు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ జూనియర్ కళాశాలల గుర్తింపును రద్దు చేయాలి

• డిఐఈఓకు ఏఐఎస్ఎఫ్ వినతి



**సిద్దిపేట, జూలై 1 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలో ఇంటర్మీడియట్ బోర్డ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్ జూనియర్ కళాశాల గుర్తింపును తక్షణమే రద్దు చేయాలని కోరుతూ అదే విధంగా దీక్ష అకాడమీ అని పేరుతొ కళాశాలను అందులోనే రెసిడెన్షియల్ హాస్టల్ వసతి కల్పిస్తూ ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కళాశాల యాజమాన్యం పైన చర్యలు తీసుకోవాలనిఅఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రవీందర్ రెడ్డి నీసోమవారం రోజు జిల్లా కలెక్టర్ ఆఫీస్ లోని డీఐఈఓ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్న కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంల ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు ఏ విధంగా అనుమతులు ఇచ్చారని ఆ కళాశాలలకు ఏమాత్రం ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారులు సూచించినటువంటి నిబంధనలో కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా లేకుండా అనుమతులు ఇచ్చేశారని విద్య పేరుతో వ్యాపారం చేస్తున్నారు అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తూ ఎటువంటి అనుమతులు లేకుండా కళాశాలను నడుపుతూ వారు చేపిన ఫీజు కట్టాల్సిందే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. కొన్ని కళాశాలలు కమర్షియల్ బిల్డింగ్‌లో నడుపుతున్నారని, ఫైర్ సేఫ్టీ లేదు , ఫ్రీ ఎగ్జిట్ లేదని, ఏదైనా షార్ట్ సర్క్యూట్ జరిగితే ఫైర్ ఇంజన్ కూడా వెళ్లలేని పరిస్థితి ఉన్న ఇలాంటి కళాశాలలకు గుర్తింపును వెంటనే రద్దు చేయాలని రానున్న రోజుల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని డీఐఈఓను కోరారు. సానుకూలంగా స్పందించి వెంటనే తనిఖీలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నవీన్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు పని భారం తగ్గించాలి



**వీపనగండ్ల, జూలై 1 (జనం సాక్షి) :** తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు వీపనగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో జులై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ఆశ వర్కర్స్ పాల్గొంటున్నామని జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వంశీకృష్ణ మండల వైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్ లకు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ ఆశా వర్కర్ యూనియన్ జిల్లా నాయకురాలు లక్ష్మీ దేవమ్మ,, రేణక లు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి .ఆశ వర్కర్లను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు స్థిర కనీస వేతనం నెలకు 26,000గా నిర్వహించాలని డిమాండ్ చేశారు. 45వ మరియు 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫార్సుల ప్రకారం ఆశా వర్కర్లకు పెన్షన్, ఇతర సామాజిక భద్రత ప్రయోజనాలను కల్పించాలన్నారు. ఆశ వర్కర్లను మూడవ తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లను ఎన్ హెచ్ ఎం ని శాశ్వత ఆరోగ్య కార్యక్రమం గా నిర్ణయించాలన్నారు.దేశవ్యాప్తంగా ఒకే విధమైన పని పరిస్థితులు అమలులోకి తేవాలన్నారు. వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, 20 రోజుల క్యాజువల్ సెలవులు, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రిటర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ ప్రకటించే వరకు పదవి విరమణ ఉండరాదు అన్నారు. డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తూ ఉన్నామని ఈ సమ్మెలో కార్మికులు అందరూ కూడా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.సమ్మె నోటీస్ ఇచ్చిన వారిలో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం మండల నాయకురాలు లక్ష్మి, పార్వతి, వెంకటమ్మ వెంకటేశ్వరమ్మ, భాగ్యమ్మ, సునీత, శారద తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు రోగులకు చికిత్సతో పాటు ఆత్మవిశ్వాసాన్ని ఇవ్వాలి

• జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, జూలై 1 (జనంసాక్షి) :** వైద్యులు ఆసుపత్రికి వచ్చే రోగులకు చికిత్స చేయడమే కాకుండా, మంచి మాటలతో వారిలో మానసిక ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంపొందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు.జూలై 1వ తేదీ జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం నర్సింగాయపల్లి గ్రామ పరిధిలో ఉన్న ఎంసిహెచ్‌లో నిర్వహించిన వేడుకలకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని మెడికోస్ బ్లడ్ డొనేషన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన మెడికోస్ బ్లడ్ డొనేషన్ క్లబ్ నిర్వాహకులను కలెక్టర్ అభినందించారు. ముమ్ముందు రోజుల్లో కూడా క్లబ్ తరపున ఇలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టాలని వైద్య విద్యార్థులను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు ఆసుపత్రికి వచ్చే రోగులకు చికిత్స చేయడమే కాకుండా, మంచి మాటలతో వారిలో మానసిక ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంపొందించాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు చికిత్స చేయడంతో పాటు అసలు రోగాల బారిన పడకుండా వారి ఆరోగ్యం బాగుండేలా రెండు మూడు వైద్య సలహాలు కూడా ఇవ్వాలని చెప్పారు. ఇలా చొరవ తీసుకొని పనిచేసినప్పుడే మంచి సమాజాన్ని నిర్మించగలమని అన్నారు. సేవలో ముందుంటే పేరు ప్రతిష్టలు వాటి అంతటవే వస్తాయని చెప్పారు. ముఖ్యంగా వైద్య వృత్తిలో ఉన్నవారు ఎక్కడ ఉన్న ఆ స్థానిక భాషను నేర్చుకోవడం చాలా ముఖ్యమని, భాష నేర్చుకోవడం ద్వారా రోగులతో సులువుగా మాట్లాడగలరని వారి బాధలను అర్థం చేసుకోగలరని చెప్పారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ సమక్షంలో వైద్య విద్యార్థులు కేక్ కట్ చేశారు.అనంతరం కలెక్టర్ నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ భవనాన్ని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు.ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ కిరణ్మయి, జిజిహెచ్ సూపరింటెండెంట్ రంగారావు, ఇతర వైద్యాధికారులు, వైద్య విద్యార్థులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# గట్టు బ్లాక్ నీతి అయోగ్ ర్యాంకింగ్‌లో దేశంలోనే 5వ ర్యాంకు

• జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, జూలై 1 (జనం సాక్షి) :** నీతి ఆయోగ్ ర్యాంకింగ్‌లో దేశవ్యాప్తంగా టాప్ 5లో స్థానం దక్కించుకున్న గట్టు బ్లాక్‌లో కృషి చేసిన అధికారులను అభినందిస్తూ, భవిష్యత్తులో అగ్రస్థాన లక్ష్యంగా పెట్టుకుని మరింత ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అన్నారు. మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు గట్టు ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నీతి ఆయోగ్ విడుదల చేసిన 2024-25 క్యూ4 డెల్టా ర్యాంకింగ్‌లో గట్టు బ్లాక్ దేశంలో 5వ స్థానం,జోన్ 3లో 2వ స్థానాన్ని సాధించిందని తెలిపారు. ఈ విజయానికి గుర్తింపుగా గట్టు బ్లాక్‌కు నితి ఆయోగ్ నుంచి రూ.1 కోటి పురస్కారం దక్కిందని తెలిపారు.ఈ విజయం సాధించినందుకు గట్టు మండలంలోని అధికారులు, విభాగాధిపతులు, ఫ్రంట్ లైన్ సిబ్బందిని అభినందిస్తూ, భవిష్యత్తులో 100 శాతం కె.పి.ఐ లక్ష్య సాధన కోసం ఇదే అంకితభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఆరోగ్య శాఖ కు సహకరిస్తున్న ఎస్‌బిఐ సంజీవని, భవిష్య భారత్, టీచ్ ఫర్ చేంజ్, ఎం.వి. ఫౌండేషన్ వారిని అభినందించారు. ఆరోగ్యం,విద్య,వ్యవసాయం,మౌలిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి వంటి ఐదు కీలక రంగాలలో ఉన్న 39 పనితీరు సూచికలను సమర్థంగా నిర్వహిస్తూ, భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. ముఖ్యంగా మహిళలు, పిల్లల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ప్రస్తుతం గట్టు బ్లాక్ కంపోజిట్ స్కోర్ 69.43గా ఉండగా,దీన్ని మరింత మెరుగుపరచి 100 శాతం లక్ష్య సాధనవైపు ముందుకు సాగేందుకు అధికారులు కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,డిపిఒ నాగేంద్రం, జిల్లా వైద్య అధికారి సిద్ధప్ప,జిల్లా సంక్షేమ అధికారి సునంద, ఎంపిడిఓ చెన్నయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ సంధ్య రాణి,ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ అప్జల్,తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపేట జిల్లా సమగ్ర అభివృద్ధికి పోరు


• సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.సంతోష్



**మద్దూరు, జూలై 1 (జనం సాక్షి) :** కొత్తగా ఏర్పడిన నారాయణపేట జిల్లా సమగ్ర అభివృద్ధికై పోరుకు సిద్ధమవుతామని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.సంతోష్ అన్నారు. మద్దూరు మండల పరిధిలోని పల్లెర్ల గ్రామంలో జరుగుతున్న భారత కమ్యూనిష్టు పార్టీ సిపిఐ మద్దూరు మండల ఆరో మహాసభలు పలు రకాల తీర్మానాలతో ముగిసాయి. ముగింపు సభలో యస్.సంతోష్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లా రాష్ట్రానికి చివరి బార్డర్‌లో అభివృద్ధికి నోచుకోకుండా విద్యా వైద్యం ఉపాధి రంగాలలో వెనుక పడటమే కాకుండా, సాంఘిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక రంగాల్లో కూడా తీవ్రమైన నిర్లక్ష్యం జరిగిందని అన్నారు. జిల్లా పరిధిలో పుష్కలమైన సహజ వనరులు, సారవంతమైన భూములు ఉన్నాకూడా గత పాలకుల నిర్లక్ష్యం వల్ల ఫలాలు అందని ద్రాక్షల్లాగా మారాయని అన్నారు. జయమ్మ చెరువు ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని, పారిశ్రామిక కారిడార్ గా ప్రకటించి యువతకు ఉపాధి కల్పించాలని, గ్రామాలకు రోడ్డు మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ మద్దూరు మండల మహాసభలో సిపిఐ ఉమ్మడి జిల్లా నేత పి సురేష్ సమక్షంలో సిపిఐ మద్దూరు మండల నూతన కార్యదర్శిగా వెంకటేష్(నంధిపాడు), సహాయ కార్యదర్శులుగా హన్మంతు (అప్పిరెడ్డి పల్లి), వెంకటయ్య(లక్కయ పల్లి), సమితి సభ్యులుగా అంజలప్ప, గణేష్, నర్సింలు, ఆశప్ప, శ్రీశైలం, కాశప్ప, చెన్నయ్య, అమృతమ్మ లతో పాటు మరో ఇద్దరిని కో ఆప్షన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# రేగోడ్‌లో జోరుగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

• మండలంలో 436 ఇండ్లు మంజూరు
• మంత్రి దామోదర ఆదేశాలతో జోరుగా కొనసాగుతున్న పనులు



**రేగోడు, జూలై 1 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అర్హులైన నిరుపేదలకు సొంతింటి కల సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రేగోడు మండలానికి 436 ఇండ్లు మంజూరయ్యాయి. 436ఇందిరమ్మ ఇండ్లకు కలెక్టర్ నుంచి ప్రొసీడింగ్ వచ్చాయి. నమూనా కొరకు మండల కేంద్రమైన మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ ఇంటి నమూనా నిర్మాణాన్ని చేపట్టారు. ఆ నమూనా ఇంటి ఆధారంగా ఆయా గ్రామాలలో ఇళ్లకు మార్కింగ్ (ముగ్గులు) పోసి పనులు ప్రారంభించారు. 45నుంచి60 గజాలు మించకుండా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేపట్టేలా అధికారులు లబ్ధిదారులకు ఆదేశాలు ఇచ్చారు.ఇండ్ల నిర్మాణానికి పోసిన ముగ్గులు ఫోటో తీసి మొబైల్ యాప్ లో జియో ట్యాగింగ్ చేస్తున్నారు. బేస్మెంటు నిర్మాణం అనంతరం మొబైల్ యాప్ లో బేస్మెంట్ ఫోటోతో జియో టాకింగ్ చేసి మొదటి బిల్లు కోసం ఆన్లైన్లో ఎంట్రీ చేసి లబ్ధిదారుల ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు నమోదు చేస్తున్నారు. తద్వారా ఇందిరమ్మ మొదటి బిల్లును ప్రభుత్వం చెల్లిస్తుంది.

మంత్రి ఆదేశాలతో జోరుగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతో మండలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు జోరుగా కొనసాగుతున్నాయి. నిర్మాణంలో భాగంగా బీస్మెంటు వరకు నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు మొదటి విడతగా లక్ష రూపాయలు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు జమ చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. గ్రామాల్లో నిర్మాణం చేపట్టే ఇందిరమ్మ ఇళ్లను ఎప్పటికప్పుడు ఆయా గ్రామాల కార్యదర్శులు మొబైల్ యాప్‌లో జియో ట్యాగింగ్ చేస్తున్నారు. ఇందిరమ్మ ఇల్లు పూర్తిస్థాయిలో నిర్మాణం చేపట్టిన ప్రతి లబ్ధిదారునికి జియో టాకింగ్ చేస్తే రూపాయలు ఐదు లక్షల వరకు వస్తాయని అధికారులు తెలుపుతున్నారు.

## రాష్ట్ర విద్యాశాఖకు తక్షణమే మంత్రిని నియమించాలి

• ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగన మోని బంగారు బాబు



**నాగర్‌కర్నూల్ ఆర్సీ, జూలై 1 (జనంసాక్షి) :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాగర్ కర్నూల్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖకు మంత్రిని నియమించాలని మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంగన మోని బంగారు బాబు మాట్లాడుతూ, ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావస్తున్న విద్యాశాఖకు మంత్రి లేడు విద్య సంస్థల ప్రారంభమైనప్పటికీ విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం దారుణం అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నగర సోషల్ మీడియా కన్వీనర్ ప్రసాద్ కుమార్, కళాశాల ప్రెసిడెంట్ శివ, శ్రీకాంత్, ఏబీవీపీ నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలు

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి జులై 01 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి విద్యార్థుల కొరకు అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కన్నెపల్లి మండలం చెర్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదిని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రతి పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహారీగోడ, వంటశాల ఇతర అన్ని మౌళిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. స్థానిక ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తుందని, పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు, వంటశాల, తరగతి గదులను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారాన్ని అందించాలని, ఆహారం తయారీ సమయంలో నిబంధనలు పాటించాలని, తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. 10వ తరగతి విద్యార్థుల పఠనా సామర్థ్యాలను పరిశీలించి సబ్జెక్టుకు సంబంధిత ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకోవడంతో పాటు వారికి అందుతున్న మధ్యాహ్న భోజనం, ఇతర వివరాలు తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలని, లబ్దిదారులకు నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని తెలిపారు. నిర్మాణ స్థాయికి అనుగుణంగా బిల్లులు చెల్లించడం జరుగుతుందని, బేస్మెంట్ స్థాయి వరకు పూర్తి అయిన బిల్లులు సంబంధిత లబ్దిదారుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలు, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అధికారులకు పలు సూచనాలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకంలో అందిస్తున్న త్రాగునీరు సరిగా రావడం లేదని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా నీటిని పరిశీలించి వెంటనే సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి వెంటనే నీటిని పరీక్షించి ప్రజలకు శుద్ధమైన త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్భంగా నూతనంగా నిర్మించబడిన మూత్రశాలలను వినియోగించాలని, వర్షాకాలం కావడంతో పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని, బడి బయట పిల్లలు, మధ్య బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల ఎత్తు, బరువు, కొలతలు స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని, శారీరక, మానసిక ఎదుగుదల లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారికి సకాలంలో ఆహారం, అవసరమైన మందులు అందించి సాధారణ స్థితికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం టేకులపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని, లబ్దిదారులు చేపట్టిన నిర్మాణ దశలకు అనుగుణంగా బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని, ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తలను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని తెలిపారు. అంతకు ముందు బెల్లంపల్లి మండలం చెర్లపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కన్నెపల్లి మండల తహశిల్దార్ శ్రావణ కుమార్, ఎ.పి.ఓ., సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కళాశాలలల్లో విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించాలి

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాల పల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలల్లో విద్యార్థులకు కనీస మౌలిక సదుపాయాల కల్పనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ చాంబర్ లో ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల సౌకర్యార్థం కనీస మౌలిక సదుపాయాలు కల్పనపై విద్యా, టిజిడబ్ల్యూఐడిసి ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లో కనీస సౌకర్యాల కల్పనకు జిల్లాలోని 5 జూనియర్ కళాశాలలకు 41.07 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు అందచేయాలని ప్రిన్సిపాల్స్ ను ఆదేశించారు. నిధులతో సివిల్ మరమ్మతులు, ఎలక్ట్రికల్, మంచినీరు, పారిశుధ్య కార్యక్రమాల వంటి సదుపాయాలపై ఫోకస్ చేయాలని, ఇట్టి పనులను ప్రాధాన్యత ప్రాతిపదికన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకన్న, డీఈఓ రాజేందర్, టీజడబ్ల్యూఐడిసి డిఈ రామకృష్ణ, ఏఈ మహేందర్, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



## సమాజ హితం కోరేవారు వైద్యులు

- జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ ప్రతినిధి, జులై 01(జనంసాక్షి):** సమాజ హితం కోరే వైద్యులను గౌరవించడం ధర్మమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం డాక్టర్స్ డే పురస్కరించుకొని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జనగామ బ్రాంచ్ ఆధ్వర్యంలో డాక్టర్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించిన రక్తదాన శిబిరంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... త్యాగానికి ప్రతీక లని రక్త దాన శిబిరం ఏర్పాటు చేసిన ఐఎంఏ, కెమిస్ట్ లను అభినందించారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో ఐఎంఎ సహకరించాలని కోరారు. రక్తదాతలకు కలెక్టర్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. తొలుత స్వాగతం తెలిపిన సీనియర్ డాక్టర్ డి లవకుమార్ రెడ్డి డాక్టర్ బి సి రాయ్ గురించి ప్రస్తావిస్తూ డాక్టర్స్ డే విశిష్టతను గురించి వివరించారు. జిల్లా వైద్యాధికారి డా. మల్లికార్జున్ రావు మాట్లాడుతూ ఐఎంఏ వైద్యుల సహనశీలత సౌజన్య గుణాలను అభినందించారు. ప్రభుత్వ కార్యక్రమాలను సఫలం చేయడంలో వైద్యులు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా శిబిరంలో 56 మంది రక్తదానం చేసినట్లు రక్త నిధి వైద్యాధికారి డాక్టర్ పి. కరుణాకర్ రాజు తెలిపారు. ప్రభుత్వ వైద్యశాల చీఫ్ పాథాలజిస్ట్ డా అన్వర్, డాక్టర్ ఏ. శ్రీనివాస్, పుర ప్రముఖులు కన్న పరశు రాములు, డాక్టర్ కల్నల్ మాచర్ల బిక్షపతి, క్రిష్ణ జీవన్ బజాజ్, కెమిస్ట్ అసోసియేషన్ దేవరాజ్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్. రాజమౌళి, కెమిస్ట్ కార్యదర్శి క్రిష్ణ, దోర్నాల వెంకటేశ్వర్లు, డాక్టర్లు కనకరాజు, వెంకటాచలం, ప్రదీప్, సృజన్, స్వప్నా రాథోడ్, రజినీ, మౌనిక, అనూష, ప్రీతీ దయాళ్, స్వప్న ఐ ఎం ఏ కార్యదర్శి డా. ఏ. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## విపత్తుల సందర్భంగా సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలి

- ప్రజలకు ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించాలి
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, జులై 01(జనంసాక్షి) :** విపత్తుల నేపథ్యంలో ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా సహాయక చర్యలు చేపట్టుటకు సిద్ధంగా ఉండాలనీ, గోదావరినది, జంపన్న వాగు పరిసర ప్రాంతాల ప్రజలకు ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జాతీయ విపత్తు ప్రతిస్పందన బృందం (ఎన్డీఆర్ఎఫ్) ను కోరారు. మంగళవారం జాతీయ విపత్తు ప్రతిస్పందన బృందం (ఎన్డీఆర్ఎఫ్) జిల్లా కు విచ్చేసిన సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తన ఛాంబర్లో అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలోని రామప్ప, లక్నవరం సరస్సులు, గోదావరి నది, జంపన్నవాగు నీటి ప్రవాహం గతంలో జరిగిన సంఘటనల గురించి (ఎన్డీఆర్ఎఫ్) బృందం నకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10వ బెటాలియన్, విజయవాడ కమాండెంట్ ప్రసన్న కుమార్ ఆదేశాల ప్రకారం ఆర్ ఆర్ సి హైదరాబాద్ నుండి ఇన్స్పెక్టర్ ముకేష్ కుమార్ కమాండర్, ఏ ఎస్ ఐ సుధీర్, హెడ్ కానిస్టేబుల్ జగదీష్ తో 28 మంది ఒక టీం జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మూడు మాసం ల వర్ష కాలం ముగిసే వరకు జిల్లా లో ఉంటుందని అన్నారు. గోదావరి నది, జంపన్న వాగు పరిసర ప్రాంతాలు ఊరటం, నార్లాపూర్, మేడారం నీటి ప్రవాహ ప్రాంతాలను పరిశీలించి, అకాల వర్షం, విపత్తుల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎన్డీఆర్ఎఫ్ బృందం ను కోరారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం నకు కావలసిన అన్ని ఏర్పాట్లను సమకూర్చాల్సిందిగా జిల్లా పంచాయతీ అధికారి కి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి దేవ రాజ్, కలెక్టరేట్ డి సెక్షన్ పర్యవేక్షకులు శివకుమార్, ఎన్డీఆర్ఎఫ్ బృందం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, జూలై 1 (జనం సాక్షి):** వ్యవసాయంలో డ్రోన్ల వినియోగానికి సంఘాలను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ చాంబర్లో రైతు ఉత్పత్తి సంఘాలకు, మహిళా స్వయం సహాయక సంఘాలకు, సహకార సంఘాలకు డ్రోన్స్ పంపిణీపై వ్యవసాయ, ఉద్యాన, సహకార, డిఆర్డీఓ, నాబార్డ్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్. మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహించేందుకు డ్రోన్ల వినియోగంపై చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో పంపిణీ చేసేందుకు 12 డ్రోన్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని మండలాల వారీగా ఒక్కో మండలానికి ఒక డ్రోన్ చొప్పున పంపిణీ చేయాలని తెలిపారు. ఇందుకోసం విజయవంతంగా నడుస్తున్న రైతు ఉత్పత్తి సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, సహకార సంఘాల నుండి సభ్యులను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఈ మూడు కేటగిరీల సంఘాలను ప్రామాణికంగా తీసుకుని మండలానికి ఒకటి చొప్పున అన్ని మండలాలు కవరు అయ్యేలా డ్రోన్లు పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, వ్యవసాయ శాఖ ఏడీఏ బాబు, ఉద్యాన వనశాఖాధికారి సునీల్ కుమార్, డిఆర్డీఓ బాలకృష్ణ, డీసీఓ వాల్య నాయక్, నాబార్డు ఈజిఎం చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి

- విధి నిర్వహణ లో వారి బాధ్యతనే వారికి గుర్తింపు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ ప్రతినిధి, జులై 01(జనంసాక్షి) :** ఉద్యోగంలో బాధ్యతాయుతంగా పని చేసినప్పుడు జీవితంలో ఎంతో సంతృప్తి మిగులుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. కలెక్టరేట్ ఏవో మన్సూర్, డిటిఓ నరసింహారెడ్డి , వాచ్మెన్ సోమయ్య పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ లు పింకేష్ కుమార్, రోహిత్ సింగ్ లతో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఉద్యోగ విరమణ అనేది ప్రతి ఒక్కరికీ ఒక కీలకమైన మలుపు అని.. ఉద్యోగ జీవితం ఒక మధురానుభూతి అని అన్నారు. ఇన్నిరోజులు సేవలను అందించి ఈరోజుతో వీరి సేవలు ముగియడం బాధాకరమైన సందర్భం అయినప్పటికీ... విధి నిర్వహణలో ఉండే ఎన్నో బాధ్యతలు, ఒత్తిడి వల్ల ఉద్యోగులకు కుటుంబ సభ్యులతో గడపడం వీలు ఉండదని , ఇక ఈ పదవీ విరమణ తరువాత ఆనందం గా కుటుంబ సభ్యులతో గడపాలని కోరుతున్నానని తెలిపారు. బాధ్యతయుతం గా పని చేసిన ఉద్యోగులను ఎప్పటికి మర్చిపోలేమని.. వారి పట్ల గౌరవం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఏవో, డీటీవో, వాచ్మెన్ పని తీరు, వ్యవహార శైలి గురించి కలెక్టర్ వివరిస్తూ వారిని కొనియాడారు. ఈ కార్యక్రమం లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు, ఆర్డీఓ లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## ‘ఆపరేషన్ ముస్కాన్-11’ను విజయవంతం చేయాలి

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమాన్ని సంబంధిత శాఖ అధికారులు విజయవంతం చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమంలో భాగంగా మంగళవారం వివిధ శాఖల అధికారులతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సంబంధిత పోస్టర్ ఆవిష్కరించి, సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లలను గుర్తించి, వారిని రక్షించి, పునరావాసం కల్పించి, సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో ఉండాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా పని ప్రదేశంలో ఉన్న పిల్లలను పోలీసు బృందాలు, వివిధ శాఖల సమన్వయంతో దాడులు నిర్వహించి, పిల్లలను పనిలో పెట్టుకునే యజమానులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక బృందాలను నియమించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక బృందాలు పట్టుబడిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించాలని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ అందించి, అనాథలుగా ఉంటే వారిని కేర్హోమ్కు తరలించే ప్రక్రియపై దృష్టి పెట్టాలని అన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే వెంటనే 100 లేదా 1098కు డయల్ చేయాలని, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. ఆపరేషన్ ముస్కాన్ ప్రతి ఏటా జూలై 1 నుంచి 31వరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యేక తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించడం జరుగుతుందన్నారు. ఆపరేషన్ ముస్కాన్-10లో భాగంగా గతేడాది 24 మంది పిల్లలకు వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించి వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏ నరేష్ కుమార్, డిడబ్ల్యుఓ మల్లీశ్వరి, సిడబ్ల్యుసి వెల్ఫేర్ కమిటీ మెంబర్ దామోదర్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వినోద, డిసిసిబి, సిసిఎస్ ఇన్స్పెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు, ఎన్జీవో ఆర్గనైజేషన్లు, రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావును కలిసిన బిజెపి నాయకులు



**నిర్మల్ బ్యూరో,జూలై 1(జనం సాక్షి) :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ నూతన అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.రామ్ చందర్ రావును బిజెపి శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి,పైడి రాకేష్ రెడ్డి,ధన్పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీలు మల్కా కొమురయ్య, అంజిరెడ్డి లు మంగళవారం హైదరాబాద్ కలిశారు.ఈ సందర్భంగా రామచంద ర్ రావు ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



## అన్నదాతకు బాసర ఆర్జీయూకేటీ ఇబ్బందులు

- రైతన్నలు వెళ్లే మార్గంలో మురికి కాలువల చెత్త చెదారం...

బాసర, జూలై 01 (జనం సాక్షి) నిర్మల్ జిల్లా బాసర మండలంలోని రైతన్నలకు బాసర ఆర్జీయూకేటీ వల్ల ఇబ్బందులు తప్పడంలేదని రైతులు వాపోతున్నారు. వివరాల్లోకెళ్తే బాసర లోని ఆర్జీయూకేటీ విద్యాసంస్థకు ఆనుకొని రైతులు పొలం పనులకు వెళ్లడానికి ఉన్న మార్గంలో ట్రిబుల్ ఐటీ కళాశాలలోని మురికి కాలువలో దుర్వాసనతో కూడియున్న చెత్తాచెదారాన్ని విచ్చలవిడిగా రోడ్డు పై వేయడంతో ఆ మార్గంలో వెళ్లే రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనివల్ల రైతులు తమ పొలంలో పనిచేయాలన్న దుర్గంధంతో రోగాల బారిన కూడా పడుతున్నారని రైతులు బాధని వ్యక్తం చేస్తున్నారు. అందులో ఇప్పుడు వర్షాకాలం ఉండడంతో వ్యాధులు ప్రబలించే అవకాశం ఎక్కువగా ఉందని అంటున్నారు. కళాశాల యాజమాన్యం ఇలా విచ్చలవిడిగా చెత్తాచెదారాన్ని రోడ్డు విరువైపులా వేయడం ఎంతవరకు సమంజసం అని హలంపట్టి రైతులకు కలం పట్టే విద్యావంతులు ఈ విధంగా చేయడం ఎంతవరకు న్యాయమని అంటున్నారు. రైతులు తమ పొలాన్ని జీవనాధారంగా నమ్ముకుంటే గ్రామంలో లేని చెత్తచెదారం రైతు వెళ్లి మార్గంలో వేయడం విచిత్రంగా ఉందని అంటున్నారు. ఇప్పటికి నా సంబంధిత అధికారులు ట్రిబుల్ ఐటీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని రైతులకు సహకరించాలని కోరుతున్నారు.

# నేటి నుంచి జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్

- నెలరోజుల పాటు 30 పోలీస్ ఆక్ట్ అమలు
- ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** నేటి నుంచి జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభం అవుతుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం. స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరం లో జిల్లాలోని అన్ని పోలీసు కార్యాలయాలు అధికారులు సిబ్బంది సమక్షంలో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది గ్రామాలలో సందర్శిస్తూ పోలీసు మీకోసం కార్యక్రమాల నిర్వహిస్తూ గ్రామీణ స్థాయి ప్రజలకు మరింత సత్సంబంధాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. రానున్న పంచాయతీ ఎలక్షన్లకు పకడ్బందీగా ఏర్పాట్లు నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండటానికి గ్రామస్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకున్న నిమిషాల వ్యవధిలో పోలీసులకు సమాచారం అందేలా ఉండాలన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా చూడాలన్నారు. జిల్లాలోని ప్రతి ఒక్క గ్రామానికి విలేజ్ పోలీసు ఆఫీసర్ ను కేటాయించి ఆ గ్రామాలలో పోలీసు అధికారుల పేర్లు గోడలపై రాయించాలన్నారు. సమాధానం ముఖ్యమైన సంఘటనలు చోటు చేసుకున్నప్పుడు స్టేషన్ హౌస్ అధికారి సంఘటనా స్థలాన్ని పరిశీలించి సరైన దర్యాప్తు కేటాయించాలని దీనివల్ల పోలీసులపై ప్రజలకు నమ్మకం ఏర్పడుతుందని తెలిపారు. ఈరోజు నుండి ఆరు నెలల పాటు ఆపరేషన్ ముస్కాన్ ప్రారంభమవుతుందని జిల్లాలో ఇద్దరు సీఐలు పద్మ అంజమ్మ ఆధ్వర్యంలో రెండు బృందాలు ఆదిలాబాద్ మరియు ఉట్నూర్లలో బాల కార్మికుల నిర్మూలన పై కార్యక్రమాలు నిర్వహిస్తుందని, దుర్మార్గంగా వ్యవహరిస్తూ బాలల చేత వెట్టిచాకిరి చేపిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా డయల్ 100 సేవలపై పోలీసు మీకోసం కార్యక్రమాలు నిర్వహిస్తూ అవగాహన కల్పించాలని జిల్లా పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ తమ సహాయ సహకారాలు అందిస్తుందని హామీగా తెలియజేయాలన్నారు. మంగళవారం నుండి నెలరోజుల పాటు జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని అనుమతులు లేకుండా ఇలాంటి సభలు ర్యాలీలు నిర్వహించకూడదని తెలిపారు. గుంపులు, గుంపులుగా ప్రజలు తిరగడానికి అనుమతులు లేవని, మారణాయుధాలు కథలు లాంటి వాటికి అనుమతులు లేవని తెలిపారు. ముందస్తు అనుమతులు లేకుండా ఇలాంటి సభలు సమావేశాలు నిర్వహించకూడదని తెలిపారు. పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ పద్ధతి ప్రకారం యూనిఫామ్ ధరించి విధులు నిర్వహించాలని సూచించారు.నేరాల నియంత్రణకై ప్రత్యేకంగా రాత్రి సమయాలలో గా, పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండాలని, రాత్రి సమయాలలో ఫింగర్ ప్రింట్ పరికరం ద్వారా అనుమానితులను పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు. ప్రమాదాల నివారణకి రాత్రి సమయాలలో సాయంత్రం సమయాలలో ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. జిల్లాలో పూర్తిస్థాయిలో అసాంఘిక కార్యక్రమాలను రూపుమాపే దిశగా జిల్లా పోలీసు వ్యవస్థ పటిష్ట మైన చర్యలు చేపడితూ, నేరస్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. మాదక ద్రవ్యాలను, గంజాయి లాంటి వాటిని జిల్లాలు రూపుమాపే దిశగా గట్టి చర్యలు చేపట్టాలని గంజాయి అమ్మేవారిని తాగే వారిని పండించే వారి పట్ల పోలీసు కేసులు నమోదు చేయాలని సూచించారు. ఓపెన్ డ్రింకింగ్, న్యూసెన్స్ లలో, రాత్రి సమయాలలో రోడ్లపై పుట్టినరోజు వేడుకలు చేసేవారిపట్ల ఈ పెట్టి కేసులు నిర్వహిస్తూ ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. నకిలీ విత్తనాలు ఎరువులు లేకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు.

# నెలికల్ ఎత్తిపోతల పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలి

- నల్గొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి



**తిరుమలగిరి (సాగర్), జూలై 1 (జనంసాక్షి) :** నెల్లికల్ ఎత్తిపోతల పథకం పనులను త్వరగా పూర్తిచేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె తిరుమలగిరి సాగర్ మండలంలోని నెల్లికల్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులతో రాబోయేది వర్షాకాలం కావున, త్వరితగతిన ఎత్తిపోతల పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వర్కర్ల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకొని పనులు నిర్వహించాలని తెలిపారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలో 11 గ్రామాలలో 24, 624 ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట అడిషనల్ కలెక్టర్ అమిత్ నారాయణ, ప్రాజెక్టు డిప్యూటీ ఇంజనీర్ సీతారాం, అసిస్టెంట్ ఇంజనీర్ రవి, పెద్దవూర తహసిల్దార్ శ్రీనివాస్, ఏజెన్సీ నాయకులు తదితరులు ఉన్నారు.

# భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- బీజేపీ పార్టీపై షబ్బీర్ అలీ ఫైర్
- ఖర్గే సభ కోసం కార్యకర్తలకు సైరన్

**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూలై 01 (జనం సాక్షి) :** భారత రాజ్యాంగాన్ని కలిసి కట్టుగా ఉండి కాపాడుకుందామని, దాని కోసం కాంగ్రెస్ కార్యకర్తలైన సైనికులకు యుద్ధానికి సిద్ధం చేయడానికి విచ్చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభను విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పేర్కొన్నారు. నిజామాబాద్ పట్టణంలోని ఈవీఎం ఫంక్షన్ హాల్‌లో జరిగిన నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కర్ లతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జై బాపూ జై భీమ్ జై సంవిదాన్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా బలంగా ముందుకు తీసుకెళ్దామని, మన రాజ్యాంగాన్ని మనం కాపాడుకుందామని అన్నారు. ఇది గాంధీ కుటుంబానికి ఆర్.ఎస్.ఎస్. కుటుంబమైన మోదీకి మధ్య జరుగుతున్న సిద్ధాంతాల సమరమని పేర్కొన్నారు. మాది అందరినీ ఏకం చేసి ప్రేమను పంచే నినాదం కాగా వారిది రెచ్చగొట్టి విడదీసి విద్వేషాన్ని పెంచే నినాదమని షబ్బీర్ అలీ అన్నారు. మల్లికార్జున ఖర్గే సభను కాంగ్రెస్ శ్రేణులు విజయవంతం చేయాలని ఆయన



పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలో లేని ప్రాంతాలను చిన్నచూపు చూడటం దురదృష్టకరమని షబ్బీర్ అలీ వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుంటే ఈ పథకం మాదే అని బీజేపీ చెబుతోందని, మరి బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సన్న బియ్యం ఎందుకు పంపిణీ చేయడం లేదో సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు ప్రభుత్వాలను పడగొట్టే ఆలోచన తప్ప, అభివృద్ధి చేయడం బీజేపీ లక్ష్యం కాదన్నారు. చార్ సౌ పార్ అన్న బీజేపీ పరిస్థితి నేడు పొత్తులతో ప్రభుత్వాన్ని నడిపే స్థాయికి దిగజారిందన్నారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పటికీ పేదలకు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాలను అమలు చేస్తున్నారని, తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో జమ చేసి రైతులను ఆదుకున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున మంజూరయ్యాయని పేర్కొన్నారు. 500 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అదేవిధంగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులను సకాలంలో అందజేస్తున్నామని షబ్బీర్ అలీ తెలియజేశారు. ఈ కార్యక్రమాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లి సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ స్థానిక ఎన్నికల్లో అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందే విధంగా కృషి చేయాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, లోక భూపతి రెడ్డి, తోట లక్ష్మీ కాంతారావు, మదన్ మోహన్ రావు, వెద్మ బొజ్జు, సంజయ్ రావు, బల్మూరి వెంకట్, జీవన్ రెడ్డి, ఈరవత్రి అనిల్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఇన్‌చార్జులు, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణ కలిగిన విద్య సన్మార్గంలో నడిపిస్తుంది

- సిఆర్పిఎఫ్ డిఐజిపి డాక్టర్ వీర్రాజు

**జవహర్‌నగర్, జూలై 1 (జనంసాక్షి) :** మున్సిపల్ కార్పొరేషన్ స్థానిక సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ పాఠశాలలో నిర్వహించిన పాఠశాల ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ డి అపర్ణ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా గ్రూప్ సెంటర్ డిఐజిపి డాక్టర్ వీర్రాజు విచ్చేసి విద్యార్థులకు విద్యాబుద్ధులతో పాటు క్రమశిక్షణ కలిగిన విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తమ పాఠశాల అన్ని విధాల క్రమశిక్షణ క్రీడా శిక్షణ చదువులో కూడా ఉత్తమ ప్రతిభను కనబరిచే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గ నిర్దేశాలు చూపిస్తున్నారని తమ పాఠశాల 1996లో ప్రారంభమై నేడు అంచలంచలుగా ఎదిగి ఎంతోమంది విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపిందని ఈ పాఠశాలలో చదివిన మేధావులు దేశానికి ఎంతో ఉపయోగంగా ఉన్నారని తెలియజేశారు, పాఠశాలలో నిర్వహించిన ఫుడ్ ఫెస్ట్ డిఐజిపి రిబ్బన్ కటింగ్ తో ఓపెన్ చేసి విద్యార్థులు ఉన్నటువంటి స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని తెలియజేశారు, పాఠశాల నేటికీ 29 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఎంతోమంది జీవితాలలో వెలుగులు నింపిందని కొనియాడారు, విద్యార్థులను క్రమశిక్షణలో పెంచడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో విలువైనదని అటువంటి ఉపాధ్యాయులకు ఎన్నటికీ రుణపడి ఉండాలని తెలియజేశారు, విద్యార్థులు చేసినటువంటి



సాంస్కృతి కార్యక్రమాలు ఆహుతులను ఆకర్షించాయి, ఈ కార్యక్రమంలో ఒలంపియాడ్స్ లో బహుమతులు సాధించిన 106 మంది విద్యార్థులకు మెడల్స్ మరియు ప్రశంస పత్రాలు అందజేశారు, జాతీయస్థాయిలో త్రోబాల్ అథ్లెటిక్స్ లో విజేతలైన విద్యార్థులకు మెడల్స్ ప్రశంస పత్రాలు అందజేశారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ డి అపర్ణ, వైస్ ప్రిన్సిపల్ హరిశంకర్,హెడ్ మిసెస్ ఆశాజి కుమార్, సిఆర్పిఎఫ్ కమాండెంట్ ఉపాధ్యాయ, సీనియర్ ఉపాధ్యాయులు సి సి ఏ కమిటీ సబీనా, నవనీత రాణి, వెంకట్ రాజు గోపాలకృష్ణ, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రాజశేఖర్, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 9న జరిగే దేశవ్యాప్త కార్మిక, రైతాంగ సమ్మెను జయప్రదం చేయండి

**గద్వాల నడిగడ్డ, జూలై 1 (జనం సాక్షి) :** ఈ నెల 9న దేశవ్యాప్తంగా కార్మిక రైతాంగ కలిసి చేస్తున్న సమయం జయప్రదం చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా మండల వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య ,తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ శంకర ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను తీసివేసి 4 కోడ్లుగా మార్చి కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదనీ, కార్మికులతో ఎక్కువ గంటలు పనిచేయించి వారి శ్రమను దోపిడి చేసి పెట్టుబడి దారులకు దోచిపెడుతున్నదనీ, కేంద్ర ప్రభుత్వం దేశ రైతాంగానికి పంటలకు గిట్టుబాటు ధరలను పదుల సంఖ్యలో పెంచి రైతాంగానికి గొప్పలు చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నదనీ, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ వేల సంఖ్యలో పెంచి రైతాంగానికి తీవ్రమైన అన్యాయం చేస్తున్నదనీ ,కార్మిక చట్టాలను పునరుద్ధరించి, రైతాంగానికి అన్ని పంటల ధరలను ఎమ్మెస్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని, వెంటనే 4 కోడ్ లను రద్దుచేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు, రైతులు, విద్యార్థులు మేధావులు ప్రజలు అందరూ కలిసి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామని వారన్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో జూరాల ప్రాజెక్టు ఆయకట్టు కింద అన్ని



ఎత్తిపోతల పథకాలకు చెరువులు కుంటలు తదితర వాటికి నింపాలనీ,ముఖ్యంగా జోగులాంబ గద్వాల జిల్లాలో నెట్టెంపాడు, ర్యాలంపాడు, ముచ్చోనిపల్లి, తాటికుంట,నాగర్ దొడ్డి, సంగాల, గుడి దొడ్డి తదితర ఎత్తి పోతల పథకాలను, చెరువులు, కుంటలను నీరును నింపిన తర్వాతనే మిగిలిన నీరును కిందికి వదలాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్,శంకర్ రెడ్డి,వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం

- తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్

**చౌటుప్పల్, జూలై 1 (జనం సాక్షి) :** ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ఆసుపత్రుల ప్రధాన లక్ష్యమై ఉండాలని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ అన్నారు. మంగళవారం ఆయన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను సమీక్షించారు. ఈ సందర్భంగా మెడికల్, క్యాజువాలిటీ, ఐసీయూ, మెడికల్ కేర్, జనరల్ సర్జికల్ వార్డు, మెడికల్ స్టోర్, డయాలసిస్, ఎక్స్‌రే విభాగాలను పరిశీలించారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇన్‌పేషెంట్లు, అవుట్‌పేషెంట్లతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అవసరమైన అన్ని మందులు స్టాక్‌లో ఉండేలా చూడాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న కొత్త ప్రభుత్వ ఆసుపత్రి భవనం పనులను పరిశీలించి, సంబంధిత అధికారుల వద్ద నుంచి స్థితిగతులు తెలుసుకున్నారు. పనులను వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్, పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరితగతిన పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. హాస్పిటల్ నిర్వహణ తీరు



సంతృప్తికరంగా ఉందని కొనియాడారు. క్యాన్సర్ వ్యాధి ఉన్నవారిలో జీవన నాణ్యతను మెరుగుపరచడానికి పాలియేటివ్ కేర్ ద్వారా ఆసుపత్రి లో మంచి సేవలు అందిస్తున్నారని. ఆసుపత్రికి రాలేని స్థితిలో ఉన్న వారికి వారి ఇంటి దగ్గర మెరుగైన వైద్యం అందించడం అభినందనీయమన్నారు. ఆసుపత్రిలో డయాలసిస్ రోగులకు మంచి వైద్య సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్, హాస్పిటల్ సూపరింటెండెంట్ చిన్నా నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న తోటి కార్మికులు


- పెయింటర్ యాకూబ్ కుటుంబానికి నలభై వేల ఆర్థిక సహాయం

**ఖమ్మం, జూలై 1 (జనంసాక్షి) :** మానవత్వం పరిమళించింది..చేసేది పెయింటింగ్ పనైనా పెద్ద వారంతా మనస్సు చాటుకున్నారు.. తమతో రోజు పని చేసే పెయింటర్ అకాల మరణం తో ఆ నిరుపేద కుటుమానికి అండగా నిలిచారు.వివరాలు లోకి వెళితే%ొ%ఖమ్మం నగర పెయింటింగ్ అసోసియేషన్ గాంధీ చౌక్ అడ్డా లో ఎస్ కే యాకూబ్ పెయింటర్ గా పని చేస్తున్నాడు.. ఇటీవల గుండె పోటుతో హఠాన్మరణం చెందాడు. మృతుడికి భార్యా ఇద్దరు పిల్లలు. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబం దిక్కు తోచని స్థితిలో పడింది. మంగళవారం యాకూబ్ సంతాప సభ గాంధీ చౌక్ అడ్డా యూనియన్ కార్యాలయం లో నిర్వహించారు..యాకుబ్ కుటుమాబానికి తమ వంతు సహాయం అందించారు.నలభై వేలు పోగు చేసి కుటుంబ సభ్యులకి అందించి వారిలో ధైర్యం నింపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎస్ కె సలీం,అధ్యక్షులు పావురాల నాగేశ్వర రావు,ఉపాధ్యక్షులు చచ్చులక్ష్మీనారాయణ ,తుపాకుల వెంకటేశ్వర్లు గారు,ఎస్ కే ఫరీద్ ,సహాయ కార్యదర్శి పాశం కృష్ణారెడ్డి ,పావురాల ఉషా బాబు వి.సత్యనారాయణ గ,కలకోటి. లక్ష్మణ్ ,కంసాలి అంజి ,ఎస్.కె ఆజాం గారు,కోశాధికారి కాకులారం కిట్టు ,బండి శ్రీను ,గొడ్డు గోర్ల వెంకన్న ,ప్రచార కార్యదర్శులు ఎస్.కె నయుం, బరిగెల రామస్వామి, గొర్ల పరమేశ్వర్, అడవి రాముడు,పింగళి ఉపేందర్, మల్లారపు లక్ష్మణ్, జేమ్స్ పాల్, జంగిలి రాజేందర్, బాడిషా ప్రశాంత్, దుంపటి వీరభద్రం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# సమాజంలో వైద్య వృత్తి అత్యంత కీలకం

**తాండూరు, జూలై 1 (జనంసాక్షి) :** ఆరోగ్యం బాగుంటే వంద సమస్యలైనా పరిష్కరించ వచ్చని బాలాజీ నర్సింగ్ హోం వైద్యులు సంపత్ కుమార్ పేర్కొన్నారు.జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం బాలాజీ నర్సింగ్ హోం వైద్యులు సంపత్ కుమార్ తోటి డాక్టర్‌లకు అర్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ జన్మనిస్తే వైద్యులు పునర్జన్మనిస్తారని తెలిపారు. వైద్యం అంటే ఒక వృత్తిగా కాకుండా మనుషుల్ని బ్రతికించే ఓ మహాశక్తిగా పనిచేయాలన్నారు. అనారోగ్యంతో ఉంటే ఎన్ని ఆస్తులు ఉన్నా వృధా నే అన్నారు. ప్రతి ఒక్కరికి మేరుగైవ వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో వైద్యులు తీవ్రమైన ఒత్తిడిలో సైతం చిత్తశుద్ధితో పని చేస్తున్నారని తెలిపారు. ప్రమాదం లేదా అనారోగ్యం సంభవించిన సమయంలో వైద్యులు దైవంతో సమానమన్నారు. రోగుల పట్ల మరింత మానవతా దృక్పథంతో మనమంతా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు.వైద్యులు ప్రతి ఒక్కరూ సంయుక్తంగా పనిచేసి, పేదలందరికీ మెరుగైన వైద్యం అందాలన్నదే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. పట్టణంలోని తమ నర్సింగ్ హోమ్ ద్వారా ప్రజలకు ప్రతిరోజూ అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్నామని వెల్లడించారు.



# కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు

- 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి
- అఖిలపక్ష సమావేశంలో నేతలు

**ఖమ్మం, జూలై 1 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల తొమ్మిదిన జరిగే దేశ -వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పిలుపు నిచ్చారు. మంగళవారం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్లో లో అఖిల పక్ష కార్మిక, రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల అఖిల పక్ష సమావేశం తోట రామాంజనేయులు -అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు లు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పాలన సాగిస్తుందని తెలిపారు. కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లుగా విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వాటిని వెంటనే రద్దు చేయాలని కోరారు. దేశ -సంపదను కార్పొరేట్, అదానీ, అంబానీ లాంటి సంపన్నులకు కట్టబెడుతూ పేదలపై భారాలు మోపుతున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని -నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు బడ్జెట్లో ప్రతి యేటా నిధులను తగ్గిస్తూ వస్తుందని తెలిపారు. కేంద్ర విధానాల వల్ల దేశంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆరోపించారు. మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక -విధానాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఈనెల తొమ్మిదిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కాంట్రాక్ట్,




అవుట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని, సంఘటిత, అసంఘటిత కార్మికులకు పింఛన్ ఇవ్వాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కనీస వేతనం ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, వ్యవసాయోత్పత్తులకు కనీస మద్దతు ధర చట్టం తేవాలని, ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించాలని, 200 రోజుల పనిదినాలు రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరుతూ ఈనెల తొమ్మిదిన నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో -వివిధ పార్టీల నాయకులు కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, పోటు కళావతి, గాదె లక్ష్మి నారాయణ, సీతామహాలక్ష్మి, కళ్యాణం -వెంకటేశ్వర్లు, ఆవుల వెంకటేశ్వర్లు, కొత్తా సీతారాములు, మొక్కా శేఖర్ గౌడ్, ఎండివై పాషా, మరీదు నాగేశ్వరావు, కె. శ్రీనివాస్, -మోహన్రావు, పటేల్, నరాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్రపురిలో అక్రమ రోహౌస్ కూల్చివేత

**రాజేంద్రనగర్, జూలై 1 (జనం సాక్షి) :** హైడ్రా ఆదేశాలతో గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ చిత్రపురి కాలనీలోని అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన రోహౌసెస్ లో మున్సిపల్ అధికారులు కూల్చివేతలు జరిపారు. మంగళవారం హెచ్ఎండిఏ అనుమతులు లేకుండా చిత్రపురిలో అక్రమంగా రోడ్డు మీద బఫర్ ప్రాంతాల్లో 6 రో హౌస్ లు గత కొన్ని సంవత్సరాల కిందట నిర్మించారు. దీనిపై చిత్రపురి కాలనీవాసులు హైకోర్టులో పిటిషన్ వేయడంతో అక్రమ నిర్మాణాలుగా గత 2023 సంవత్సరం మే నెల 13 న నాలుగు రోహౌసేస్ ను అప్పటి మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. మిగతా రెండు బఫర్ ప్రాంతంలోని అక్రమ రోహౌసేస్‌ల నిర్మాణాలుగా చర్యలు చేపట్టాలని సానికులు మున్సిపల్ , హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. గౌరవ హైకోర్టులో పిటిషన్ వేయడంతో స్టే తెచ్చుకున్న రోహౌస్ యజమానులు ఇంతకాలం వేచి చూశారు. హైకోర్టు ఆదేశాలతో స్పందించిన హైడ్రా అధికారులు మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్ ఆదేశాలతో రంగంలోకి దిగిన టౌన్ ప్లానింగ్ అధికారి సంతోష్ సింగ్ ఒక రోహౌస్ నిర్మాణంను నేలమట్టం చేశారు. మిగతా 1 రోహౌస్ నిర్మాణం ను కూల్చే సమయంలో అట్టి యజమాని తమ ఇంటిలోని వస్తువులు ఖాళీ చేయలేదని అందుకుగాను ఒక రోజు సమయం గడువు ఇవ్వాలని ప్రాధేయపడ్డాడు. చిత్రపురి కమిటీ సభ్యుడు,రోహౌస్ యజమాని విజ్ఞప్తి తో మున్సిపల్ అధికారులు ఒకరోజు గడువు సమయం కోరడంతో మున్సిపల్ అధికారులు సిబ్బంది వెను తిరిగారు.



వల్లభనేని అనిల్, కమిటీ సభ్యులతోనే తాము మోసపోయామని అక్రమ రోహౌస్ యజమాని బోరున విలపించాడు. సొసైటీ సంఘం అధ్యక్షుడు గతంలో మున్సిపల్ అధికారులను మేనేజ్ చేసుకొని ఓకే ప్లాట్ ను పలువురికి మందికి పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారని, చిత్రపురి సొసైటీ కమిటీ, మున్సిపల్ అధికారులు మాలాంటి మధ్య తరగతికి చెందిన కుటుంబీకులను నిలువనా దోచుకొని రోడ్డు మీద పడేస్తున్నారని సదరు రోహౌస్ యజమాని వాపోయాడు. అనధికార నిర్మాణాలకు సొసైటీ కమిటీ అధికార సభ్యులతో మున్సిపల్ అధికారులు కుమ్మక్కైఎందుకు పర్మిషన్ ఇస్తారని ఆదిలోని అడ్డుకోవాల్సిన అధికారులు అడ్డుకోకపోవడం తోనే మాలాంటి మధ్యతరగతి వాళ్లు బలైపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.





# విక్రేత నుంచి వినియోగదారుడి వరకు..

## అమెజాన్‌లో అసలేం జరుగుతుందంటే.

**జనంసాక్షి:**ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన ఏ ఉత్పత్తయినా, విక్రేత దగ్గర్నుంచి మన ఇంటి వరకు చేరడం వెనుక బోలెడంత తతంగం ఉంటుంది. ఆ ప్రక్రియ గురించి తెలుసుకోవాలనే ఆసక్తి చాలా మందికి ఉంటుంది.అలాంటి వారి కోసం ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్, భారత్‌లోని తమ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్లను (ఎఫ్‌సీ) సందర్శించే అవకాశాన్ని కల్పించనుంది.ఈ ఏడాది నాలుగో త్రైమాసికం (క్యూ4) నుంచి ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరులోని తమ ఎఫ్‌సీల్లో ఉచిత టూర్లను ఏర్పాటు చేయనున్నట్లు కంపెనీ తెలిపింది. నిత్యం లక్షల సంఖ్యలో ఉత్పత్తులను నిల్వ చేయడం, కస్టమర్ల ఆర్డర్ల ప్రాసెసింగ్, రవాణా మొదలైన ప్రక్రియలను ఈ సందర్భంగా ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు. ఈ గైడెడ్ టూర్లు వారానికి మూడు సార్లు చొప్పున, ఒక్కోటి 45-60 నిమిషాల పాటు ఉంటాయి. ఒక్కో టూర్‌లో 20 మంది పాల్గొనవచ్చు.టోక్యోలో జరిగిన 'డెలివరింగ్ ది ఫ్యూచర్' కార్యక్రమంలో అమెజాన్ ఈ విషయాలు తెలిపింది. ఈ టూర్లపై ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు త్వరలో వీలు కల్పించనున్నట్లు సంస్థ వైస్ ప్రెసిడెంట్ (ఇండియా-ఆస్ట్రేలియా ఆపరేషన్స్) అభినవ్ సింగ్ చెప్పారు. దేశీయంగా అమెజాన్‌కు బెంగళూరులో 20 లక్షల ఘనపుటడుగుల స్టోరేజ్ స్పేస్‌తో అతి పెద్ద ఎఫ్‌సీ ఉంది. ఇక ఉత్తరాదిలోనే అతి పెద్ద ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్, ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో ఉంది. ఇది 4,50,000 చ.అ.ల్లో, సుమారు ఎనిమిది ఫుట్‌బాల్ మైదానాలంత పెద్దగా ఉంటుంది. 2014 నుంచి అంతర్జాతీయంగా అమెరికా, కెనడా, తదితర దేశాల్లోని 35 లొకేషన్లలో ఇరవై లక్షల మంది పైగా సందర్శకులు అమెజాన్ ఎఫ్‌సీలను సందర్శించారు.

# లాభాల్లో స్టాక్ మార్కెట్లు



**జనంసాక్షి:**దేశీయ స్టాక్ మార్కెట్లు 2025 క్యాలెండర్ ఇయర్ ద్వితీయార్థం సానుకూలంగా ప్రారంభమ య్యా యి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 124 పాయింట్లు (0.15 శాతం) లాభపడి 83,730 వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 ఫ్లాట్గా 25,515 వద్ద ప్రారంభమయ్యాయి.అపోలో హాస్పిటల్స్, ఏషియన్ పెయింట్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, అదానీ ఎంటర్ప్రైజెస్, హెచ్‌సీఎల్ టెక్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ 4 శాతం వరకు లాభపడ్డాయి.విస్తృత మార్కెట్లలో, నిఫ్టీ మిడ్ క్యాప్, నిఫ్టీ స్మాల్ క్యాప్ ఇండెక్స్ వరుసగా 0.24 శా తం, 0.31 శాతం పెరిగాయి. రంగాలవారీగా చూస్తే నిఫ్టీ రియల్టీ 0.65 శాతం లాభపడగా, నిఫ్టీ మెటల్ 0.18 శాతం నష్టంతో టాప్ లూజర్‌గా నిలిచింది. ఎల్లెన్ బారి ఇండస్ట్రియల్ గ్యాస్ ఐపీఓ (మెయిన్ లైన్ ), కల్పతరు ఐపీవో (మెయిన్ లైన్ ), గ్లోబ్ సివిల్ ప్రాజెక్ట్ ఐపీవో (మెయిన్ లైన్ ), శ్రీ హరే కృష్ణ స్పాంజ్ ఐరన్ ఐపీవో (ఎస్ ఎంఈ), ఏజేసీ జ్యువెల్ ఐపీవో (ఎస్ ఎంఈ) ఈ రోజు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో విడుదల కానున్నాయి.వందన్ ఫుడ్స్ ఐపీఓ (ఎస్ఎంఈ), మార్క్ లోయిర్ ఐపీఓ (ఎస్ఎం ఈ), సెడార్ టెక్స్టైల్ ఐపీఓ (ఎస్ఎంఈ), పుష్పా జ్యువెలర్స్ ఐపీఓ (ఎస్ఎంఈ), సిల్కీ ఓవర్సీస్ ఐపీఓ (ఎస్ఎంఈ) సబ్‌స్క్రిప్షన్ కోసం తెరవనుండగా, నీతూ యోషి ఐపీఓ (ఎస్ఎంఈ), యాడ్కొంటీ మీడియా ఐపీఓ (ఎస్ఎం ఈ) మూడో రోజుకు ప్రవేశించను న్నాయి.ఇండోగుల్ఫ్ క్రాప్ సైన్సెస్ ఐపీఓ (మెయిన్ లైన్), మూవింగ్ మీడియా ఐపీఓ (ఎస్ ఎంఈ), వాలెన్సియా ఇండియా ఐపీఓ (ఎస్ ఎంఈ), ఏస్ ఆల్ఫా ఐపీవో (ఎస్ ఎంఈ), ప్రో ఎఫ్ ఎక్స్ టెక్ ఐపీవో (ఎస్ ఎంఈ)లకు వీటి కేటాయింపులు ఉంటాయి.

# అనిల్ అంబానీ మరో భారీ అడుగు..



**జనంసాక్షి:**సుమారు రూ. 20,000 కోట్ల భారతీయ డిఫె న్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎంఆ ర్ఓ) మార్కెట్‌లో విస్తర ణపై రిలయన్స్ డిఫెన్స్ దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా అమెరికాకు చెందిన కోస్టల్ మెకానిక్స్‌తో చేతులు కలిపింది.భారతీయ సాయుధ బలగాలకు అవసరమైన ఎంఆర్‌వో, అప్‌గ్రేడ్, లైఫ్‌సైకిల్ సపోర్ట్ సొల్యూషన్స్‌ను అందించడంపై ఫోకస్ చేయనున్నట్లు రిలయన్స్ డిఫెన్స్ మాతృ సంస్థ రిలయన్స్ ఇన్‌ఫ్రా ఒక ప్రకటనలో తెలిపింది. 100కు పైగా జాగ్వార్ ఫైటర్ విమానాలు, 100 పైచిలుకు మిగ్-29 ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు, ఎల్-70 ఎయిర్ డిఫెన్స్ గన్‌లు మొదలైన వాటి ఆధునీకరణకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుందని వివరించింది. డీల్ ప్రకారం భారత్‌తో పాటు ఎగుమతి మార్కెట్లలోని క్లయింట్లకు సేవలు అందించేందుకు రిల యన్స్ డిఫెన్స్, కోస్టల్ మెకానిక్స్ కలిసి మహారాష్ట్రలో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేస్తాయి.దీనితో సాయుధ బల గాలు ఉపయోగించే గగనతల, భూతల డిఫెన్స్ ప్లాట్‌ఫాంల నిర్వహణ, అప్‌గ్రేడ్ సర్వీసులను అందించనున్నట్లు రిలయన్స్ ఇన్‌ఫ్రా పేర్కొంది. 1975లో ఏర్పాటైన కోస్టల్ మెకానిక్స్‌కు అమెరికా ఎయిర్‌ఫోర్స్, ఆర్మీకి కీలక పరికరాలను సరఫరా చేస్తోంది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.15 | ₹ 5.17 |

**బంగారం ధరలు** (10 గ్రాములు)
హైదరాబాద్

| ₹ 92,100 (22 క్యారెట్లు) | ₹ 1,00,480 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,20,000

# ఆదుకున్న ఆర్‌బీఐ భారీ డివిడెండ్

ప్రస్తుత ఆర్థిక సంవత్సం తొలి రెండు నెలల్లో ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాల్లో 0.8 శాతంగా (రూ.13,163 కోట్లు) ఉన్నట్టు కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) ప్రకటించింది.ఆర్‌బీఐ నుంచి రూ.2.69 లక్షల కోట్ల డివిడెండ్ రావడం ఇందుకు అనుకూలించింది. డివిడెండ్, ప్రాఫిట్స్ కింద ప్రభుత్వం రూ.2.78 లక్షల కోట్లను అందుకున్నట్టు సీజీఏ తెలిపింది.2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తం మీద ద్రవ్యలోటు జీడీపీలో 4.4 శాతం (రూ.15.69 లక్షల కోట్లు)గా ఉంటుందని బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొనడం గమనార్హం. క్రితం ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాల్లో 3.1 శాతంగా ఉంది. ఈ ఏడాది ఏప్రిల్ చివరి వరకే చూస్తే ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాల్లో 11.9 శాతం (రూ.1.86 లక్షల కోట్లు)గా ఉండడం గమనించొచ్చు.ఏప్రిల్, మే నెలలకు కలిపి రూ.3.5 లక్షల కోట్ల పన్నుల రూపంలో, రూ.3.56 లక్షల కోట్లు పన్నేతర ఆదాయం రూపంలో సమకూరింది. నాన్ డెట్ క్యాపిటల్ రిసీట్స్ రూపంలో రూ.25,224 కోట్లు వచ్చింది. వ్యయాలు రూ.7.46 లక్షల కోట్లుగా ఉన్నాయి.



# ఒక్కసారిగా షాకిచ్చిన బంగారం

**ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా క్రమంగా తగ్గుముఖం పడుతోన్న బంగారం ధర నేడు భారీగా ఎగిసింది. బంగారం ధరలు దిగొస్తున్నాయని ఆశించిన కొనుదారులకు నేడు ఊచించని విధంగా షాకిచ్చాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం ధరలు ఎలా ఉన్నాయో కింద తెలుసుకుందాం.**

# ఈ బ్యాంకుల్లో ఎల్ఐసీ పాలసీలు




ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఏయూ ఎస్ఎఫ్‌బీ) తెలిపింది.దీని ప్రకారం ఎల్ఐసీ టర్మ్ పాలసీలు, ఎండోమెంట్ ప్లాన్లు, హోల్ లైఫ్ పాలసీలు మొదలైన వాటిని తమ శాఖల్లో విక్రయించనున్నట్లు పేర్కొంది.21 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాల్లో తమకు 2,456 పైగా బ్యాంకింగ్ టచ్‌పాయింట్లు ఉన్నట్లు బ్యాంక్ ఈడీ ఉత్తమ్ టిబ్రెవాల్ తెలిపారు. ఈ ఒప్పందంతో ఓవైపు బ్యాంకింగ్, బీమా, దీర్ఘకాలిక ఆర్థిక ప్లానింగ్ సొల్యూషన్స్ అన్నింటినీ ఒకే దగ్గర అందించే సంస్థగా తమ బ్యాంక్ స్థానం పటిష్టమవుతుందని మరోవైపు గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో ఎల్ఐసీ పాలసీల విస్తృతి మరింతగా పెరుగుతుందని వివరించారు.బ్యాంకింగ్, భద్రత, దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికను ఒకే ప్లాట్ఫామ్ కింద సమీకృతం చేస్తూ, పూర్తి-స్పెక్ట్రమ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రొవైడర్‌గా మారడానికి ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సాగిస్తున్న ప్రయాణంలో ఈ సహకారం ఒక మైలురాయిని సూచిస్తుంది. ఎల్ఐసీకి కూడా ఈ భాగస్వామ్యం విశ్వసనీయమైన, కస్టమర్-సెంట్రిక్ బ్యాంకింగ్ భాగస్వామి ద్వారా విస్తృత పరిధిని అందిస్తుంది. సంజయ్ అగర్వాల్ 1996లో స్థాపించిన ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ భారతదేశంలో అతిపెద్ద స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌గా, షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకుగా పనిచేస్తుంది. 2025 మార్చి 31 నాటికి బ్యాంక్ 1.13 కోట్లకు పైగా కస్టమర్లకు సేవలు అందించింది. బ్యాలెన్స్ షీట్ పరిమాణం రూ .1.57 లక్షల కోట్లు. 'ఏఏ /స్టేబుల్' క్రెడిట్ రేటింగ్ ఈ బ్యాంకుకు ఉంది.

# భారత్-అమెరికా వాణిజ్యం ఒప్పందం కుదిరేనా?



**అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ఈ వారంలోనే ఖరారు చేసేందుకు భారత్ చొరవ చూపుతోంది. ఈమేరకు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్ నివేదిక పేర్కొంది.ఈ డీల్ పూర్తయితే ట్రంప్ రెండోసారి అధ్యక్షుడయ్యాక అమెరికా-ఇండియా మధ్య కుదిరే తొలి కీలక ఒప్పందం అవుతుంది. ఇప్పటికే యూఎస్ చైనాతో వాణిజ్యం ఒప్పందంపై ముమ్మరంగా చర్చలు జరుపుతున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇండియా- యూఎస్ మధ్య చర్చలు కీలక దశలో ఉన్నందున భారత సంధానకర్తలు జూన్ 27న ముగిసిన రెండు రోజుల పర్యటనను మరింతకాలం పొడిగించినట్లు తెలుస్తుంది.**

భారత వస్తువులపై అమెరికా 26% పరస్పర సుంకం విధించనున్న నేపథ్యంలో జులై 9 లోపు ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందాన్ని పూర్తి చేయాలని ఇరు పక్షాలు చూస్తున్నాయి. ఈ సుంకాలను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏప్రిల్‌లో మొదట ప్రకటించి 90 రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేశారు. ఇప్పటికే ఒప్పందంపై అనేక రంగాల్లో పురోగతి సాధించినప్పటికీ కీలకంగా కొన్నింటిపై విభేదాలు ఉన్నట్లు తెలుస్తుంది. వ్యవసాయం, జన్యుమార్పిడి (జీఎం) పంటలు, పాల ఉత్పత్తుల్లో మార్కెట్ యాక్సెస్ సహా కొన్ని సున్నితమైన రంగాలపై రాజీపడే ప్రసక్తే లేదని భారత అధికారులు స్పష్టం చేశారు.ఈ అంశాలు భారతీయ రైతుల ప్రయోజనాల తో ముడిపడి ఉన్నాయి. వీరిలో చాలా మంది చిన్న, సన్నకారు రైతులు న్నారు. భారత్‌కు భారీ నష్టం వాటిల్లే పనులు అధికారులు చేయబోరని, ఈ అంశాల్లో భారత్ వైఖరి స్పష్టంగా ఉందని భారతీయ రైతుల ప్రయోజనాల తో ముడిపడి ఉన్నాయి. వీరిలో చాలా మంది చిన్న, సన్నకారు రైతులు న్నారు. భారత్‌కు భారీ నష్టం వాటిల్లే పనులు అధికారులు చేయబోరని, ఈ అంశాల్లో భారత్ వైఖరి స్పష్టంగా ఉందనిఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు తెలిపారు. జన్యుమార్పిడి పంటలు, పశువుల దాణా, పాడి, వ్యవసాయ ఉత్పత్తుల శ్రేణిలో భారత మరింత వెసులుబాటు కల్పించాలని యూఎస్ ఒత్తిడి తెస్తోంది. పారిశ్రామిక వస్తువులు, ఎలక్ట్రిక్ వాహనాలు, పెట్రోకెమికల్స్, వైన్‌లపై సుంకాలను తగ్గించాలని అమెరికా కోరుతోంది.

### లేబర్ ఇంటెన్సివ్ రంగాలకు ఉపశమనం

మరోవైపు టెక్స్‌టైల్స్, లెదర్ గూడ్స్, జెమ్స్ అండ్ జువెలరీ, కెమికల్స్, ప్లాస్టిక్స్, రొయ్యలు, నూనెగింజలు, ద్రాక్ష, అరటి వంటి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై సుంకం రాయితీల కోసం భారత్ చర్చలు జరుపుతోంది. ట్రంప్ ప్రకటించిన అదనపు 26% సుంకాల నుంచి పూర్తి మినహాయింపు కోసం భారతదేశం ఒత్తిడి తెస్తోంది. అయినప్పటికీ బేస్‌లైన్ 10% సుంకం అమలులో ఉంది. అయినప్పటికీ బేస్‌లైన్ 10% సుంకం అమలులో ఉంది.విస్తృత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ)లో భాగంగా తొలి విడత బహుళ రంగాలను కవర్ చేయాలని భావిస్తున్నారు. మరింత వివరణాత్మక చర్చలు అక్టోబర్ వరకు కొనసాగుతుండటంతో మధ్యంతర ఒప్పందాన్ని దశలవారీగా రూపొందించవచ్చని సంబంధిత వర్గాలు తెలిపాయి.



# పరిశ్రమలు.. పతనం దిశగా..

- 9 నెలల కనిష్టానికి పారిశ్రామికోత్పత్తి
- మే నెలలో 1.2 శాతం వృద్ధి
- మైనింగ్, విద్యుత్‌లో మైనస్ పనితీరు

న్యూఢిల్లీ: పారిశ్రామికోత్పత్తి మే నెలలో 1.2 శాతానికి పరిమితమైంది. 2024 ఆగస్ట్ తర్వాత ఇదే అత్యంత కనిష్ట స్థాయి. ముందస్తు వర్షాల రాకతో తయారీ, మైనింగ్, విద్యుత్ రంగాల్లో పనితీరు నిదానించడం ఇందుకు దారితీసినట్టు జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్‌వో) ప్రకటించింది. 2024 మే నెలలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 6.3 శాతం వృద్ధిని నమోదు చేయడం గమనార్హం. ఇక ఈ ఏడాది ఏప్రిల్ నెలకు సంబంధించి ఐఐపీ వృద్ధి రేటు 2.7 శాతంగా కాగా, దీన్ని 2.6 శాతానికి ఎన్ఎస్‌వో సవరించింది. తయారీ రంగంలో వృద్ధి మే నెల 2.6%కి పరిమితమైంది. గతేడాది ఇదే నెలలో వృద్ధి 5.1%.మైనింగ్ రంగంలో ఉత్పత్తి మైనస్ 0.1 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే నెలలో ఈ రంగంలో వృద్ధి 6.6 శాతంగా ఉంది.విద్యుత్ రంగంలో ఉత్పత్తి మైనస్ 5.8 శాతంగా ఉంది. క్రితం ఏడాది ఇదే నెలలో 13.7 శాతం వృద్ధి నమోదైంది.క్యాపిటల్ గూడ్స్ రంగంలో భిన్నమైన పరిస్థితి కనిపించింది. 14.1 శాతం వృద్ధి కనిపించింది. క్రితం ఏడాది మే నెలలో వృద్ధి కేవలం.2.6 శాతంగానే ఉంది.కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగంలో పనితీరు మైనస్ 0.7 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే నెలలో 12.6 శాతం వృద్ధిని చూసింది.కన్స్యూమర్ నాన్ డ్యూర బుల్స్ రంగంలోనూ ఉత్పత్తి మైనస్ 2.4 శాతంగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో 7.6 శాతం వృద్ధి కనిపించింది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో (ఏప్రిల్, మే) పారిశ్రామికోత్పత్తి వృద్ధి 1.8 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 5.7 శాతంగా ఉంది.

# 'హార్వర్డ్'కు ట్రంప్ మరో షాక్..

## యూదు హక్కులపై వేటు

వాషింగ్టన్: అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంపై ట్రంప్ పరిపాలనా విభాగం మరోమారు దృష్టి సారించింది. హార్వర్డ్‌తో పాటు వర్శిటీలోని ఇజ్రాయెల్ విద్యార్థులు పౌర హక్కులను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించింది.దీనిపై హార్వర్డ్ అత్యవసర చర్యలు చేపట్టకపోతే సమాఖ్య నిధులను నిలిపివేస్తామని హెచ్చరించింది.అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. వర్శిటీ పాఠ్యాంశాలు, సిబ్బంది నియామకం, విద్యార్థుల అడ్మిషన్ తదితర విషయాల్లో చేసిన ఆదేశాలను ధిక్కరించిన నేపథ్యంలో 'హార్వర్డ్'పై ట్రంప్ పాలకవర్గం ఆగ్రహం వ్యక్తం చేసింది. హార్వర్డ్ అధ్యక్షునికి ట్రంప్ యంత్రాంగం పంపిన ఒక లేఖలో.. గాజాలో హమాస్‌పై ఇజ్రాయెల్ యుద్ధానికి వ్యతిరేకంగా క్యాంపస్‌లో జరిగిన నిరసనల్లో విద్యార్థులను రక్షించడంలో వర్శిటీ విఫలమైందని ఆరోపించింది. దీనిపై దర్యాప్తు తర్వాత కూడా హార్వర్డ్ ఉద్దేశపూర్వకంగా ఉదాసీనంగా వ్యవహరించిందని పేర్కొంది.



# దైవదర్శనానికి వెళ్లొస్తూ.. తిరిగిరాని లోకాలకు



బాగేపల్లి(కర్ణాటక): తిరుమలలో వెంకటేశ్వరస్వామి ఆలయ దర్శనానికి వెళ్ళి స్వామివారిని దర్శించుకొని సంతోషంగా ఇంటికి తిరుగుముఖం పట్టిన కుటుంబాలు కొంతసేపటికే ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యాయి.ముగ్గురు అక్కడే చనిపోగా, 8 మంది తీవ్రంగా గాయపడిన సంఘటన ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాలో కురబలకోట వద్ద చెన్నామర్రి మిట్ట అనేచోట హైవేలో సోమవారం ఉదయం జరిగింది. బాగేపల్లి తాలూకాలోని శ్రీనివాసపుర (సాకోళ్ళపల్లి ) గ్రామానికి చెందిన శ్రావణి (27), హొసహుడ్యకు చెందిన హెచ్.ఎస్.చరణ్ (17), బాగేపల్లి పట్టణవాసి మేఘర్శ (17) మృతులు.వివరాలు.. బాగేపల్లి పట్టణంలోని గంగమ్మగుడి రోడ్డుకు చెందిన రామచంద్రప్ప, హెచ్.టి.శివప్ప, నరసింహారెడ్డి కుటుంబాలకు చెందిన 13 మంది కలిసి టెంపో ట్రావెలర్‌లో తిరుమల యాత్రకువెళ్లారు. దర్శనాలయ్యాక బయల్దేరారు. ఘటనాస్థలంలో యమ శకటంలా వచ్చిన భారీ లారీ



ఈ టెంపోను ఢీకొట్టింది. టెంపో పూర్తిగా ధ్వంసమైంది. లోపలున్నవారు విసిరేసినట్లు బయటకు పడిపోయారు. అందరికీ తీవ్ర రక్త గాయాలయ్యాయి. ముగ్గురు అక్కడే మరణించారు. నరసింహారెడ్డి, భార్య హెచ్.ఎన్. రూప, కుమారుడు ఆదర్శ, రామచంద్రప్ప, భార్య కళావతి, పెద్ద కుమారుడు అశోక్, కోడలు శ్రావణి, చిన్న కుమారుడు దర్శన్, టైలర్ హెచ్.టి.శివప్ప, భార్య సునందమ్మ, కుమార్తె చైత్ర, టెంపో డ్రైవర్ మంజునాథ్‌లు గాయపడ్డారు. రక్తగాయాలు, ఆర్తనాదాలతో ఘటనాస్థలి భయంకరంగా కనిపించింది. స్థానికులు గాయపడినవారికి దొరికిన వాహనాలలో ఆస్పత్రులకు తరలించారు. కొందరిని బెంగళూరుకు తీసుకెళ్లారు. ఘటన గురించి తెలియగానే ఇక్కడి నుంచి బంధువులు వెళ్లారు.కురబలకోట: దేవుడా నీ దర్శనానికి వచ్చామే, ఎంత పనిచేశావయ్యా అని గుండెలవిసే వేదనలతో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి నిండిపోయింది. కాళుచేతులు విరిగిన వారు, ఇలా వివిధ రకాలుగా గాయాల పాలైన వారిని చూసి గుండె తరుక్కుపోయింది. ముగ్గురి మృత దేహాలను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. టెంపోను ఢీకొని వెళ్లిపోయింది కంటైనర్ లారీగా గుర్తించారు. వాహనంతో పాటు డ్రైవర్ కోసం పోలీసులు విభిన్న కోణాల్లో ముమ్మరంగా గాలిస్తున్నారు. రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేశారు.టెంపో ట్రావెలర్‌కు జరిగిన ప్రమాదం చూస్తే భయాందోళన కలగడం ఖాయం. లారీ ఢీకొన్న ధాటికి టెంపో టాప్ ఎగిరిపోయింది. బాధితులు తీవ్ర గాయాలతో అంగలార్చడం చూపరులను చలింపజేసింది. మరికొందరు చెల్లా చెదురుగా రోడ్డుపై పడిపోయారు. స్థానికులు సహాయక చర్యలతో మానవత్వాన్ని చాటుకున్నారు.

**ఈ ఇద్దరూ క్షేమం**

టెంపో డ్రైవర్ మంజునాథ పక్క సీట్లో బాగేపల్లెకు చెందిన అశోక్ (32), ఇతని వెనుక సీట్లో ఏడో తరగతి విద్యార్థి హేమంత్ కూర్చున్నారు. ఇతను ఒక్కడే తిరుమలలో గుండు చేయించుకున్నాడు. ఈ యాక్సిడెంట్‌లో వీరిద్దరే క్షేమంగా బయటపడడం విశేషం. డ్రైవర్ మంజున్యాథ తీవ్ర గాయాలతో కోమాలో ఉన్నాడు.

**దర్శనం తరువాత బయల్దేరాం**

ఆదివారం రాత్రి తిరుమలకు చేరుకుని దైవ దర్శనం చేసుకున్నాం. కొంత సేపు విశ్రాంతి తీసుకుని సోమవారం వేకువ జామున మూడు గంటల ప్రాంతంలో బయలు దేరాం. కురబలకోట మండలంలోని చెన్నామర్రి వద్ద వస్తుండగా ఉదయం 6.20 గంటల ప్రాంతంలో ఈ దుస్సంఘటన చోటు చేసుకుంది. ఇలా జరుగుతుందని ఊహించలేదు. - ఓ క్షతగాత్రుడు

# తప్పుడు పత్రాలతో వాయుసేన రన్‌వేనే అమ్మేశారు..!

అ యినా చర్యలు శూన్యం. దీంతో నిషాన్‌సింగ్ ఏకంగా దర్యాప్తునకు ఆదేశాలు కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఆ తర్వాత దర్యాప్తులో 1997లో ఈ భూమిపై పలువురికి అమ్మకాలు జరిగినట్లు డీడ్లు ఉన్నాయి. కానీ, ఎక్కడా వాయుసేన పేరు మాత్రం లేదు. దీంతో కోర్టు 2025 మే నెలలో ఈ భూమిని తిరిగి రక్షణశాఖకు అప్పగించారు. దీనిపై విజిలెన్స్ అధికారులు దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ భూమిని రెండో ప్రపంచ యుద్ధం కోసం బ్రిటిష్ ప్రభుత్వం 1945 మార్చి 12న తీసుకొన్నట్లు విజిలెన్స్ బ్యూరో దర్యాప్తులో తేలింది. నాటినుంచి వాయుసేన అధీనంలోనే ఉన్నట్లు వెల్లడించింది. తాజాగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో నిందితులు ఉషా, నవీన్‌చంద్ పేర్లను అధికారులు నమోదు చేశారు.

# మున్నూరుకాపు నాయకుడిని మంత్రివర్గంలోకి తీసుకోవాలి

### అపెక్స్ కౌన్సిల్ డిమాండ్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 01 (జనంసాక్షి) :** మున్నూరుకాపు నాయకుడిని వెంటనే మంత్రివర్గంలోకి తీసుకోవాలని, బీసీలకు 42% రిజర్వేషన్స్ అమలు పర్చాలని మున్నూరుకాపుల అత్యున్నత నిర్ణాయక మండలి అయిన అపెక్స్ కౌన్సిల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేసింది.సంఘం గౌరవాధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అధ్యక్షతన సోమవారం రాత్రి జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, అపెక్స్ కౌన్సిల్ సభ్యులు వీ.ప్రకాష్,సీ.విఠల్, రౌతు కనకయ్య,బొంతు రాంమోహన్, మీసాల చంద్రయ్య, బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి తదితర ప్రముఖులు హాజరై పలు అంశాలపై సమాలోచనలు జరిపారు.రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో మున్నూరుకాపు నాయకుడు లేకపోవడం విచారకరమని, గతంలో ఏనాడు కూడా ఇటువంటి పరిస్థితి దాపురించలేదని సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది.తమ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని వెంటనే మంత్రిమండలిలోకి తీసుకుని ప్రాధాన్యత కలిగిన శాఖను కేటాయించాలని, స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగ రంగాలలో 42% రిజర్వేషన్స్ అమలు చేయాల్సిందిగా కాంగ్రెస్ అధిష్టానాన్ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మున్నూరుకాపు ప్రముఖులు డిమాండ్ చేశారు.తమ సామాజిక వర్గానికి చెందిన అధికారులకు ఏ మాత్రం ప్రాధాన్యత లేని శాఖలిచ్చి ప్రభుత్వ పాలనకు దూరం పెట్టడమే కాక ఏసీబీ దాడులతో భయభ్రాంతులకు గురి చేయడాన్ని సమావేశం తప్పుబట్టింది.

రాష్ట్ర జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్న మున్నూరుకాపులను మరింత ఐక్యం చేస్తూ,చైతన్యపరుస్తూ సంఘాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేయాలని సమావేశంలో మాట్లాడిన వక్తలు అభిప్రాయపడ్డారు.ఇందులో భాగంగా రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించాలని, హైదరాబాద్ నగరంలో భారీ బహిరంగ సభను జరపాలని,ఇతర బీసీ కులాల వారితో స్నేహం పెంచుకుంటూ రాజ్యాధికారం వైపు ముందుకు సాగాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది.ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తమ రావు, ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య, కోశాధికారి కంచె సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షులు బుక్కా వేణుగోపాల్, డాక్టర్ జే.ఏన్.వెంకట్,చల్లా హరిశంకర్, మహిళా విభాగం అధ్యక్షురాలు బండి పద్మక్క, నాయకులు ఉప్పు రవీందర్,వాసాల వెంకటేశ్వర్లను శాలువాలతో సత్కరించారు. సంఘం ఎన్నికలను పారదర్శకం గా, విజయవంతంగా నిర్వహించిన ఎన్నికల ప్రధానాధికారి జే.డీ.లక్మీనా రాయణ, అధికారులు మంగబాబు,ఎర్రా నాగేంద్రబాబు,న్యాయ సలహాదార్లు లవంగాల అనిల్,ఊసా రఘులను సమావేశానికి హాజరైన వారంతా అభినందించారు.

# మున్సిపల్ కమిషనర్, అధికారులను వెంటనే అరెస్ట్ చేయాలి

- జిల్లా పోలీసు కమిషనర్‌ను కలిసిన కోరిన మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 01 (జనంసాక్షి) :** కరీంనగర్ 1వ పట్టణం ఎస్హెచ్ఓ పి.ఎస్. లేఖ ద్వారా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి కొంత సమాచారం కోరినట్లు చెబుతున్నారనీ , కానీ ఆ సమాచారం కరీంనగర్ పట్టణం ఎస్హెచ్ఓ పి.ఎస్.కు అందలేదని, లేఖను అందించలేదని సర్దార్ రవీందర్ సింగ్ పేర్కొన్నారు. కరీంనగర్ నగర పరిధిలోకి రాని బొమ్మకల్ జంక్షన్ అభివృద్ధి పనుల కోసం కమిషనర్ మున్సిపల్ కార్పొరేషన్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ 2022 ఆగస్టు 8న టెండర్లు పిలిచారని సిపి కి సర్దార్ రవీందర్ సింగ్ తెలిపారు. ఈ సంధర్భంగా నిందితులైన కరీంనగర్ స్మార్ట్ సిటీ కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్ , మేనేజింగ్ డైరెక్టర్, సూపరింటెండింగ్ ఇంజనీర్, కరీంనగర్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ ప్రతినిధి, దాని మేనేజింగ్ డైరెక్టర్ ( కెఎస్ సిసి ఎల్) , ఇతరులు ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారనీ లేఖలో సర్దార్ రవీందర్ సింగ్ తెలిపారు. జిల్లాలోని ఆర్థిక దుర్వినియోగాలను చేసిన ఉద్యోగుల పై వెంటనే శిక్ష చర్యలు తీసుకోవాలని సీపీ గౌస్ ఆలం ని కోరారు. ఇచిన ఫిర్యాదుపై, కరీంనగర్ పిఎస్. 1వ టౌన్ ఎస్హెచ్ఓ క్రైమ్.నెంబర్. 480/2024 అ/సె 420,406 ఆర్/డబ్ల్యూ 34 ఐపిసి లో కేసు నమోదు చేశారు. కానీ వర్తించే సరైన చట్టం సెక్షన్ 406 ఐపిసి కాదు కానీ అది సెక్షన్ 409 ఐపిసి అయి ఉండాలనీ సర్దార్ రవీందర్ సింగ్ తెలిపారు. 409 ఐపిసి సెక్షన్ ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు లేదా బ్యాంకర్లు ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి వర్తిస్తుందని తెలిపారు. నగర మున్సిపల్ కమిషనర్ , సూపరింటెండింగ్ ఇంజనీర్‌పై దుర్వినియోగం ఆరోపణలు ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారి తగిన చట్టాన్ని వర్తింపజేయకుండా, ఎస్హెచ్ఓ కరీంనగర్ 1వ టౌన్ ద్వారా రాజకీయ ఒత్తిడి కారణంగా తీవ్రమైన ఉద్దేశపూర్వక తప్పిదం జరిగిందని అయినప్పటికీ ఎస్ హెచ్ ఓ చేసినట్లు మీ దృష్టికి తీసుకరాలేదని సర్దార్ రవీందర్ సింగ్ తెలిపారు. తప్పిదాలు చేసిన వారిపై తగిన చట్టాల కింద కేసు నమోదు చేయకపోవడం, ఆలస్యంగా దర్యాప్తు చేయడం , పట్టించుకోవట్లేదని సర్దార్ రవీందర్ సింగ్ వాపోయారు. ఇది ప్రజా ధనాన్ని కలిగి ఉన్న అటువంటి ముఖ్యమైన కేసులను పరిష్కరించడంలో ఐ.ఓ అలసత్వాన్ని తెలియజేసే రికార్డుల కోసం నోటీసు జారీ చేయబడలేదని, సిద్ధంగా ఉన్న సమాచారం కోసం, పిఎస్ జారీ చేసిన ఎఫ్ఐఆర్ కాపీని అందజేశారు. దీనివల్ల నేరస్థులను అరెస్టు చేయడానికి, వారిని జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపడానికి దర్యాప్తును వేగవంతం చేయడానికి ఎస్ హెచ్ ఓ కి తగిన సూచనలు జారీ చేయాలని, పోలీసులు సాధారణ ప్రజలకు , ప్రముఖులకు వేర్వేరు గజాలను ఉపయోగించడం పోలీసులపై నింద మోపబడుతుందని స్పష్టం చేశారు. వెంటనే దర్యాప్తును వేగవంతం చేసి బాధ్యులను అరెస్టు చేసి ప్రజలకు సరైన న్యాయం జరిగేలా చేయాలని కరీంనగర్ 1వ టౌన్ పిఎస్.ఎస్హెచ్ఓ కి తగిన సూచనలు ఇవ్వాలని మాజీ మేయర్, మాజీ రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ను కోరారు.

# జిల్లాలో పక్కాగా పారిశుద్ధ్య నిర్వహణ

- భూగర్భ జలాల పెంపుకు చర్యలు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ ప్రతినిధి, జులై 01(జనంసాక్షి ):** జిల్లా లోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సమర్థవంతంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నస్ కార్యక్రమం కింద.. మంగళవారం తమిళనాడు నుండి సర్పంచ్, బ్లాక్ ప్రసిడెంట్, అధికారులు జిల్లాకి క్షేత్రస్తాయి పరిశీలన కై రాగా...వారిని లింగాల ఘణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి డిపోట స్వరూప తీసుకెళ్లి... తడి పొడి చెత్త,పారిశుధ్య నిర్వహణ, నర్సరీ లో మొక్కల పెంపకం జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం జడ్పీ కార్యాలయనికి వచ్చిన తమిళనాడు బృందంతో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతీ గ్రామ పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ, తడి పొడి చెత్త నిర్వహణ ద్వారా వస్తున్న ఆదాయం,నర్సరీలో మొక్కల పెంపకం విధానం, భూగర్భ జలాల పెంచేందుకు ఇంకుడు గుంతల నిర్మాణం, తద్వారా పెరిగిన ఆయకట్టు, పంటల సాగు,పక్కాగా శానిటేషన్ నిర్వహణ వల్ల సీజనల్ వ్యాధులను అరికడుతున్న తీరును సర్పంచ్ బృందానికి కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమం లో జడ్పీ సీఈఓ మాధురి షా, డిపిఓ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలి

- ఈనెల 9 జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి
- కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్




**భూపాలపల్లి, జూలై 1 (జనం సాక్షి):** కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని జాతీయ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కొరిమి రాజ్ కుమార్, మిరియాల రాజిరెడ్డి, తుమ్మల రాజిరెడ్డి, చక్రపాణి, విశ్వనాధులు డిమాండ్ చేశారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఐటియుసి కొమురయ్య భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలం నుండి 44 కార్మిక చట్టాలను సాధించుకోవడం జరిగిందని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ కార్మిక 44 చట్టాలను నాలుగు కోడులుగా విభజించి కార్మిక హక్కులను కాల రాస్తున్నాయని మండిపడ్డారు. ఈ కోడ్ ల విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9 న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ ఒక్కరోజు దేశవ్యాప్త సమ్మెతో కార్మిక శక్తి ఏంటో కేంద్ర ప్రభుత్వానికి తెలిసే విధంగా సింగరేణి సంస్థను పరిరక్షించే విధంగా జాతీయ సంఘాల జేఏసీ దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈ నాలుగు లేబర్ కోడ్ ల వల్ల కార్మిక సంఘాలు ఉండకూడదని కుట్రతో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం లేబర్ చట్టాలను తెచ్చిందని, వాటిని తిప్పి కొట్టే విధంగా కార్మిక సంఘాల జేఏసీ ఏర్పడిందన్నారు. కార్పొరేట్ శక్తులకు లాభం చేసే ఈ నాలుగు కోడ్ ల అమలు వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలని, భూపాలపల్లి ఏరియాలోని అన్ని సంఘాల నాయకులు కార్మికులు,కర్షకులు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా జేఏసీ నాయకులు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జేఏసీ సంఘాల నాయకులు మాతంగి రామ్ చందర్, నూకల చంద్రమౌళి, బడి తల సమ్మయ్య, కంపేటి రాజయ్య, గణేష్, జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



**బోధన్, జూలై 1 ( జనంసాక్షి ) :** బోధన్ పట్టణంలోని ఆరో వార్డులో నిర్మాణాలు చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను మంగళవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. పథకానికి అనుగుణంగా మంజూరైన ఇళ్ల నిర్మాణ స్థితిని సబ్ కలెక్టర్ గారు స్వయంగా పరిశీలించి, లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. నిర్మాణ పనుల పురోగతి, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. అలాగే, పథకంలోని నిధుల విడుదల విధానం గురించి స్పష్టంగా వివరించి, నిర్మాణం ప్రతి దశ పూర్తయిన తర్వాత సంబంధిత మార్గదర్శకాల ప్రకారం మంజూరైన మొత్తం దశలవారీగా విడుదల చేయబడుతుందని లబ్ధిదారులకు తెలియజేశారు. ఆయన వెంట ఇరిగేషన్ ఏఈ, సంబంధిత అధికారులు ఉన్నారు.




# రెనే హాస్పిటల్‌లో ఘనంగా వైద్యుల దినోత్సవం

**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 01 (జనంసాక్షి) :** జాతీయ వైద్యుల దినోత్సవాన్ని స్థానిక రెనే హాస్పిటల్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుడా చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించినారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... కరీంనగర్ లాంటి పట్టణం లో హైదరాబాద్ కు ఏ మాత్రం తీసిపోకుండా అత్యాధునిక వసతులతో రెనేహాస్పిటల్ ను స్థాపించి విజయవంతంగా నిర్వహించడం అనేది ప్రో.డా.బంగారి స్వామి , డా. బంగారి రజనీ ప్రియదర్శిని ల నిబద్ధతకు నిదర్శనం అన్నారు. ఈ రెనే హాస్పిటల్ లో సుమారు 400 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, కోవిడ్ సమయంలో ఎంతో మంది ప్రాణాలు కాపాడిన వైద్యుల గొప్పతనాన్ని ఈ సమయంలో అందరూ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. రాబోయే రోజుల్లో కరీంనగర్ పట్టణ వైద్య రంగానికి తలమానికంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వైద్యులను సత్కరించి, జ్ఞాపికలను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రెనే గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ చైర్మన్ ప్రో.డా.బంగారి స్వామి మాట్లాడుతూ... రాబోయే రోజుల్లో రెనే హాస్పిటల్ లో పేషెంట్ లకు అవసరమైనటువంటి అత్యాధునిక సదుపాయాలు కల్పించడంలో ముందు ఉంటామని ఈ మధ్యనే క్యాన్సర్ పేషంట్స్ గురించి పెట్ సిటి స్కాన్ ప్రారంభించామన్నారు. రజనీ ఫెర్టిలిటీ సెంటర్ చైర్మన్ డా.రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ... వైద్యులు రోగులకు సేవతో పాటు తమ వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ డా.మునిష్ , మెడికల్ సూపరింటెండెంట్ డా.రవీంద్రా చారి, డా.రవి కుమార్, డా.నిఖిల్ లక్ష్మణ్, డా.కృష్ణా రెడ్డి, డా.సంతోష్ , డా.సునీల్ రెడ్డి, డా.ఫర్హానాజ్, హాస్పిటల్ నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్ రావు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్ లతో పాటు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ కిరణ్మయి



**నిజాంసాగర్ జూలై 1 (జనం సాక్షి) :** మహమ్మద్నగర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి అకస్మాత్తుగా తనిఖీ చేశారు. కార్యాలయంలో జరిగే పనితీరును ఆమె సమీక్షించారు. భూ భారతి పోర్టల్ ద్వారా భూముల డిజిటల్ నమోదు, పటాలు, రైతుల వివరాలు తదితరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రతి రైతుకు భూమిపై పూర్తి సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామ గ్రామాల్లో భూభారతి సమాచారం సక్రమంగా ఉండాలి. అధికారులు తమ విధులను పక్కాగా నిర్వహించాలి" అని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు కలిగే ఇబ్బందులు, ఫిర్యాదుల పరిష్కారాల పై కూడా ఆమె సమీక్షించారు.ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ సవాయ సింగ్, డిప్యూటీ తహసిల్దార్ శరత్ కుమార్,ఆర్ ఐ పండరీ, తదితరులు ఉన్నారు.

# ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

### కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూలై 1 (జనంసాక్షి) :** జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు పాఠశాలలోని ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి బోధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.వేములవాడ అర్బన్ మండలంలోని చింతల్ ఠాణా ఆర్ అండ్ ఆర్ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.తరగతి గదులను, అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న తీరును పరిశీలించారు. పాఠశాల భవనం అంతస్తు పైన కిచెన్ షెడ్ నిర్మించాలని, వెంటనే పనులు ప్రారంభించి, సాధ్యమైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులతో నిత్యం చదవడం,రాయడంపై ప్రత్యేక దృష్టి సారించి,నిత్యం అభ్యసన చేయించాలన్నారు. డెస్క్ లు తక్కువగా ఉండడంతో, వేరే పాఠశాల నుండి తెప్పించాలన్నారు. విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.

**అంగన్వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ**

చింతల్ ఠాణా ఆర్ అండ్ ఆర్ కాలనీలోని అంగన్వాడీ కేంద్రమును కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఎంత మంది చిన్నారులు ఉన్నారు, ఈరోజు ఎంత మంది వచ్చారనే వివరాలను ఆరా తీశారు. అర్హులైన పిల్లలందరికీ బాలామృతం, కోడిగుడ్లు అందరికీ అందించాలని నిర్వాహకులకు సూచించారు. చిన్నారుల ఎత్తు, బరువును కొలిచి పరిశీలించారు.చిన్నారుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్, రిజిస్టర్ లో నమోదు చేయాలని ఆదేదించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.



# ఆన్‌లైన్ గేమ్స్‌కు యువకుడు బలి

**మంథని, (జనంసాక్షి) :** ఆన్లైన్ గేమ్స్‌కు బానిసై యువకుడు తన నిండు ప్రాణాలను బలితీస్తున్నాడు. పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల కేంద్రంలోని పిల్లిపల్లెకు చెందిన పిల్లి అజయ్ (24) అనే యువకుడు హైదరాబాద్ లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ.. మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన పిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత మూడు సంవత్సరాలుగా తమ కుమారుడు అజయ్ సెల్‌ఫోన్ ద్వారా ఆన్ లైన్ గేమ్‌లు ఆడుతుండే వాడని పలుమార్లు మందలించగా ఇల్లు విడిచి వెళ్ళిపోగా ఆచూకి తెలుసుకుని ఇంటికి తీసుక రావడం జరిగిందని, ఇదే క్రమంలో మళ్ళీ ఆన్ లైన్ గేమ్స్ ఆడడం మొదలు పెట్టాడని ఆడవద్దు అని తల్లి దండ్రులం మందలించామని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే గత నెల 29 న గుండారం - రాజాపూర్ శివారు లో తమ కుమారుడు అజయ్ గడ్డి మందు తాగడని సెల్ ఫోన్ ద్వారా తన స్నేహితులకు చెప్పగా వారి ద్వారా మాకు సమాచారం తెలిసిందని పేర్కొన్నారు. వెంటనే తమ కుమారుడు ఉన్న ప్రదేశానికి వెళ్లి అక్కడి నుండి పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ కు అదే రోజు మెరుగైన చికిత్స కోసం తీసుకెళ్లడం జరిగిందని వెల్లడించారు. అప్పటి నుండి చికిత్స పొందు తున్న తమ కుమారుడు మంగళవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి పిల్లి మల్లయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కమాన్ పూర్ ఎస్ఐ కొట్టె ప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# చీకటి నాయకుల ఒప్పందాలు?

## పంచుకుందాం.. పనికానిద్దాం..

- ప్రజల ఆస్తులను భక్షించడం సమంజసమా..



**ఆర్మూర్, జులై 1 (జనం సాక్షి):** బుద్ధి గడ్డి తిందా అనే నానుడి పరిపాటిగా వచ్చే పదమే.. ఏ నాయకుడైనా కాలం తగ్గట్టు తన తీరు మార్చుకుంటున్నాడనేది వాస్తవమవుతుంది.గత పదేళ్ల పాలనను తప్పు పట్టిన నాయకులే తమ బుద్ధి ఏమైందంటూ ఆర్మూర్ డివిజన్ లో ప్రస్తుతం జోరుగా చర్చకు దారితీస్తుంది.రాజకీయం అంటేనే ఒకరిపై ఒకరు బురద చల్లుకోవడం,నువ్వెంత అంటే నేనెంత అనే సవాలు విసురుకోవడం ఒకప్పటి మాట.ఆర్మూర్ డివిజన్ లో నాయకుల చీకటి ఒప్పందం రాజ్యమేలుతుంది.పార్టీలు వేరైనా నాయకులంతా ఒక్కటే,కార్యకర్తలే బలవుతున్నారనేది నగ్న సత్యంగా నిలుస్తుంది. పార్టీ కోసం జెండాలు మోసి,కార్యకర్తలు రాత్రింబవళ్లు కష్టపడుతూ తమ నాయకుడే తోపంటూ హల్చల్ గా తిరుగుతున్నారు.

నాయకుడి కోసం పనిచేస్తూ కార్యకర్తల మాటలు దూషణల దాకా వెళ్తున్నాయి..చీకటి నాయకుల భూములు,వాటాలు,కబ్జాలు ఒక్కొక్కటిగా ప్రజలకు తెలిసి అవాక్కవుతున్నారు.ప్రభుత్వ భూములు పట్టాలెక్కుతున్నాయి.ప్రభుత్వ పాఠశాలల భూములు వేరొకరి అన్యాక్రాంతమవుతున్నాయి.

పార్టీ ఏదైతే ఏముంది.. పని కానిద్దాం.. పంచుకుందాం..అనే ఒక వినూత్న ఒరవడికి ఆర్మూర్ డివిజన్ లో నాయకులు శ్రీకారం చుట్టారు. తమ పనులను చక్కబెట్టు కునేందుకే కొందరు నాయకులు పార్టీలు మారి అప్రతిష్ట పాలవుతున్న దులిపేసుకుని పోతున్నారు.ఆస్తులమ్మి,అప్పులు చేసి,డబ్బుండి దర్జా కోసం రాజకీయాల్లోకి వచ్చి ప్రజల ఆస్తులను భక్షించడం సరికాదని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.ప్రజల ఆస్తులు, భూములు దుర్వినియోగం అవుతుండడంతో నాయకుల వికృత చేష్టలను చూసి చేసేదేమీ లేక నవ్వుకుంటున్నారు.ఎవరు గెలిచిన,ఎవరు ఓడిన హొదా-పీఠం అలాంటిదని జనాలు అనుకుంటున్నారు. మరి ఎప్పటికైనా,ఎవరైనా ఆ చీకటి నాయకుల ఒప్పందాలు ప్రజలకు బట్టబయలు కావాల్సిందే.

# భవిష్యత్తు అంతా విద్య మీదనే కొనసాగుతుంది





- విద్య, వైద్యంకు పెద్దపీఠ వేస్తున్న ముఖ్యమంత్రి
- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**ఎడపల్లి, జూలై 1 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య, వైద్యంకు పెద్దపీఠ వేస్తూ కోట్లాది రూపాయలు నిధులను వెచ్చిస్తున్నారని అయితే భవిష్యత్తు అంతా మున్ముందు విద్య మీదనే కొనసాగుతుందని అందువల్ల విద్యార్థులు బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలను పురస్కరించుకొని విద్యార్థులను ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఘనంగా సన్మానించడంతో పాటు నూతనంగా మంజూరైన కోర్సులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో ఇక్కడ అరకొర సదుపాయాలు ఉన్నప్పటికీ విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగించడం అభినందనీయమన్నారు. అయితే దాతలు, గ్రామస్తుల సహకారంతో పాఠశాల, కళాశాలలో నూతనంగా గదులను నిర్మించడం, ఇతర సదుపాయాలు కల్పించడంతో ప్రస్తుతం మెరుగైన సౌకర్యాలు అందించడం జరిగిందన్నారు. ఈ మేరకు దాత వెంకటేశ్వర శర్మను ఆయన అభినందించారు. ఉపాధ్యాయులు మరింత ప్రత్యేక దృష్టితో విద్యను బోధించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుతం సమాజంలో విపరీతమైన పురుగుల మందు వాడిన కూరగాయలను కొనుగోలు చేయడంతో రోగల బారిన పడాల్సి వస్తుందని అయితే గురుకుల పాఠశాల కళాశాల విద్యార్థులకు మాత్రం స్వచ్ఛమైన కూరగాయలతో వడ్డించడం అభినందనీయం అన్నారు. అయితే పాఠశాల ఆవరణలో గల స్థలంలో కూరగాయల పెంపకం కోసం లక్షన్నర రూపాయలతో పందిళ్లను ఏర్పాటు చేయడంతో పాటు పాఠశాలకు రంగులు వేసేందుకు రెండు లక్షలు మంజూరు చేయనున్నట్లు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం కోసం సైతం సంబంధిత అధికారులు సమీక్షించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గంగాశంకర్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హాందాన్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఎడపల్లి సహకార సంఘం చైర్మన్ పోల మల్కారెడ్డి, జైతాపూర్ సహకార సంఘం చైర్మన్ కరటూరి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు బాపునగర్ లింగం, మండల పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బిల్ల రామ్మోహన్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మాణిక్ రజిత యాదవ్, మాజీ సర్పంచులు ఎల్లయ్య యాదవ్, శంకర్ నాయుడు, పాల్ద భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సూరిబాబు, రాము, మొబిన్, మంద నాగరాజు, విజయ్ కుమార్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, విద్యార్థ విద్యార్థులు పాల్గొన్నారు.

# పండంటి బిడ్డకు జన్మనిచ్చిన వినేశ్ ఫొగాట్



మాజీ రెజ్లర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే వినేశ్ ఫొగాట్ అభిమానులకు గుడ్‌న్యూస్. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. పురిటినొప్పులు రావడంతో ఢిల్లీలోని అపోలో ఆస్పత్రిలో చేరిన వినేశ్‌కు.. జూలై 1న కాన్పు చేశారు. తల్లీబిడ్డ సురక్షితంగా ఉన్నారని వైద్యులు వెల్లడించారు. తొలిసారి అమ్మానాన్న అయిన వినేశ్ దంపతులకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కుమారి సెల్జా వినేశ్‌కు అభినందనలు తెలిపారు. ఈ ఏడాది మార్చిలో వినేశ్, సోమ్‌విర్ రథీ తాము తల్లిదండ్రులం కాబోతున్నామనే విషయాన్ని వెల్లడించారు. 'మా ప్రేమకథ మరో కొత్త అధ్యాయంతో కొనసాగనుంది' అంటూ సోషల్ మీడియా పోస్ట్ ద్వారా ఫ్యాన్స్‌తో పంచుకున్నారు. కామన్‌వెల్త్, ఆసియా క్రీడల ఛాంపియన్ అయిన వినేశ్ ఫొగాట్ 2018లో మల్లయోధుడు సోమ్‌వీర్‌ను పెళ్లి చేసుకుంది. నిరుడు పారిస్ ఒలింపిక్స్‌లో అదనపు బరువు కారణంగా అనర్హతకు గురైన వినేశ్.. రెజ్లింగ్‌కు వీడ్కోలు పలికింది. స్వదేశం వచ్చిన తర్వాత రాజకీయాల్లో చేరిన ఆమె కాంగ్రెస్ తరఫున అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచింది. జులానా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన వినేశ్.. ప్రజా సేవలో తరిస్తోంది.

# ఐదేళ్ల రికార్డుకు బ్రేక్

## తొలి రౌండ్‌లోనే జెస్సికా పెగులా ఔట్



వింబుల్డన్ 2025 రెండో రోజు కూడా సంచలనాలతో కొనసాగింది. తొలి రోజు ఫేవరెట్లు డానిల్ మెద్వెదేవ్, స్టెఫానోస్ సిట్సిపాస్‌లు తక్కువ ర్యాంకర్ల చేతిలో ఓడిపోగా, మూడో సీడ్ జెస్సికా పెగులా కూడా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. మహిళల సింగిల్స్ టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పెగులాను 116వ ర్యాంకర్ ఎలిజబెత్ కొస్కియ రెట్టొ (ఇటలీ) 6-2, 6-3 స్కోరుతో 58 నిమిషాల్లో చిత్తు చేసింది. దీంతో, గత ఐదేళ్లలో గ్రాండ్‌స్లామ్‌లలో తొలి రౌండ్‌లో ఓడని పెగులా రికార్డు బద్దలైంది. ఆమె చివరిసారిగా 2020 ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లో ఓడింది. ఈ ఏడాది ఐదు సింగిల్స్ ఫైనల్స్ ఆడిన పెగులా, బాడ్ హెూంబర ఓపెన్‌లో ఇగా స్వియాటెక్‌ను ఓడించి గెలిచిన టైటిల్‌తో వింబుల్డన్‌లో దూసుకెళ్తుందని అందరి ఊహాగానాలను తలకిందులు చేసింది కొస్కియ రెట్టొ. 24 ఏళ్ల ఈ ఇటలీ ఆటగాడిణి దూకుడైన ఆటతో పెగులాను ముంచెత్తింది. 24 అన్‌ఫోర్స్డ్ ఎర్రర్స్ చేసిన పెగులా సర్వీస్‌లో విఫలమై, ఒక్క బ్రేక్ పాయింట్ కూడా సృష్టించలేకపోయింది. "పెగులాతో మ్యాచ్‌లో టెన్షన్ లేదు. దూకుడుగా ఆడాలని నిర్ణయించుకున్నా. గెలుపో, ఓటమో పర్వాలేదని బరిలోకి దిగాను. ఈ విజయం నాకు చాలా గొప్ప అనుభవం," అని కొస్కియరెట్టొ మ్యాచ్ అనంతరం తెలిపింది.



**దుబాయ్:** భారత మహిళా క్రికెటర్ స్మృతి మంధాన.. ఐసీసీ టీ20 ర్యాంకుల్లో టాప్ మూడవ బ్యాటర్‌గా నిలిచింది. వన్డేల్లో ఇప్పటికే వరల్డ్ నెంబర్ వన్ స్థానంలో ఉన్న ఆమె.. ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్ ఫస్ట్ మ్యాచ్‌లో సెంచరీ సాధించడంతో స్మృతి మంధాన తన పాయింట్ల పట్టికను మెరుగుపరు చుకున్నది. ఫస్ట్ టీ20లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌కు గాయం కావడంతో ఆ బాధ్యతలను స్మృతి మంధాన పోషించింది. మంధాన తన ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, మూడు సిక్సర్లు కొట్టింది. కేవలం 62 బంతుల్లోనే ఆమె 112 రన్స్ చేసింది. నాటింగ్‌హామ్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో ఇండియా 97 రన్స్ తేడాతో విజయం సాధించింది.

## 58 ఏళ్లుగా ఎడ్జ్‌బాస్టన్‌లో గెలవని టీమిండియా

ఇక్కడ ఇప్పటి వరకు 8 టెస్టులు ఆడిన టీమిండియా.. ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. ఏడు మ్యాచ్‌ల్లో ఓడిన టీమిండియా ఒకే ఒక్క మ్యాచ్ డ్రా చేసుకుంది. అది కూడా 39 ఏళ్ల క్రితం(1986) డ్రా చేసుకుంది. 1967 నుంచి ఈ మైదానంలో టెస్ట్ మ్యాచ్‌లు ఆడుతున్న టీమిండియా ఒక్క విజయం సాధించలేదు. 2022లో చివరిసారిగా ఇక్కడ జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ 378 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేధించింది. ఈ వేదికపై విరాట్ కోహ్లీ , రిషభ్ పంత్‌కు మెరుగైన రికార్డ్ ఉంది.ఎడ్జ్‌బాస్టన్ పిచ్ సాంప్రదాయకంగా పేస్ బౌలర్లకు అనుకూలంగా ఉంటుంది. ముఖ్యంగా తొలి రెండు రోజులు పేస్‌కు సహకరిస్తోంది. వాతావరణం చల్లగా ఉండి, పిచ్‌పై పచ్చ గడ్డి ఉంటే బంతి స్వింగ్ అవుతోంది. మ్యాచ్ సాగుతున్నా కొద్ది పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారుతోంది. ఆట ఆఖరి రోజుకు చేరితే పిచ్‌పై పగుళ్లు ఏర్పడి స్పిన్‌కు అనుకూలిస్తోంది. ఇక్క టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకోవడానికి మొగ్గు చూపుతోంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలో రెండో టెస్ట్‌లో బుమ్రా ఆడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

మాజీ వికెట్ కీపర్ బ్యాటర్ దీప్ దాస్‌గుప్తా రెండో టెస్టు కోసం భారత జట్టులో రెండు కీలక మార్పులు సూచించారు. తొలి టెస్టులో సాయి సుదర్శన్ విఫలమవడంతో, అతని స్థానంలో నంబర్ 3లో కరుణ్ నాయర్‌ను ఆడించాలని, ఆరో స్థానంలో నితీష్ కుమార్ రెడ్డిని చేర్చాలని సూచించారు. నితీష్ బ్యాటింగ్‌తో పాటు సీమ్ బౌలింగ్‌లో కొన్ని ఓవర్లు వేయగలడని, ఇది జట్టుకు అదనపు బౌలింగ్ బలాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. కరుణ్ నాయర్ గతంలో ఇంగ్లాండ్‌పై నంబర్ 3లో ట్రిపుల్ సెంచరీ సాధించిన అనుభవాన్ని, ఇటీవలి ప్రాక్టీస్ మ్యాచ్‌లలోనూ రాణించిన విషయాన్ని దాస్‌గుప్తా గుర్తు చేశారు.

# భారత్-ఇంగ్లండ్ రెండో టెస్టు

## ఎడ్జ్‌బాస్టన్‌లో జూలై 2న ఆరంభం

### నెట్స్ లో తీవ్రంగా శ్రమిస్తున్న ఇరు జట్ల ఆటగాళ్ళు



భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య రెండో టెస్టు జూలై 2, బుధవారం ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ప్రారంభం కానుంది. రెండు జట్ల ఆటగాళ్లు విజయం కోసం నెట్స్‌లో తీవ్రంగా శ్రమిస్తున్నారు. తొలి టెస్టులో విఫలమైన శార్దుల్ ఠాకూర్ (రెండు ఇన్నింగ్స్‌లలో 4 పరుగులు, 2 వికెట్లు) మరియు సాయి సుదర్శన్ (తొలి ఇన్నింగ్స్‌లో డకౌట్, రెండో ఇన్నింగ్స్‌లో 30 పరుగులు)లను టీమ్ ఇండియా మేనేజ్‌మెంట్ పక్కన పెట్టే ఆలోచనలో ఉంది. వీరి స్థానంలో నితీశ్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్‌లకు తుది జట్టులో అవకాశం రానుంది. భారత జట్టు తొలిసారిగా ప్లేయింగ్ ఎలెవెన్‌ను 48 గంటల ముందుగా ప్రకటించి ఆశ్చర్యం కలిగించింది, ఇది గతంలో ఎప్పుడూ జరగలేదు. ఇంగ్లండ్ జట్టు కూడా ముందుగానే తమ జట్టును ప్రకటించింది. జోఫ్రా ఆర్చర్‌కు రెండో టెస్టులో చోటు దక్కలేదు, తొలి టెస్టు జట్టుతోనే ఇంగ్లండ్ బరిలోకి దిగనుంది. తొలి టెస్టులో విజయం సాధించిన ఇంగ్లండ్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆధిక్యంలో ఉంది, కాబట్టి రెండో టెస్టులో ఓడినా పెద్ద నష్టం లేదని, విజేత జట్టును మార్చకూడదనే ఉద్దేశంతో ఆర్చర్‌ను ఆడించకపోవచ్చు.ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగే ఈ రెండో టెస్టులో ఇరు జట్లూ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాయి. 5 టెస్టుల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న ఇంగ్లండ్ సిరీస్‌లో మరింత పట్టు సాధించాలని, అటు భారత్ సిరీస్‌ను సమం చేయాలని ఉవ్విళ్లూరుతున్నాయి. ఈ మ్యాచ్ ఉత్కంఠభరిత పోటీకి వేదిక కానుంది.

**ఇంగ్లండ్ ఆటగాళ్ల ప్రదర్శన:**
తొలి టెస్టులో ఒలీ పోప్, బెన్ డకెట్‌లు సెంచరీలతో రాణించగా, క్రాలీ, బ్రూక్, రూట్, స్టోక్స్ ఆకట్టుకున్నారు. బౌలింగ్‌లో టంగ్, కార్స్, స్టోక్స్ అద్భుతంగా రాణించారు. రెండో టెస్టులోనూ ఇదే ఊపును కొనసాగించాలని ఇంగ్లండ్ భావిస్తోంది.రెండో టెస్టు రెండు జట్లకూ కీలకమైనది. భారత్ సమతూకం కోసం, ఇంగ్లండ్ ఆధిక్యాన్ని కొనసాగించేందుకు పోటీపడనున్నాయి. ఎడ్జ్‌బాస్టన్‌లో ఉత్కంఠభరిత పోరు ఖాయం!

**పిచ్ పరిస్థితులు:** ఎడ్జ్‌బాస్టన్ పిచ్‌లో నాలుగో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కష్టంగా ఉంటుంది. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం ఉంది. సగటు స్కోర్లు: తొలి ఇన్నింగ్స్‌లో 310, రెండో ఇన్నింగ్స్‌లో 280, మూడో ఇన్నింగ్స్‌లో 230-250, నాలుగో ఇన్నింగ్స్‌లో 170-200 పరుగులు.

**ఇంగ్లండ్ తుది జట్టు:**
జాక్ క్రాలీ, బెన్ డకెట్, ఒలీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జెమీ స్మిత్, క్రిస్ వోక్స్, గస్ అట్కిన్సన్, జేమ్స్ ఆండర్సన్, షోయబ్ బషీర్.

**టీమ్ ఇండియా తుది జట్టు**
శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, కరుణ్ నాయర్, రవీంద్ర జడేజా, నితీశ్ కుమార్ రెడ్డి, కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా/అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ.

### ఆర్చర్‌కు తుది జట్టులో చోటు లేదు

ఇంగ్లండ్ జట్టు ఆనవాయితీ ప్రకారం రెండో టెస్టు మ్యాచ్‌కు రెండు రోజుల ముందే తమ ప్లేయింగ్ ఎలెవెన్‌ను ప్రకటించింది. తొలి టెస్టులో విజయం సాధించిన జట్టుతోనే ఎడ్జ్‌బాస్టన్‌లో జరిగే ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగనుంది. అయితే, ప్రీమియర్ పేసర్ జోఫ్రా ఆర్చర్‌ను స్క్వాడ్‌లో చేర్చినప్పటికీ, తుది జట్టులో చోటు కల్పించకపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆర్చర్ ఫిట్‌నెస్‌పై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తొలి టెస్టులో ఇంగ్లండ్ పేసర్లు, ముఖ్యంగా అనుభవం లేని బౌలర్లు, తొలి వికెట్ తీయడంలో విఫలమయ్యారు, దీంతో భారత్‌కు 6 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. అయినప్పటికీ, బ్యాటర్ల అద్భుత ప్రదర్శనతో 371 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి ఇంగ్లండ్ విజయం సాధించింది.
ఆర్చర్ గతంలో మోచేతి గాయం, వెన్ను నొప్పితో క్రికెట్‌కు దూరమయ్యాడు. 2021 ఫిబ్రవరి తర్వాత ఆయన టెస్టు క్రికెట్ ఆడలేదు. ఇటీవల కౌంటీ క్రికెట్‌లో సస్సెక్స్ తరఫున ఆడి, మంచి వేగం, లైన్ అండ్ లెంగ్త్‌తో ఆకట్టుకున్నాడు. దీంతో రెండో టెస్టు స్క్వాడ్‌లో చేరినప్పటికీ, విజేత జట్టును మార్చకూడదనే టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయంతో ఆర్చర్‌ను బెంచ్‌కే పరిమితం చేశారు.

బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగే రెండో టెస్టులో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను నంబర్ 8లో ఆడించాలని సూచించారు. బర్మింగ్‌హామ్ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలమని, కుల్దీప్ బ్యాటింగ్ సామర్థ్యంతో పాటు స్పిన్ బౌలింగ్‌లో ప్రభావం చూపగలడని తెలిపారు. కుల్దీప్‌ను ఆడిస్తే, తొలి టెస్టులో విఫలమైన రవీంద్ర జడేజాను తప్పించే అవకాశం ఉందని పేర్కొన్నారు.



# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించండి

- పనులు చేసే బాధ్యత మీది.. నిధులు కేటాయించే బాధ్యత నాది
- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/ (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రికి పేద ప్రజలే వస్తారని వారికి ఇబ్బందులు లేకుండా ఉత్తమ వైద్య సేవలు అందించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు మంగళవారం జిల్లా కలెక్టర్ వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని సందర్శించి అన్ని వార్డులకు స్వయంగా వెళ్లి అందుతున్న వైద్యసేవలు సౌకర్యాలతో పాటు ఆసుపత్రికి కావాల్సిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసుపత్రిలో వైద్యసేవలు సదుపాయాలకు సంబంధించి అవసరమైన వనరులు మంజూరు చేయిస్తాననీ పని చేయాల్సిన బాధ్యత మీదేనని నిధులుకేటాయించే బాధ్యత నాదని సేవలు అందించడంలో రాజీ పడొద్దని వైద్యాధికారులకు తెలిపారు. ఆసుపత్రిలో ఏవైనా వసతులు కావాలన్నా మరమ్మతులు ఉన్న తాత్కాలికంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అన్ని విభాగాల్లో సౌకర్యాలు ఉండాలన్నారు. వైద్యాదికారులు ఎక్కువ సమయాన్ని ఆసుపత్రికి కేటాయించాలని, ముఖ్యంగా అక్సిజన్ సరఫరా, ఆరోగ్యశ్రీ, సేవల్లో అంతరాయలు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు పారిశుద్ధ్యం మంచి నీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని, సంబంధిత అధికారిని ఆదేశించారు అనంతరం వైద్యాధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. సిటీస్కాన్ తో పాటు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించాలని పలువురు అధికారులు, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ వెంటనే సిటీ స్కాన్ తో పాటు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు..

# ప్రైవేట్ క్లినిక్‌లపై టీఎంసీ టీం రైడ్స్

- స్టెరాయిడ్స్ యాంటీబయోటిక్ ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్న టీఎంసీ టీం అధికారులు
- డాక్టర్లుగా చలామణి అవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటం




**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి/ షాబాద్/(జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా షాబాద్ లోని ప్రైవేట్ క్లినిక్ లపై తెలంగాణ వైద్య మండలి సభ్యులు ఆకస్మికంగా సోమవారం తనిఖీలు చేపట్టారు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఆర్ఎంపీ డాక్టర్ల క్లినిక్ కేంద్రాలను తెలంగాణ వైద్యమండలి సభ్యులు తనిఖీలు నిర్వహించారు. రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్ల సమాచారం, ఏ రోగానికి ఏ మందులు ఇస్తున్నరని ఆరా తీశారు. ఆకస్మిక తనిఖీల్లో ఆర్ఎంపి వైద్యుల క్లినిక్‌లో స్టెరాయిడ్ ఇంజక్షన్స్ యాంటీబయాటిక్ సోడియం క్యాల్షియం గ్లూకోనైట్ డైక్లోఫినకిల్ ఇంజక్షన్లను గుర్తించారు మండల పరిధిలోని ముస్తఫా క్లినిక్ పేరుతో ముస్తఫా అనే ఆర్ఎంపి వైద్యుడు మధుశ్రీ క్లినిక్ పేరుతో భాగ్యశ్రీ అనే బిఎస్సి నర్సింగ్ చేసిన మహిళ శ్రావణ్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరుతో బాలరాజు ఓంసాయి క్లినిక్ సెంటర్ పేరుతో లింగచారి శ్రీ సాయి పేరుతో అంజయ్య జామ్ జామ్ క్లినిక్ పేరుతో మహమ్మద్ గౌస్ అంజాద్ మాస్టర్ క్లినిక్ పేరుతో వెంకటేష్ ఇలా అర్హత లేకుండా డాక్టర్లుగా చలామణి అవుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఈ ఆర్ఎంపీ లపై అధికారులు తనిఖీలు నిర్వహించారు అర్హత లేకున్నా ఇంజక్షన్లు, సెలైన్లను రోగులకు క్లినిక్ కేంద్రాల నిర్వాహకులు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. క్లినిక్ నిర్వాహకుల ఆధార్ కార్డు కాఫిని, రోగులకు వారు ఇస్తున్న ఇంజక్షన్లు మందుల శాంపిళ్లను టిఎంసి సభ్యులు తీసుకువెళ్లారు. అర్హత లేని లైసెన్సులేని అలోపతి వైద్యం చట్టం ప్రకారం నేరమని వీరిపై ఎన్ఎంసీ చట్టం 34 54 ప్రకారం కేసు నమోదు చేయనున్నట్లు ఈ చట్టం ప్రకారం ఏడాది పాటు జైలు శిక్షతో పాటు ఐదు లక్షల వరకు జరిమానా విధిస్తారని అధికారులు తెలిపారు చట్ట ప్రకారం వైద్య విద్యను అభ్యసించకుండా పరీక్షలు పాస్ అవ్వకుండా మెడకల్ కౌన్సిలర్ రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా కేవలం కొన్ని గంటలు ప్రథమ చికిత్స ట్రైనింగ్ తీసుకొని మరియు గ్రామీణ వైద్యుల సంఘాలు ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్ సంఘాల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకొని ఆ సంఘాలలో సభ్యులు సభ్యత్వం పొందినత మాత్రాన వారు చట్టం ప్రకారం అలోపతి వైద్యులుగా మెడికల్ ప్రాక్టీస్ గా అర్హత పొందినట్లు కాదన్నారు ఆకస్మికంగా రైడ్ కావడంతో షాబాద్ లో ఆర్.ఎం.పి క్లినిక్ నిర్వాహకులు ఆందోళనకు గురయ్యారు.

## జాతీయ బాక్సింగ్‌లో తెలంగాణ యువ ప్రతిభ

హైదరాబాద్‌లోని పాతబస్తీకి చెందిన యువ బాక్సర్ మీర్జా అలీ బేగ్ జాతీయ స్థాయి పోటీల్లో తన పంచ్‌లతో పతకాలను సొంతం చేసుకుంటూ తెలంగాణ పేరును మెరిపిస్తున్నాడు. చదువులోనే కాక, క్రీడల్లోనూ ముందు వరుసలో నిలుస్తూ, ఆర్థిక పరిస్థితులు అడ్డుకాదని నిరూపిస్తున్నాడు. చిన్న వయసు నుంచే బాక్సింగ్‌పై ఆసక్తి కలిగిన మీర్జా, తండ్రి మీర్జా జావేద్ బేగ్ మరియు కోచ్ సయ్యద్ హబీబ్ ముస్తాఫా ప్రోత్సాహంతో ఈ ఆటలో రాణిస్తున్నాడు. పాతబస్తీలోని రైజింగ్ సన్ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న మీర్జా, 5వ తరగతి నుంచే బాక్సింగ్‌లో సాధన ప్రారంభించాడు. కోచ్ హబీబ్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని బంగారు, కాంస్య పతకాలు సాధించాడు. తొలి సంవత్సరంలోనే అతని పట్టుదల, ప్రతిభకు అందరూ ఔరా అన్నారు. 2025 జూన్ 19-25 మధ్య హరియాణాలోని రోహతక్‌లో జరిగిన జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో మీర్జా అలీ బేగ్ అండర్ 52-54 కేజీ విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్నాడు. రాష్ట్ర స్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లోనూ బంగారు పతకాలతో దూసుకెళ్తున్నాడు. అతని ఆటతీరు జాతీయ స్థాయి బాక్సర్ నిఖత్ జరీన్‌ను పోలి ఉంటుందని కోచ్ హబీబ్ ప్రశంసించారు.

# అయ్యప్పా.. ఇదేం సేవా!

- ఎప్పుడో జరిగిన కార్యక్రమానికి నేడు చేసినట్లు ప్రచారం
- సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వైనం
- దెబ్బతింటున్న లయన్స్ ప్రతిష్ట



**బోధన్, జూలై 1 (జనంసాక్షి) :**
సేవలకు అంతర్జాతీయ స్థాయిలోనే పేరుగాంచిన లయన్స్ క్లబ్ కొంతమంది అతి ఉత్సాహం, క్రమశిక్షణ రాహిత్యంతో అభాసుపాలు అవుతుంది. ఇందుకు ఉదాహరణ మంగళవారం జరిగిన సంఘటనగా చెప్పుకోవచ్చు. ఇక వివరాల్లోకి వెళితే బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామంలో గ్రామానికి చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధి ఆధ్వర్యంలో గత నెల 9వ తేదీన గ్రామంలో ఉచిత టీబీ, క్యాన్సర్, షుగర్ క్యాంపును నిర్వహించడం జరిగింది. అయితే అదే ఫోటోను నేడు లయన్స్ గవర్నర్ పిలుపు మేరకు శుభారంభ్ లో నేడు సైతం ఉచిత టీబీ, క్యాన్సర్, షుగర్ క్యాంపును నిర్వహించినట్లు అటు లయన్స్ ప్రతినిధులకు ఇటు గ్రామస్తులకు అలాగే సోషల్ మీడియాలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పెట్టుకోవడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. జూన్ 9వ తేదీన జరిగిన కార్యక్రమాన్ని తిరిగి చేసినట్లు చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. సేవా దృక్పథంతో నడుస్తున్న లయన్స్ క్లబ్ ఇలాంటి అబద్ధపు ప్రచారం ద్వారా అభాసుపాలవుతుందని గ్రామస్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే మునుముందు ఇలాంటి తప్పుడు సేవలు, ప్రచారం కోసం ఆర్భాటం చేయకుండా నిజమైన సేవా కార్యక్రమాలు చేపట్టే విధంగా లయన్స్ ప్రతినిధులు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



### జూన్ 9వ తేదీన క్యాంపు నిర్వహించారు

### పంచాయతీ కార్యదర్శి రంజిత్ సింగ్

ఈ విషయమై జనంసాక్షి అమ్దాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రంజిత్ సింగ్ ను వివరణ కోరగా, గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో జూన్ 9వ తేదీన ఉచిత టీబీ, క్యాన్సర్, షుగర్ క్యాంపును నిర్వహించడం జరిగిందన్నారు. అయితే మంగళవారం అనగా జూలై ఒకటో తేదీన అదే క్యాంపును నిర్వహించినట్లు గ్రామానికి చెందిన ఓ లయన్స్ ప్రతినిధి ప్రచారం చేయడం జరిగిందని ఆయన వివరించారు. ఈ విషయమై సదరు ప్రతినిధికి చెప్పడం సైతం జరిగిందని పంచాయతీ కార్య దర్శి రంజిత్ సింగ్ స్పష్టం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా లయన్స్ క్లబ్ సేవలు కొనసాగించాలని ఆయన కోరారు.





# ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ తాహసిల్దార్

- రూ,10 వేలు లంచం తీసుకుంటూ అడ్డంగా బుక్కైన తలకొండపల్లి తహసిల్దార్ నాగార్జున,అటెండర్

**తలకొండపల్లి జూన్ 01(జనంసాక్షి):**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం తహసీల్దార్ నాగార్జున,అటెండర్ యాదగిరి,మంగళవారం భూమి రిజిస్ట్రేషన్ చేసే విషయంలో ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ ఎసీబీకి చిక్కాడు.మండలంలోని అంతారం గ్రామానికి చెందిన ఎనుముల సాయమ్మ కు చెందిన సర్వేనెంబర్ 42,లో 22 గుంటల భూమిని తన కొడుకులు,మనుమండ్ల పేరుమీద భూ రిజిస్ట్రేషన్ చేయడానికి జూన్ 10న స్లాట్ బుక్ చేసుకుని డాక్యుమెంటు తీసుకుని తహసిల్దార్ కార్యాలయానికి వచ్చారు.భూమి రిజిస్ట్రేషన్ చేయాలంటే ఒక్కో డాక్యుమెంటుకు రూ,2 వేల చొప్పున 6 డాక్యుమెంట్లకు కలిపి రూ,12 వేలు లంచం ఇవ్వాలని తహసీల్దార్ డిమాండ్ చేశాడు.గత 20 రోజులుగా రిజిస్ట్రేషన్ చెయ్యకుండా కాలయాపన చేశాడు.తన దగ్గర డబ్బులు లేవని సాయమ్మ,చిన్న మల్లయ్య చెప్పడంతో డబ్బులు ఇవ్వనిది రిజిస్ట్రేషన్ సాధ్యం కాదని,చివరగా రూ,10 వేలు ఇవ్వాలని బేరం కుదుర్చుకున్నాడు.లంచం ఇవ్వడానికి ఇష్టం లేని సాయమ్మ అతని కుమారుడు చిన్న మల్లయ్య 5 రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.మంగళవారం భూమి రిజిస్ట్రేషన్ కొరకు తాహసిల్దార్ కార్యాలయానికి వచ్చిన సాయమ్మ అతని కుమారులు రూ,10 వేలను అటెండర్ యాదగిరి,తహసిల్దార్ నాగార్జున కు ఇస్తుండగా రంగారెడ్డి జిల్లా డి.ఎస్.పి ఆనంద్ కుమార్,ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఏ1తహసీల్దార్ నాగార్జునతోపాటు ఎ2 అటెండర్ యాదగిరి ని అదుపులోకి విచారిస్తున్నట్లు డీఎస్పీ ఆనంద్ కుమార్ పేర్కొన్నారు.బుధవారం వారిని అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో ప్రవేశపెడతామని చెప్పారు.

# ఉపాధి కోసం వచ్చి అనంతలోకాలకు..

## సిగాచి పరిశ్రమ దుర్ఘటనలో 46 మంది మృతి



- ఆచూకీ లభించని 11 మంది కార్మికులు
- పేలుడు దాటికి చెల్లచెదురైన పరిసరాలు
- కుప్పకూలిన మూడవ అంతస్తుల భవనం
- మంటల్లో ఆహుతి అయిన కార్మికులు
- గుర్తుపట్టలేని స్థితిలో మృత దేహాలు
- రోదనలతో మిన్నంటిన పాశమైలారం పారిశ్రామిక వాడ

**సంగారెడ్డి ప్రతినిధి, జులై 01( జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా పఠాన్ చెరువు నియోజకవర్గం పాశ మైలారం సిగాచి కెమికల్స్ పరిశ్రమలో సోమవారం ఉదయం సంబందించిన భారీ పేలుడు దాటికి కార్మికుల మృతదేహాలు చెల్లాచెదురుగా పడి పోయాయి. ఇప్పటి వరకు 46 మంది మృతి చెందినట్లు అధికారులు చెబుతున్నారు. మృతుల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఉపాధి కోసం వచ్చి మంటల్లో ఆహుతి కావడంతో పాశమైలారం ఉలిక్కిపడింది. సిగాచి కెమికల్స్ భారీ పేలుళ్ల దాటికి కార్మికుల మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ప్రమాదానికి కుప్పకూలిన మూడవ అంతస్తుల భవనం శిథిలాల్లో చిక్కుకున్న అనేక మంది కార్మికులు. ఇంకా కొనసాగుతున్న సహాయక చర్యలు. గుర్తుపట్టలేని స్థితిలో కార్మికుల మృత దేహాలున్నాయి. రోదనలతో పాశమైలారం పారిశ్రామిక వాడ మిన్నంటింది. పరిశ్రమలో పనిచేస్తున్న 46 మంది కార్మికులు దుర్మరణం చెందగా అనేకమంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఇంకా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్తున్నారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జయప్రకాశ్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు కిషన్ రెడ్డి, రామచంద్రారావు , జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రవీణ, ఎస్పీ పారితోష్ పంకజ్, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.





### తెలంగాణ రైజింగ్ - 2047

# లక్ష్యం దిశగా సమాయత్తం

**సిఎస్‌తో మిషన్ కర్మయోగి బృందం భేటీ**

**లక్ష్యసాధనకు ముందుకు సాగాలని సూచన**

**హైదరాబాద్, జులై 1 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'తెలంగాణ రైజింగ్ – 2047' లక్ష్యం దిశగా ప్రభుత్వ యంత్రాంగాన్ని సమాయత్తం చేసేందుకు విభాగాల వారీగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం డా. బి. ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ 'మిషన్ కర్మయోగి' అధికారుల బృందం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ ఎస్ అధికారులతో సమావేశం అయ్యింది. సమావేశంలో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, సిబ్బందికి వారీలో నైపుణ్యాభివృద్ధి పెంచేందుకు మిషన్ కర్మయోగి చేపట్టిన శిక్షణా కార్యక్రమాలను, కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ అడ్మినిస్ట్రేషన్ సభ్యురాలు డాక్టర్ అల్కా మిట్టల్ వివరించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ మిషన్ కర్మయోగి సహకారంతో మన రాష్ట్రంలో కూడా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, సిబ్బందికి పలు శిక్షణ కార్యక్రమాలు చేపట్టేందుకు ఆయా శాఖల వారీగా తగు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, సిబ్బందికి ఈ కార్యక్రమం చాలా ప్రయోజనకరంగా ఉంటుందని తద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు సమర్థవంతంగా అమలైయ్యిందుకు ఈ శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడుతాయని అన్నారు. ఇదివరకే తెలంగాణ రాష్ట్రంలో డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ పోలీస్ అకాడమీ, ఫారెస్ట్ అకాడమీ, ఎక్సైజ్ అకాడమీ తదితర సంస్థలు సమర్థవంతంగా పలు శిక్షణా కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వ సిబ్బందికి అధికారులకు మార్గనిర్ధేశనర చేస్తున్నాయని సి.ఎస్ తెలిపారు. ఈ సమావేశంలో సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మీడియా అకాడమీ తరపున ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు చేపట్టామని ప్రత్యేక కమిషనర్ సిహెచ్ ప్రియాంక వివరించారు. అదే విధంగా సమాచార శాఖ అధికారులకు, సిబ్బందికి కూడా వృత్తి నైపుణ్యం పెంచే శిక్షణా కార్యక్రమాలు చేపడుతామని ఆమె తెలిపారు. శుసంవర్ధక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి మహేష్ దత్ ఎక్కా, జిఎడి కార్యదర్శి రఘునందన్ రావు, రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, పిసిసిఎఫ్ సువర్ణ, మహిళా సంక్షేమ కార్యదర్శి అనితా రామచంద్రన్, హెచ్ఎండిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సెర్ప్ సిఇఒ దివ్య, హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి వి.పి. గౌతమ్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్ ప్రియాంక తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# చార్మినార్ జోన్‌లోనూ పదోన్నతులకు గ్రీన్ సిగ్నల్!

**జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి నేతృత్వంలో సీసీఎల్ఏను కలిసిన నాయకులు**

**అతి త్వరలోనే ప్రారంభం కానున్న పదోన్నతుల ప్రక్రియ**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** చార్మినార్ జోన్‌లోనూ సీనియర్ అసిస్టెంట్ నుండి నాయబ్ తహసీల్దార్ వరకు పదోన్నతుల ప్రక్రియ అతి త్వరలోనే ప్రారంభం కానుందని రెవెన్యూ జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి తెలిపారు. కోర్టు కేసు కారణంగా కేవలం చార్మినార్ జోన్‌లోనే పదోన్నతుల ప్రక్రియ ఆగిపోయిందన్నారు. రాష్ట్రంలోని అన్ని జోన్లల్లో సీనియర్ అసిస్టెంట్ నుండి డిప్యూటీ తహశీల్దార్ వరకు పదోన్నతులను రెవెన్యూ జేఏసీగా ఇప్పటికే ఇప్పించడం జరిగిందన్నారు. మంగళవారం రెవెన్యూ జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి నేతృత్వంలో సీసీఎల్ఏ లోకేష్‌కుమార్‌ను డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, తదితరులు కలిసి పదోన్నతుల గురించి వివరించారు. అర్హులకు వెంటనే పదోన్నతులను ఇవ్వాలని కోరారు. చార్మినార్ జోన్‌లో కోర్టు కేసు కారణంగానే పదోన్నతుల ప్రక్రియ నిలిచిందన్నారు. కోర్టు కేసు పరిష్కారం కావడంతో ఆగిపోయిన సీనియర్ అసిస్టెంట్ నుండి నాయబ్ తహసీల్దార్ పదోన్నతులకు సంబంధించిన ప్రక్రియను చేపట్టి, వేగవంతం చేయాలని కోరారు. దీనిపై సీసీఎల్ఏ లోకేష్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. అతి త్వరలోనే పదోన్నతుల ప్రక్రియను చేపట్టి అర్హులందికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# బిఆర్ఎస్ గురించి తెలుసుకుని మాట్లాడాలి

**ప్రజలు మరోమారు కెసిఆర్ పాలన కోరుకుంటున్నారు**

**బిజెపి కొత్త అధ్యక్షుడికి మాజీ స్పీకర్ మధుసూధనాచారి చురక**



**హైదరాబాద్, జులై 1 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ పార్టీని ప్రజలు మర్చిపోయారనే బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడు మధుసూధనాచారి తెలిపారు. ఆయనకు రాజకీయలా పట్ల అవగహన లేదని అర్థం అవుతుంది.. అతడి మాటలతో ప్రజల్లో కొత్త ఉత్సాహం నింపాలి అన్నారు. బీజేపీ బీసీని అధ్యక్షుడు చేస్తారని అన్నారు.. జాక్ పాట్ లాగా రాష్ట్ర అధ్యక్షుడు అయ్యాడు రామచందర్ రావు.. ఇక, ఆయన అడుగు పెట్టగానే రాజా సింగ్ కమలం పార్టీకి రాజీనామా చేశారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ని తక్కువ చేసి మాట్లాడినంత మాత్రన మా పార్టీని తక్కువ చేసినట్లు కాదు.. దేశంలో గతం కంటే బీజేపీ స్థానాలు తక్కువ వచ్చాయి.. కానీ, తెలంగాణ సీట్లు పెరుగాయని మాజీ స్పీకర్ మధుసూదన చారి వెల్లడించారు. ఇక, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తున్నారని బీజేపీని నమ్ముతారు అని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి చెప్పుకొచ్చారు. మాటలల్లో అనేకం చెప్పి, పనుల్లో మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గ పాలన జరుగుతుంది.. తెలంగాణ ప్రజల యొక్క ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఒక్కటే పని చేస్తుంది.. శాసనసభ ఎన్నికల్లో ఎంఐఎంతో బీజేపీ పోటీ పడుతూ ఉంటుంది అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం అనేది అర్థం పర్ధం లేని మాటలు.. ఇక, ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా మాటల్లో తెలంగాణలో దోపిడీ కొనసాగితుందని తెలుస్తుంది.. మా పార్టీని బాద్నాం చేయడానికి ఈ రెండు పార్టీలు ఒకటవ్వలని చూస్తున్నాయి.. తెలంగాణ ప్రజలకు రాజకీయ పార్టీలపై స్పష్టమైన అవగాహన ఉంది.. రెండు పార్టీలు తెలంగాణ ప్రయోజనాలను చక్కదిద్దలేదు.. కేసీఆర్ పాలన పునరావృతం కావాలని ప్రజలు అంటున్నారు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు తెలంగాణలో లేదని మధుసూధనాచారి తేల్చి చెప్పారు.

# 9న సమ్మెను జయప్రదం చేయాలి

**తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్**



**గద్వాల (జనంసాక్షి) :** 9న సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్ కోరారు. జూరాల ఆయకట్టు ఆయకట్టు ఎత్తిపోతల పథకాలను, కుంటలు, చెరువులకు నీరు నింపాలని, జోగులాంబ గద్వాల జిల్లా మండల వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశ రైతాంగానికి పంటలకు గిట్టుబాటు ధరలను పదుల సంఖ్యలో పెంచి రైతాంగానికి గొప్పలు చేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నదని, ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ వేల సంఖ్యలో పెంచి రైతాంగానికి తీవ్రమైన అన్యాయం చేస్తున్నదని, అన్ని కార్మిక చట్టాలను పునరుద్ధరించి, రైతాంగానికి అన్ని పంటల ధరలను ఎమ్మెస్ స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జూరాల ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న జోగులాంబ గద్వాల జిల్లాలో నెట్టెంపాడు, ర్యాలంపాడు, ముచ్చోనిపల్లి, తాటికుంట, నాగర్ దొడ్డి సంఘాల గుడి దొడ్డి తదితర ఎత్తి పోతల పథకాలను పంపించేసి చెరువులు, కుంటలను నీరును నింపిన తర్వాతనే మిగిలిన నీరును కిందికి వదలాలని డిమాండ్ చేస్తున్నాం. విలేకరుల సమావేశంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, శంకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

# ఉన్నత మండలి ముందు ధర్నా విజయవంతం

**ఉస్మానియ యూనివర్సిటి ఐక్య విద్యార్థి సంఘాలు**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఉన్నత మండలి ముందు ధర్నా విజయవంతం అయిందని ఉస్మానియ యూనివర్సిటి ఐక్య విద్యార్థి సంఘాలు తెలిపాయి. తెలంగాణ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యతను వ్యతిరేకిస్తూ మంగళవారం ఉన్నత విద్యా మండలి ముందు నిర్వహించతలపెట్టిన ధర్నా కోసం వస్తున్న విద్యార్థి నాయకులను, కార్యకర్తలను అరెస్టులు చేయడాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఐక్య విద్యార్థి సంఘాలుగా తీవ్రంగా పరిగణిస్తున్నామని పేర్కొన్నాయి. విద్యార్థి రాజకీయాల నుండి నాయకులుగా ఎదిగిన నాయకులు వెంటనే స్పందించాలని, దేశమంతా రాజ్యాంగ విలువలను ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ తను అధికారంలో ఉన్న తెలంగాణ రాష్ట్రంలో మాత్రం ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నదని, ప్రభుత్వం ఎన్ని అరెస్టులు చేసినా, ఎంత నిర్బంధం విధించినా విద్యార్థి సమస్యలపై మా పోరాటం ఆగదని స్పష్టం చేశాయి. ఇంకా ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి సమస్యలను పరిష్కరించకపోతే ఉస్మానియా యూనివర్సిటీ ఐక్య విద్యార్థి సంఘాలుగా రాబోయే కాలంలో పెద్ద ఎత్తున క్యాంప్ ఆఫీసును ముట్టడి చేస్తామని హెచ్చరించాయి. పోలీసు నిర్బంధాలు చేధించి ఉన్నత విద్యా మండలి దాకా వచ్చిన మిత్రులు ఆజాద్, శ్రీకాంత్, అందె కృష్ణ, బారి అశోక్, అంబేద్కర్, మంద నవీన్, అర్జున్, పరశురాజ్, శ్రవణ్, ఉదయ్, సూర్య ప్రకాష్, లింగన్న యాదవ్, మధు యాదవ్, తగుళ్ల జనార్ధన్, గణేష్, సాగర్, కాశిలలకు ధన్యవాదాలు తెలపాయి.

# జగన్‌కు జడ్ కేటగిరీ భద్రత ఇవ్వండి

**హైకోర్టులో లేళ్ల అప్పిరెడ్డి పిటిషన్**

**అమరావతి, జులై 1(జనంసాక్షి) :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ భద్రత వ్యవహారంపై హైకోర్టులో వైసీపీ పిటిషన్ దాఖలు చేసింది .. వైఎస్ జగన్ నెల్లూరు జిల్లా పర్యటనలో జడ్ ప్లస్ కేటగిరి భద్రత కల్పించేటట్లు ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ హైకోర్టులో వైసీపీ లంచ్ మోషన్ పిటిషన్ వేసింది.. ఈ లంచ్ మోషన్ పిటిషన్ ను వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి దాఖలు చేశారు.. అయితే, ఈ పిటిషన్ పైన హైకోర్టు విచారణ చేపట్టింది.. మరోవైపు, వైఎస్ జగన్మోహన్ రెడ్డికి జడ్ ప్లస్ కేటగిరీ భద్రతపై రేపు కోర్టుకు సమాచారం ఇస్తామని ప్రభుత్వం తరఫున న్యాయవాది.. హైకోర్టుకు తెలియజేశారు..మరోవైపు, నెల్లూరులో వైఎస్ జగన్ హెలికాప్టర్ ల్యాండింగ్ కు అడిగిన చోట కాకుండా వేరే చోట అనుమతి ఇస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు పిటిషనర్.. అయితే, స్థానిక పరిస్థితుల దృష్ట్యా ల్యాండింగ్ ప్రాంతం నిర్ణయించినట్టు కోర్టుకు తెలియజేసింది ప్రభుత్వం.. కాగా, వైఎస్ జగన్, పల్నాడు జిల్లా పర్యటన తీవ్ర వివాదాస్పదంగా మారిన విషయం విదితమే.. జగన్ పర్యటనలో ఇద్దరు మృతిచెందడం.. జగన్‌పై కేసులు నమోదు చేయడం.. ఆ తర్వాత ఆయన బుల్లెట్ ప్రూఫ్ కారును సీజ్ చేయడం జరిగిపోయాయి.

# ఫలించిన పచ్చర్ల శీను చిరకాల వాంఛ





**అలంపూర్ (జనంసాక్షి) :** పచ్చర్ల లో సబ్ స్టేషన్ నిర్మాణం పనులు పూర్తి అయ్యి పచ్చర్ల గ్రామానికి, రైతుల వ్యవసాయ మోటర్లకు సంపూర్ణ విద్యుత్ సరఫరా అవుతూ ధగ ధగ కాంతులు వెదజల్లుతున్నది. జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం రాజోలి మండలం పచ్చర్ల గ్రామం లో విద్యుత్ స్టేషన్ పనులు పూర్తి కాబడి నేడు పూర్తి స్థాయిలో గ్రామం లోని గృహలకూ అలాగే వ్యవసాయ విద్యుత్ మోటర్లకు సప్లయ్ అవుతోంది. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ పచ్చర్ల శ్రీనివాసులు సంతోషం వ్యక్తం చేస్తూ తన సొంత గ్రామానికి సబ్ స్టేషన్ మంజూరు చేయించి సంపూర్ణంగా విద్యుత్ అందించాలని, తమ గ్రామ రైతులకు వ్యవసాయ మోటార్లకు గంతంలో విద్యుత్ సరఫరా సరిగ్గా ఉండేది కాదని, గతంలో మాకు ఐజ మండలం వెంకటా పూర్ స్టేజి లో సబ్ స్టేషన్ నుంచి మాకు సరాఫరా అయ్యేదని, సబ్ స్టేషన్ మంజూరు కోసం ఆనాడు ఉమ్మడి మహబూబ్ నగర్ ఎస్ఈగా ఉన్న గద్వాల వాసి రాములు లు తో తనకు ఉన్న పరిచయం తో మా గ్రామానికి సబ్ స్టేషన్ మంజూరు చేయాలని విన్నమించానని, ఆనాటి విద్యుత్ శాఖ మంత్రి గా ఉన్న జగదేశ్వర్ రెడ్డి అలాగే ఆనాడు టీఆర్ఎస్ ప్రభుత్వం లో జిల్లా మంత్రి గా ఉన్న జూపల్లి కృష్ణ రావు ల సహకారం తో ప్రయత్నం మొదలు పెట్టామని, వారు పచ్చర్ల గ్రామానికి సుబ్ స్టేషన్ మంజూరు చేయాలని అధికారులకు, అలాగే ఆనాటి గద్వాల డివిజన్ డీఈ శ్రీనివాసులకు అదేశాలు జారీ చేశారని తెలిపారు.. తర్వాత సుబ్ స్టేషన్ నిర్మాణం చేయాలంటే మినియం 1 ఎకర పొలం కావాలి జదికూడా మెయిన్ రోడ్డు కు ఉండాలి అది వారి ట్రాన్స్ కో నిబంధన ఉంటుందని అధికారులు తనకు తెలిపారు. పచ్చర్ల నుంచి పెద్ద తాండ్ర పాడు కు పోయే దారిలో ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించామని, ఆ భూమిని చదును చేయించి, జిల్లా అధికారుల వెంబడి పడి ఆఫీసుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగి అలాగే కాంట్రాక్టరులను వెంట పడగా ముగ్గురు మారి పూర్తి చేశామన్నారు.

# బీజేపీ పార్టీ బీసీలను అవమానించింది

**బీసీ ఇంటలెక్చువల్స్**

**హైదరాబాద్ (జనంసాక్షి) :** బీజేపీ బీసీలను అవమానించిందని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం అధ్యక్షులు టి.చిరంజీవులు, ఈసీ సభ్యులు చామకూర రాజు, డాక్టర్ అవ్వార్ వేణు, కేవీ గౌడు, చెన్న శ్రీకాంత్ ,ఒంటెద్దు నరేందర్,కొండల్ గౌడ్, ఓబీసీ విద్యార్థుల అధ్యక్షులు జి కిరణ్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో విమర్శించారు. బీజేపీ పార్టీ బీసీలను తక్కువచేసే, ఆశలు కలిగించి తరువాత అవమానించే వైఖరిని అనుసరిస్తోందని, 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ నేతలు "గెలిస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తాం" అని ప్రకటించారు. కానీ ఇది ఒక చిత్తశుద్ధితో తీసుకున్న నిర్ణయం కాకుండా, ఓట్ల కోసం వేసిన రాజకీయ మాయాజాలమేనని బీసీలు గుర్తించారని, ముందే ఎవ్వరూ అడగకుండానే అలాంటి ప్రకటన చేయడం అనేది ఓటర్లను మభ్యపెట్టే చర్య మాత్రమేనని తెలిపారు. అంతకుముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ వర్గానికి చెందిన నాయకుడి స్థానాన్ని అగ్రకుల నేతకే అప్పగించడం ద్వారా పార్టీ అసలైన వైఖరిని చూపించిందని, ఎన్నికల తర్వాత అసెంబ్లీలో ప్రతిపక్ష నేత హోదా కూడా బీసీకి ఇవ్వకుండా మళ్ళీ అగ్రకుల నాయకునికే ఇచ్చారని, ఇది బీజేపీకి బీసీలపై ఎంత ఘాటైన అలక్ష్య భావన ఉందో స్పష్టం చేస్తోందని తెలిపారు. బీసీల కుల గణన విషయంలో కూడా బీజేపీకి స్పష్టత లేదన్నారు. 2018లో గణన చేస్తామని చెప్పి, 2022 లో సుప్రీంకోర్టులో "మేము కుల గణన చేయము" అంటూ అఫిడవిట్ దాఖలు చేశారని, ఇప్పుడు మళ్ళీ గణన చేస్తామంటూ బీసీలను గందరగోళానికి గురిచేస్తున్నారని తెలిపారు. బీసీల ఆకాంక్షలను గౌరవించకుండా, వాయిదాలు వేస్తూ రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగాల్లో బీసీలకు రిజర్వేషన్లు 42%కి పెంచుతూ పంపిన రెండు బిల్లులను కేంద్ర బీజేపీ ప్రభుత్వం మూడు నెలలుగా ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టింది. ఇది బీసీల ఆకాంక్షలకు గండి కొట్టడమే ,అలాగే ఎవరు అడగకుండానే అగ్ర వర్ణాలకు 10%ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ ఇచ్చి అగ్ర వర్ణాల పట్ల తమ విధేయతను చాటు కొన్నారని, "బీజేపీకి నిజంగా బీసీలపై నమ్మకముంటే బీసీ నాయకుడినే రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించాలి. బీసీ ఉద్యమం ఉధృతంగా ఉన్నా, మళ్లీ అగ్రవర్ణాల వైపు మొగ్గు చూపడం మీ అసలైన దృష్టికోణాన్ని వెల్లడిస్తుంది. మీరు బీసీలను గౌరవించకపోతే మభ్యపెట్టే ప్రకటనలు చేయకండి. మేం సీఎం పదవి ఇస్తామంటూ హామీలు ఇవ్వకండి. బీసీలు ఇప్పుడు చైతన్యంతో ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలు మీ భవిష్యత్తు నిర్ణయిస్తారు."అని వ్యాఖ్యానించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370